నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

7 సెప్టెంబరు 1960

మూల్యం : రూపాయి

నవభారతి కార్యాలయం

టెలిగ్రామ్సు : నవభారతి   టెలిఫోన్ : 482

గాంధీనగరం * విజయవాడ-2

విషయ సూచిక

న వ భా ర తి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి 3 | విజయవాడ * సెప్టెంబరు 1960 | సంచిక 2

ప్రజాస్వామ్యము

మనము ప్రజాస్వామ్య పరిపాలనను యేర్పరచుకొన్నాము. ప్రజాస్వామ్య పరిపాలనలో పరిపాలనలోని నడవడికను అలవరచుకొన ప్రయత్నించు చున్నాము. ఈ ప్రయత్నములో మనమనేక నూతన అనుభవములను పొందుచున్నాము. ప్రజాస్వామ్యములో అభిప్రాయ భేదములుండుట సహజమని,భిన్న భిన్న అభిప్రాయముల సమైక్యతే ప్రజాస్వామ్యమని గుర్తించి ప్రవర్తించ లేక పోవు చున్నాము.

ప్రజాస్వామ్యములో భిన్నభిన్న రాజకీయ పక్షములుండును. భిన్న భిన్న రాజకీయ పక్షములలో భిన్నభిన్నమైన భేదాభిప్రాయములుండును. ఇవి అభిప్రాయ భేదములని యెవరు గ్రహించరో వారికివి తగాదాలవలె కన్పించును. ఇవి నిజమునకు తగాదాలుకావు. అభిప్రాయభేదములు. అభిప్రాయ భేదములులేనిదే ప్రజాస్వామ్యము వర్ధిల్లదు

ఒకొక్క రాజకీయ పక్షము ఒకొక్క విధమున విషయ పరిశీలన చేయును ఈ విషయ పరిశీలన చేయుటలో భిన్నాభిప్రాయములుండును. ఇది సహజము. ఈ సహజమైన భావనను యెవరు యే విధమున ఆటంకపరచవలెనని చూచినను అది అంతకంతకు ప్రబలమై విపరీత పరిణామములను నిచ్చును. కనుకనే మనము యెట్టి నిరోధముల కల్పించక స్వేచ్ఛా స్వతంత్రభావ ప్రచారమునకు ప్రాతిపదికను ఏర్పరచుకొంటిమి. యీ ప్రాతిపదికమీదనే మన భావిభాగ్యోదయము ఆధారపడి యున్నది.

ప్రజాస్వామ్యములో ప్రతిపక్షమువారి భావములను ఆకళింపుచేసుకొని స్వపక్ష ప్రయోజనమునకై కృషిచేయవలయును. ప్రతి ఒక్కపక్షము ఇదే విధమున ప్రవర్తించిన ప్రజాస్వామ్యము పురోగమించును. మనము ఉన్నతమైన, ఉత్తమమైన ప్రజాస్వామ్యమును ఏర్పరచుకొని యుంటిమి. మన ప్రజాస్వామ్యములోని స్థాయి గొప్పది. భావములు గొప్పవి. ప్రవర్తనాశీలనియమము ఉత్తమమైనది. కాని మనము యిందుకు తగిన యోగ్యతను సంపాదించుకొనుటలో తబ్బిబ్బుపడు చున్నాము. ఇందుకు మన తెలివి, సంస్కారము సంస్కృతి, సంపన్నమైనవి కాక సామాన్యమైనవిగా యుండి మన శక్తి సామర్థ్యములను వికసింపచేసుకొని ప్రజా

స్వామ్యములో ఉత్తమ పౌర బాధ్యతను నిర్వహించు యుక్తి ప్రయుక్తులను కలిగించ లేకపోవు చున్నవి.

మనలో రాజ్యాంగము చదివినవారు బహుతక్కువ. అందులో దానిని వివేచించి విపులీకరించువారు బహుతక్కువ. అంతేకాదు, ప్రజాస్వామ్య రాజ్యాంగ ప్రయోజనమును గూర్చి ప్రజోపయోగకరమైన భావ ప్రచారము చేయువారు యింకా తక్కువ. ఈస్థితి మనకు పట్టినది. మనమీస్థితినుండి బయటపడి ప్రజా స్వామ్య ప్రయోజనమును పొందవలయును.

ప్రజాస్వామ్యమనగనే కొందరు కలగూరగంపయని యనుకొను చున్నారు. ప్రకృతి సహజముగా కలగూరగంపయే. ప్రజాస్వామ్యము కలగూరగంప యని అపహాస్యము చేయువారు ప్రకృతి సౌందర్యమును అపహాస్యముపాలు చేయగల మని భావించుచున్నారనవచ్చును.

ప్రకృతి సహజముగా రమణీయమైనది. భిన్నభిన్నరీతులు గలిగి, భిన్న భిన్న రూపములుగలిగి భిన్నభిన్న స్వభావములుకలిగి వింతవింత సౌందర్య సౌభాగ్యములు కలిగి యుండును. ప్రకృతి ధర్మము యెంత రమణీయమైనదో ప్రజా స్వామ్యముకూడ అంత రమణీయమైనది.

మనము ప్రజాస్వామ్యములో నివసించుచున్ననూ మన పాత వాసనలు మనలను వీడకున్నవి. మనము బహుకాలముగా భావదాస్యములో మునిగి యుంటిమి. స్వేచ్ఛా స్వాతంత్ర వాయువులను బహు తక్కువ కాలము నుండియే పీల్చుచుంటిమి. మన మింకను పరభావ, పరదాస్యములను తొలగించుకొనలేకపోవు చుంటిమి. మనము స్వరాజ్యమును సంపాదించుకొన్ననూ స్వతంత్ర వివేచనాశక్తిని పెంపొందించుకొనుటకు ప్రయత్నించలేకపోవుచున్నాము. మనలను మనము పరిపాలించుకొనుటకు యిప్పుడిప్పుడే నేర్పును సంపాదించుకొనుచున్నాము. మన నేర్పరితనము మనలను ఉన్నతస్థాయికి తీసుకొనిపోగల శక్తిని యిచ్చుట లేదు. అందువలననే మన ప్రజాస్వామ్యములోని నడవడిక ఒడుదుడుకులతో కూడి యున్నది. ఈ ఒడుదుడుకులను సరిదిద్దుకొనుటకు పవిత్రభావము, చిత్తస్థైర్యము ఆత్మశక్తి కావలయును. ఇవి మనకు యెప్పుడు అలవడునో అప్పుడే ప్రజాస్వామ్యము వర్ధిల్లునని భావించవచ్చును.

ప్రజాస్వామ్యములో శిక్షణతో కూడిన బుద్ధి వికాసము పెంపొందించుకొనవలయును. ఎంత హెచ్చు సంఖ్యలో వ్యక్తులు బుద్ధి వికాసమును పెంపొందించుకొనెదరో అంతగా ప్రజాస్వామ్యము వికసించును.

ప్రజాస్వామ్యములో వింతవింత భావము లుదయించును. వివిధములైన కళా సౌందర్యములు భాసించును ప్రజాస్వామ్యములోని భిన్నభిన్న భావముల సౌందర్యమును చూచి ఆనందించలేనివారికి తగవుల పుట్టగా కన్పించును. ప్రజాస్వామ్యము తగవులపుట్టగా భావించువారికి సౌందర్యదృష్టి, కళా చమత్కృతి, రస భావము లోపించినదనవచ్చును. ఇవి యెవరిలో లోపించినను వారికి ప్రజాస్వామ్యము వ్యర్థముగా కన్పించును. అట్టివారికి ప్రజాస్వామ్యములో ప్రశాంతి దొరకదు. మనము వారిని గురించి యోచించవలసిన పనిలేదు. మనకు మనమే ఆత్మశక్తిని పెంపొందించుకొని ప్రతి వ్యక్తి విశేషప్రజ్ఞావంతునిగా భాసింపచేసికొనుటకే ప్రయత్నించవలయును. ఈ ప్రయత్నముల ప్రోదియే ప్రజాస్వామ్యములోని రామణీయకతకు ప్రాతిపదిక.

బృందావనమ్

శ్రీ కే. వేం. నృ. అప్పారావు

వంశీ గాన సరస్వతీ యదుపతేర్బింబాధరాన్నిస్స్రుతా
తద్గానామృత హృష్ట గోస్తన పయోధారాస్వతః ప్రస్నుతా
కాళింద్యా మిళితే ఇమే ససృజతుర్యత్ర త్రివేణీం పరాం
తద్రాధారమణ ప్రియం విజయతే బృందావనం పావనమ్,

నాయం వ్రజో దుగ పయోధి రస్మిన్
నోపూత నాఽసౌగురు కాలకూటః
స్తనంధయో నందసుతశ్చ నాయం
శ్రీకంఠ ఏవ శ్రిత పారిజాతః.

అయం నమంథః కిల, మందరాద్రిః
నేనం దధి, క్షీరసముద్ర భంగః
నేమాశ్చ గోప్యో దివిజాశ్చ దైత్యాః
పీయూష మేత న్నవనీతరూపమ్.

యాగోకులోత్పన్న మశేష గవ్యం
గోపాల కేభ్యః ప్రదదాతి నిత్యం
సర్వం వ్రజం యామనుతే స్వగేహం
కృష్ణ ప్రియా సాదివిజా,నగోపీ!

యాగోకులోత్పన్న మశేష గవ్యం
విక్రేతు కామా మధురానగర్యాం
గోప శ్రమాప్తం మనుతే స్వకీయం
కృష్ణా ప్రియాసా దితిజా, నగోపీ!

అవ్యాజ కారుణ్య వతః శ్రియేద్వే
అతో జగన్మోహన వేషధారీ
గృహేగృహే గుప్తమశేష గవ్యం
అదాప యద్గోప కిశోర కేభ్యః.

తదీయ వేణుస్వన ముగ్ధచేతసః
స్వయం సమానీయ నకేవలం దధి
సమర్పయామాసురపి స్వజీవనం
సమస్తగోప్యః కిలసామ్యయోగినే.

విశ్వనాథమధ్యాక్కఱలు

కుల (మా) స్వామి శతకము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

౨

క్రిందినుంచియును బైదాఁక శ్వాసదీర్ఘీకరించి తరు
ణేందు చూడామణీ! పాముతోఁకపై నిల్చు చందమున
ఁబొందు వెన్నెముక వెంబడిఁ బినాకంబు పూనియుంటివని
యందునా! నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

•
చందిరురేక వెన్నొసట నీడవారగా సౌరాంబు వీచి
యొందిన మెదడులోఁ జలువ చెమ్మలు నురళింపఁదలకు
ఁజెందించిన తలగ నిన్ను నిరతంబు చింతించుచుండ
నందువా! నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

ఒందిన యైదుభూతములతో నున్న యున్కి మేనౌచు
కందును దిందుననంగఁ గమలాస్త్రకమలారు లౌచు
నిందునే నన యజమాఁనుడీ వౌచు నేను వేఱొకడ
నందునా! నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

కందనకాయ యాడునన నూపిరి కదలుచున్నదన
చిందిపోయెడు నట్టి యూహాలోకచోటఁ జేరుచున్నదన
మందమై చలువలు క్రమ్మ వనరుద్ర మసల విచ్చోట
నందునా! నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

బొందిలోఁ బ్రాణమ్ములనుచు నుంటనీ పొలుపు ప్రాణమ్ము
లందాడుచుంట నా పొలుపున నియతమై ప్రాణచయము
లందాడుచుంట నా పొలుపు నియతమ్ములగుట నీ పొలుపు
నందునా! నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

శ్రీయుతనేత్ర చిత్రములు రయ్యా నీ చిద్విలాసములు
వేయిరకాల యొయ్యారములుగ నర్పిత హస్తకోటి
యై యున్నదగు పినాకముగ నిల్తు మత్ప్రాణాత్మ కుంభ
కాయతి నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

కన్నులకును వేడిలేని యెండయుఁ గడలేని మిన్ను
చిన్నారి మణియను దొడుగ నీయవు చేఁతలోఁగలవు
సోన్నారి వౌదువు నావియన్నట్లు చూపించుచుందు
వన్నియు నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

మున్ను కాళియ ఫణిపడగలందున మోపిన మాఱు
చిన్నారి యడుగులపైనగల మోజు చెడలేదు నీకు
వెన్ను వెంబడిఁ జిత్రముగను ద్రోక్కెదు విరిసిపోయెదన
యన్నలా! నందమూర్నిలయ విశ్వేశ్వరా! కులస్వామి!

ఇవియెల్లఁ భ్రాతిభాసికములే యంచు నీసడించకు వె
శివ! భాసమైయున్న నీవయా వెన్క సేవింతుకాదె
యవ్వర ప్రతిధ్వని యధిక రమణీయ మదిదిక్కు హారగ
ప్రవణత నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

చచ్చినవారేమొ వారు చావగాఁ జావనివారు
పచ్చని యీచెట్టుమీదఁబడి తెగబావు కొందఱకు
యిచ్చట మిగిలినవారికోస మీ యేడ్చుట యంచు
నచ్చుగా నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

పానవట్టమ్మును పైని శేషాహిపడగ నిత్యములు
గా నీకుఁ దోచెడు స్వామి! వానితోఁ గలిపి ధ్యానింపఁ
గా నంగనయ్యెదు సన్నజోతిగాఁ గన్బొమల్ నడుమ
సానంద! నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

నీ విరహము దుస్సహమ్ము నీలలోహిత నీలకంధర శివ
నీ విరహమ్మునఁ బూర్వ సంగమ నిర్ణయంబనను
భావంబులో నీవు నిల్చుటయును నిల్వమియు నిద్ది నాదు
హోవళి నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

ప్రాచీ సతీగర్భ ముక్తి సుంతయుఁ బడయని యినుని
శౌచమ్ము నౌషణ్యమ్ము పగిది నుదయమ్ము సంతరింపకయ
రాచి అంపానఁ బెట్టెదవు చిత్తధారాచిత్ర బాధ
నా చెదు నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

నాదుచిత్తమున నేదో దిగులు విడనాడక యుండు
నా దిగుల్ నీవుగా నైతి భావ సంధ్యావార్షుకాబ్ద
నీదు చిత్తము నాదు భాగ్యమా సర్జనీ భూతమతి ధు
రాదీప్త! నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

ఒక్క చైతన్య మన్వస్తువుం గొంచు నుర్విని మింటఁ
బెక్కులు జీవకోట్లను సృజించుట ప్రియమైన నీకు
ఒక్క రక్షించు మన్మాటకు శతోక్తు లొప్పుట కాదె
యక్కఱ నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

నీవు నా యెదనుండి వెడలిపోయితి నిజమిద్ది శూన్య
దేవాలయంబుగాఁదోచు ఘంటారుతియు ధూపదీప
నైవేద్యములు మంత్రపుష్పమాది విన్పడక దివాంధ
రావమై నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

ఒక వేయివిధముల నెడతెఱపిలేక యుండగ నిన్ను
చికిలి వెలుఁగఁగోల వెలుగులేర్పడ్డ చిన్నారిలింగ
సుకృతాకృతిగ రూక్ష బుద్ధి నూహింతుఁజూపునకంద
వకలంక! నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

నామీద నీకింత కోపమొప్పనున్నది హేతుశతము
స్వామి! నీయందుఁజూపించినాడ నశ్రద్ధయింతయుగ
యేమో ప్రసన్నతలేని సుజన ధీహృతనైజ మృదుత
రామింతు నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

నీ యీ శరీరముల్ నడుమ మనసువంతెన కట్టియుండె
నా యీ మనస్సుతో రాకపోకలు నడచుచునుండె
నాయయ్య నన్ను నీకడకులాగు కనడిమి వంతెనను
రాయించు నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

సంసారమును వీడకుండ నెట్లైన సాధింతునా! రి
రంసామతింగాక యుండ నిన్నునారాధింతునా! ప్ర
శంసాపథంబైన జనకరాజలక్షణమందు నలువె
హంస శ్రీనందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

కాతన్త్ర వ్యాకరణం
[లఘువృత్తి సహితం]

శతావధానులు, శ్రీ శ్రీనివాస సోదరులు

౨౪.

ద్వితీయాధ్యాయము - ద్వితీయ పాదము

౧ న సఖ ష్టాదా వగ్నిః

సఖిశబ్దం టాది విభక్తుల్లో అగ్ని సంజ్ఞకం కాదు. అంటే అగ్నిసంజ్ఞకాలకు చెప్పిన "టానాఽస్త్రియామ్" (కా. ౨. ౧. ౫౩) ఇత్యాది సూత్రాలు వర్తించవు. కనుక-సఖి + టా-సఖి + ఆ సఖ్యా. సఖి + ఙే-సఖి + ఏ-సఖ్యే. సఖి+ఙా-సఖ్యౌ నిషేధంతో ప్రారంభించి చెప్పినవిధి అనిత్యమని ఒక న్యాయం వుంది కనుక "సఖినా వానరేన్ద్రేణ" అనే రామాయణ ప్రయోగంలో సఖి శబ్దానికి టావిభక్తిలో అగ్నికార్యం సాధువే అవుతున్నది.

ఉత్తర సూత్రంలో పతిశబ్దానికి 'అసమాసే' అని నిర్దేశించి యిక్కడి సఖి శబ్దానికి అలా ఏమీ నిర్దేశించనందువల్ల సమాసాన్తావయవ మైనప్పుడు గూడా సఖి శబ్దం టాది విభక్తుల్లో అగ్ని సంజ్ఞకం కాదని తేలుతున్నది. కనుక-పరమః సఖా యస్యసః పరమసఖా; పరమసఖ్యా, పరమసఖ్యే పరమసఖ్యౌ.

సమాసాన్తావయవ మైనప్పుడు సముదాయం సఖి రూపం కాదు గనుక టాది విభక్తుల్లో అగ్ని సంజ్ఞ వస్తుందని కొందరిమతం. ఆప్రకారం-పరమ సఖినా, పరమ సఖయే, పరమ సఖేః, పరమ సఖౌ అనేరూపాలుఏర్పడుతాయి

సమాసాన్తావయవ మైనప్పుడు టాది విభక్తుల్లోనే కాదు, అన్ని విభక్తుల్లోనూ అగ్ని సంజ్ఞేపొదుతుందని మరికొందరి మతం. ఆప్రకారం-పరమ సఖిః, పరమ సఖీ, పరమ సఖయః ఇత్యాదిగా హరిశబ్దంవలె అన్ని విభక్తుల్లోనూ రూపాలువస్తాయి.

సఖిమ్ అతిక్రాన్తః అతిసఖిః అనేచోట సఖి శబ్దం లక్షణంచేత ప్రహ్స్వీకారాన్త మైందిగాని అది అసలు సఖి శబ్దం కాదు గనుక దానికి అగ్ని సంజ్ఞేవస్తుంది. అతి సఖిః, అతిసఖీ, అతి సఖయః ఇత్యాదిగా హరి శబ్దం మాదిరి రూపాలు వస్తాయి

౨. పతి రసమాసే

సమాసాన్తావయవంకాని పతి శబ్దం టాది విభక్తుల్లో అగ్ని సంజ్ఞకం కాదు. పతి + ఆ పత్యా; పత్యే, పత్యుః పత్యౌ అని సఖి శబ్దం మాదిరి రూపాలు వస్తాయి సమాసాన్తావయవ మైతే సీతాపతినా, సీతాపతయే, సీతాపతేః సీతాపతౌ అని హరి శబ్దం మాదిరి రూపాలు వస్తాయి. ఇక్కడకూడా నిషేధంతో ప్రారంభించిన విధి అనిత్యం గనుక "పతినా నీయమానాయాః, పురశ్చుక్రోశ దుష్యతి". "సీతాయాః పతయేనమః", "పతౌ జీవతి యానారీ ఉపోష్యవ్రతచారిణీ, ఆయుష్యం హరతే భర్తుః సానారీ నరకం వ్రజేత్" ఇత్యాది ప్రయోగాల్లో అగ్నిరూపాలైన పతినా, పతయే, పతౌ అనేవి సమాసాన్తావయవాలు కాకపోయినా సాధువులౌతున్నాయి.

అయితే "నష్టేమృతే ప్రవ్రజితే క్లీబేచ పతితే పతౌ" అన్నచోట "పతిరిత్యాఖ్యాతః పతిః" అని కొందరు సాధించారు. అక్కడ

పెళ్ళికాకుండా ప్రధానం మాత్రం జరిగి ఫలానా ఆయన ఫలానా ఆమెభర్తఅనిపేర్కొన బడే వాడని అర్థం వస్తుంది.
ఈసాధననే మిగతావాటికూడా అనువర్తింప జేసుకోమన్నారు. కాని మిగతా ప్రయోగాల్లో ఈవిధంగాసాధిస్తే సందర్భశుద్ధి వుండదని గమనించాలి.

౩. స్త్రీ నదీవత్

విభక్తి పరమైనప్పుడు స్త్రీశబ్దం నదీసంజ్ఞకాల మాదిరి రూపాలు పొందుతుంది. ముందు చెప్పబోయే "స్త్రీ చ" (కా. ౨.౨.౬౧) అనే సూత్రంవల్ల స్త్రీశబ్దానికి విభక్తి స్వరం పరమైనప్పుడు ఈకారనానికి బదులు 'ఇయ్' వస్తుంది. స్త్రీ + ఔ- స్త్రియ్ + ఔ- స్త్రియౌ. ప్రస్తుత సూత్రం తరువాత రెండు సూత్రాల్లోనూ ఈకారానికి బదులు 'ఇయ్' వచ్చే స్త్రీ వాచకాలకు ఙవత్ప్రత్యయాలున్నూ 'ఆమ్' న్నూ పరమైనప్పుడు నదీ సంజ్ఞకాలకు వచ్చే రూపాలు రావచ్చు, రాకపోవచ్చుఅని చెప్పబడుతుంది. ఆపరిస్థితిలో స్త్రీ శబ్దానికూడా ఈవికల్పం వర్తించకుండావుండటం కోసం ప్రస్తుతసూత్రం చెప్పబడింది కనుక స్త్రీ శబ్దం ఈకారానికి బదులుగా 'ఇయ్' వచ్చేదైనప్పటికీ, తక్కిన 'ఇయ్' వచ్చే స్త్రీ వాచకశబ్దాలకుమల్లే దీనికి ఙవత్ప్రత్యయాలు 'ఆమ్'న్నూ పరమైనప్పుడువికల్పంరాకుండా నదీ సంజ్ఞకాలకు వచ్చే రూపాలు మాత్రమే వస్తాయి. స్త్రీ+ఙే - "నద్యా ఐ ఆస్ ఆస్ ఆమ్" (కా ౨.౧.౪౫) స్త్రీ+ఐ- స్త్రియ్ + ఐ-స్త్రియై- స్త్రీ+ఙస్-స్త్రీ+ఆస్- స్త్రియ్ + ఆస్- స్త్రియాః స్త్రీ+ఙి-స్త్రీ + ఆమ్ స్త్రియ్ + ఆమ్-స్త్రియామ్. స్త్రీ+ఆమ్. "ఆమి చ నుః" (కా. ౨. ౧. ౭౨) స్త్రీ + న్ + ఆమ్- "తృతీయాదౌతుపరాదిః" (కా. ౨. ౧. ౭.) స్త్రీ + నామ్- "రషృవర్ణేభ్యోనోణమనన్త్యః స్వరహయవకవర్గ పవర్గాన్తరోఽపి" (కా. ౨. ౪. ౪౮ వివరణకు చూ. సూ. ౨.౧.౧౯) స్త్రీణామ్.

౪. స్త్ర్యాఖ్యావియువౌ వామి.

విభక్తి స్వరం పరమైనప్పుడు ఈకారానికి బదులు 'ఇయ్'. ఊకారానికి బదులు 'ఉవ్' వచ్చే స్త్రీవాచక శబ్దాలకు 'ఆమ్' పరమైనప్పుడు నదీ కార్యంరావచ్చు, రాకపోవచ్చు. శ్రీ + ఆమ్- శ్రీ + న్ + ఆమ్- శ్రీణామ్; శ్రీ + ఆమ్-శ్రియ్ + ఆమ్-శ్రియామ్. ఇలానే భ్రూణామ్, భ్రువామ్. ఈకోవకే చెందిందైనా స్త్రీశబ్దానికి నదీ కార్యం మాత్రమే వస్తుంది. (చూ. పై ౩ వసూ.)

స్త్రీవాచక శబ్దాలనటంచేత పుంవాచకాలకు ప్రస్తుతసూత్రం వర్తించదు. యవక్రీ + ఆమ్ - యవక్రియ్ + ఆమ్ - యవక్రియామ్. కటప్రూ + ఆమ్- కటప్రువ్ + ఆమ్- కటప్రువామ్ అనేరూపాలు మాత్రమే వస్తాయి.

౫. హ్రస్వశ్చ ఙవతి

'ఇయ్' 'ఉవ్' వచ్చే స్త్రీవాచక శబ్దాలకూ ఇకార-ఉకారాన్త స్త్రీవాచక శబ్దాలకూ ఙవత్ప్రత్యయాల్లో నదీ కార్యం రావచ్చు రాకపోవచ్చు. శ్రీ + ఙే- "నద్యాఐఆస్ఆస్ఆమ్" (కా. ౨. ౧. ౪౫) - శ్రీ + ఐ- శ్రియ్ + ఐ- శ్రియై; పక్షాన్తరంలో- శ్రీ + ఙే- శ్రీ + ఏ- శ్రియ్ + ఏ-శ్రియే. శ్రీ + ఙస్- శ్రీ + ఆస్- శ్రియ్ + ఆస్ శ్రియాః; శ్రీ + ఙస్- శ్రీ + అస్- శ్రియ్ + అస్-శ్రియః. శ్రీ + ఙి- శ్రీ + ఆమ్- శ్రియ్ + ఆమ్-శ్రియామ్; శ్రీ + ఙి- శ్రీ + ఇ- శ్రియ్ + ఇ-శ్రియి. భ్రూశబ్దానికి 'ఉవ్' వచ్చి ఇలానే భ్రువై, భ్రువే, భ్రువాః, భ్రువః; భ్రువామ్, భ్రువి అనే రూపాలు వస్తాయి. ఇకారాన్త స్త్రీవాచకమైన మతిశబ్దానికి నదీ కార్యాలూ అగ్నికార్యాలూ వికల్పంగా వస్తాయి, కనుక-మత్యై, మతయే: మత్యాః, మతేః; మత్యామ్, మతౌ. ఇలానే ఉకారాన్త స్త్రీవాచకమైన ధేను శబ్దానికిన్నీ ధేన్వై, ధేనవే; ధేన్వాః; ధేనోః; ధేన్వామ్, ధేనౌ.

౬. నపుంసకాత్స్యమోర్లోపః;
నతదుక్తమ్.

నపుంసక లిఙ్గానికి పరమైన 'సి' 'అమ్' లోపిస్తాయి; 'సి' 'అమ్' పరమైనప్పుడు లిఙ్గానికి శాసించబడిన మార్పులు జరగవు. పయస్ + సి- "అత్వసన్తస్యచాధాతోః సౌ" (కా. ౨. ౨. ౨౦) అనే సూత్రంవల్ల 'అస్' అన్తమందున్న ధాతు లిఙ్గాలుకాని శబ్దాలకు 'సి' పరమైనప్పుడు ఉపధా దీర్ఘం వస్తుందని చెప్పబడింది. కాని ప్రస్తుతసూత్రంలో నపుంసకాలకి 'సి' 'అమ్' లోపంతోపాటు అవి పరమైనప్పుడు వచ్చేమార్పులకు నిషేధంకూడా చెప్పబడింది కనుక ఇక్కడ ఉపధా దీర్ఘం రాదు. పయస్ + సి-'సి'లోపించగా-పయస్-పయః పయస్ + అమ్ - పయస్ - పయః అయితే గోశబ్దానికి విశేషణంగా 'సుపయస్' శబ్దం ప్రయోగించేటప్పుడు అది స్త్రీలిఙ్గం కనక-సుపయస్ + సి-సుపయాస్ + సి- "వ్యఞ్జనాచ్చ" (కా. ౨ ౧. ౪౯) అనే సూత్రంవల్ల 'సి'లోపించగా-సుపయాస్-సుపయాః అవుతుంది. సుపయాః గౌః. వారి+సి-వారి, మధు+సి-మధు, కర్తృ+సి-కర్తృ. ఇలానే వారి + అమ్-వారి; మధు+అమ్ - మధు; కర్తృ + అమ్-కర్తృ

౭. అకారాదసమ్బుద్ధౌ ముశ్చ

నపుంసక లిఙ్గం చివరి అకారానికి పరమైన 'సి, 'అమ్'లోపిస్తాయి, మకారం ఆగమంగా వస్తుంది జ్ఞాన+సి,జ్ఞాన-జ్ఞాన+మ్- జ్ఞానమ్. 'అసమ్బుద్ధౌ' అనటంచేత ఈమకారాగమం సమ్బుద్ధికి వర్తించదు. హేజ్ఞాన + సి-హే జ్ఞాన అజర+సి-అజర_అజర + మ్-అజరమ్ ఇక్కడ స్వరాది విభక్తిలేదు గనుక 'జర'కు బదులు 'జరస్' రాదు. అజర+అమ్-అజర-అజర + మ్-అజరమ్. ఇక్కడి ఒక విశేషం వుంది. అజర+అమ్-స్వరాది విభక్తిపరమైంది గనక జరకు బదులు జరస్ వచ్చి, అజరస్ + అమ్- అనిఏర్పడింది. "ఒక కార్యం జరగటానికిముందు ఆకార్యానికి కారణంగా వుండిన దానికి విఘాతం కలిగించే ఏవిధీ ఆకార్యం జరిగిం తరువాత వర్తించదు" అని ఒక న్యాయంవుంది. దీన్నిబట్టి జరకు బదులు జరస్ వచ్చిం తరువాత అది రావటానికి కారణమైన స్వరాది ప్రత్యయానికి విఘాతం కలిగించే ఏవిధీవర్తించదు. కనుక ఇక్కడ 'అమ్'లోపించదు. అజరస్ + అమ్-అజరసమ్ అనే రూపం సిద్ధిస్తుంది.

౮. అన్యాదేస్తుతః.

అన్య, అన్యతర, ఇతర, డతర-డతమ ప్రత్యయాన్తాలూ అన్యాదిగణం. ఇవి నపుంసకాలైనప్పుడు వీటికి పరమైన 'సి' 'అమ్'లోపిస్తాయి; తకారం ఆగమంగా వస్తుంది. అన్యత్, అన్యతరత్, ఇతరత్, కతరత్, కతమత్ ఇత్యాది ఇక్కడసూత్రంలో 'తు' అనేనిపాతంవల్ల పైసూత్రంలోంచి 'అసమ్బుద్ధౌ' అనేది అనువృత్తంకాదు. కనుక-హేఇతరత్, హేకతరత్ ఇత్యాది. అన్యతమ శబ్దం గణంలోదికాదు గనుక దానికీసూత్రం వర్తించదు. కనుక-అన్యతమమ్, హేఅన్యతమ, ఏకతరశబ్దాని కూడా ఈవిధివర్తించదు.

౯. ఔరీమ్.

నపుంసక లిఙ్గాలన్నిటికీ పరమైన 'ఔ'కు బదులు 'ఈ'వస్తుంది. జ్ఞాన + ఔ. జ్ఞాన + ఈ- జ్ఞానే పయస్ + ఔ-పయస్ + ఈ-పయసీ. అన్యతర + ఔ - అన్యతర + ఈ - అన్యతరే. వారి+ఔ-వారి + ఈ - ముందుచెప్పబోయే "నామినః స్వరే" (కా. ౨. ౨. ౧౨) అనే సూత్రంవల్ల నకారం ఆగమంగా వచ్చి-వారి + న్ + ఈ-వారిన్ + ఈ-వారిణీ అవుతుంది.

౧౦. జశ్శసోః శిః.

నపుంసక లిఙ్గాలన్నిటిక పరమైన 'జస్', 'శస్'లకు బదులు 'శి' వస్తుంది. శకారం ఇత్తు. దీనివల్ల జస్ అంతటికీ, శస్ అంతటికీ బదులు ఇకారం వస్తుందని తెలుస్తుంది. జ్ఞాన+జస్-

జ్ఞాన + ఇ - ఇక్కడ "ఘుట్ స్వరాద్ఘుటినుః" (కా. ౨. ౨. ౧౨) అనే సూత్రంవల్ల నకారం ఆగమంగా వస్తుంది. ఈఆగమం "ఆగమ ఉదను బన్ధః స్వరాదన్త్యాత్ పరః" (కా. ౨. ౧. ౬) అనేసూత్రంవల్ల లిఙ్గాన్త్యస్వరానికి చేరుతుంది. కనుక జ్ఞానన్ + ఇ అని అవుతుంది, "ఘుటి చాసమ్బుద్ధౌ" (కా. ౨. ౨. ౧౭) అనేసూత్రంవల్ల నకారాన్తలిఙ్గాలకు సమ్బుద్ధికాని ఘుట్ ప్రత్యయం పరమైనప్పుడు ఉపధా దీర్ఘం వస్తుంది. కనుక జ్ఞానాన్+ఇ-జ్ఞానాని అవుతుంది. ఇలానే పయస్ + జస్-పయస్ + ఇ-పయాన్ స్+ఇ(చూ.వివరణ,కా.౨ ౧ .౬) పయాన్ స్ + ఇ-పయాంసి, జ్ఞాన+శస్-జ్ఞానాని పయస్ + శస్-పయాంసి.

౧౧. ఘుట్ స్వరాద్ఘుటినుః.

అన్తస్థానునాసికేతరవ్యఞ్జనాలకూ స్వరాలకూ నపుంసకంలో ఘుట్ ప్రత్యయాలు పరమైనప్పుడు నకారం ఆగమంగా వస్తుంది. పద్మాని, పయాంసి, వారీణి, సుకర్తౄణి ఇత్యాది.

౧౨. నామినః స్వరే.

అవర్ణేతర స్వరాన్తమైన నపుంసక లిఙ్గానికి స్వరం పరమైనప్పుడు నకారం ఆగమంగా వస్తుంది. వారి+టా-వారి+ఆ-వారి + న్ + ఆ-వారి + నా వారిణా. కర్తృ+ఙే-కర్తృ+ ఏ- కర్తృ + న్ + ఏ- కర్తృ + నే - కర్తృణే. మధు + జస్-మధు + అస్ -మధు+న్+అస్- మధు + నస్-మధునః, మధు+ఙి-మధు+ఇ- మధు+న్ +ఇ-మధు + ని-మధుని.

౧౩. అస్థిదధిసక్థ్యక్ష్ణామన్నన్తస్తాదౌ.

నపుంసక లిఙ్గాలైన అస్థి-దధి-సక్థి-అక్షిశబ్దాలకు టాది విభక్తుల్లో స్వరాది ప్రత్యయాలు పరమైనప్పుడు లిఙ్గానికి-చివరవున్న 'ఇ' కి బదులు అన్ వస్తుంది. అస్థి + టా-అస్థన్ + టా-ఇక్కడ "అవమసంయోగాదనోఽలోపః, అలుప్తవచ్చపూర్వవిధౌ" (కా. ౨. ౨. ౫౩) అనే సూత్రం వర్తిస్తుంది. అఘుట్ స్వరం పరమైనప్పుడు 'అన్'కు ముందు వకార మకార సంయోగంలేకపోతే 'అన్'లో అకారం లోపిస్తుంది. అయితే పూర్వవర్ణానికి ('అన్' రాకముందున్న 'ఇ'కారానికి) సమ్బన్ధించిన విధి విషయంలో అకారలోపం లేనట్టే ఎంచుకోవాలి. కనుక-అస్థన్‌లో 'స్థ'లోవున్న అకారంలోపిస్తుంది. అస్థ్న్ + టా. ఇక్కడ అకారంలోపించనట్టే ఎంచుకోవాలి. ఈఅకారం వున్నప్పుడు ఈశబ్దం ఇకారాన్తంగాలేదు గనుక అగ్ని సంజ్ఞకంకాదు ఈఅకారం వున్నట్టే యెంచుకుంటున్నాం గనుక ఇక్కడ అగ్నికార్యంవిధించే "టానా" (కా. ౨.౧ ౫౩) అనేసూత్రంప్రవర్తించదు కనుక-అస్థ్న్ + ఆ అస్థ్నా అనేరూపంసిద్ధిస్తుంది. అస్థ్నా, అస్థ్నే, అస్థ్నః, అస్థ్ని. ఇలానే దధ్నా, దధ్నే, దధ్నః, దధ్ని. సక్థ్నా, సక్థ్నే, సక్థ్నః, సక్థ్ని. అక్ష్ణా, అక్ష్ణే, అక్ష్ణః, అక్ష్ణి. అయితే యిక్కడ ఙివిభక్తిలో విశేషంవుంది. ముందుచెప్పబోయే "ఈఙ్యోర్వా" (కా. ౨. ౨. ౫౪) అనే సూత్రంవల్ల ఙివిభక్తిలో అకారం లోపించవచ్చు, లోపించకపోవచ్చు. కనుక అస్థ్ని, అస్థని అనేరెండు రూపాలుంటాయి. ఇలానే దధ్ని, దధని; సక్థ్ని, సక్థని, అక్ష్ణి, అక్షణి.

౧౪. భాషితపుంస్కంపుంవద్వా.

ఏశబ్దం పుంలిఙ్గంగావుండి అదే అర్థంలో ఇతరలిఙ్గాల్లోగూడా ప్రయోగించబడుతుందో దానికి భాషితపుంస్కమని పేరు. ధార్మికో రాజాశుచిః. పతివ్రతానారీశుచిః. తోయం శుచి. శుచిశబ్దం పులింగంగానూవుంది. అదే అర్థంలో యితరలిఙ్గాలుగానూవుంది కనుక యిది భాషితపుంస్కం. అవర్ణేతర స్వరాన్తాలైన నపుంసకలిఙ్గాలకు అవి భాషితపుంస్కాలైనట్టయితే నపుంసకలిఙ్గరూపాలేగాక పుంలిఙ్గరూపాలుగూడా రావచ్చు. శుచి+టా-శుచి + ఆ - శుచి + న్ + ఆ - శుచి + నా - శుచినా. ఇక్కడ పుంలిఙ్గరూపంకూడాఅగ్నికార్యంవచ్చి శుచి + టా-శుచి + నా-శుచినా

అనే అవుతుంది. శుచి + ఙే-శుచి + ఏ-శుచి + న్ + ఏ-శుచి + నే - శుచినే, పుంలిఙ్గరూపం - శుచి + ఙే-శుచే + ఙే-శుచే + ఏ-శుచయ్ + ఏ-శుచయే. శుచి + జస్-శుచి + అస్-శుచి + న్ + అస్-శుచి + నస్-శుచినః, పుంలిఙ్గరూపం-శుచి + జస్-శుచే + జస్-శుచే + అస్-శుచేః. శుచి + ఙి-శుచి + ఇ-శుచి + న్ + ఇ శుచి + ని-శుచిని. పుంలిఙ్గరూపం-శుచి + ఙి-శుచ్ + ఔ-శుచౌ. ఇలానే పటునే-పటవే; పటునః-పటోః, పటుని-పటౌ. కర్తృణా-కర్త్రా; కర్తృణే-కర్త్రే, కర్తృణః-కర్తుః; కర్తృణి-కర్తరి. భాషితపుంస్కం కానిదానికైతే - వారిణా, వారిణే, -వారిణః, వారిణి -ఇలా నపుంసకరూపాలు మాత్రమే వుంటాయి. ప్రస్తుతవిధి నామ్యన్తాలకు మాత్రమే వర్తిస్తుంది గనుక - జ్ఞానేన, జ్ఞానాయ, జ్ఞానాత్, జ్ఞానస్య, జ్ఞానే. సోమపేన, సోమపాయ, సోమపాత్, సోమపస్య. సోమపే ఒక శబ్దం పుంలిఙ్గంగానూ నపుంసకలిఙ్గంగానూ వున్నా అర్థభేదంవుంటే అది భాషితపుంస్కంగా ఎంచబడదు; అందుచేత దానికి పుంలిఙ్గరూపాలు (నపుంసకంలో) రావు. పీలుశబ్దం పుంలిఙ్గంలో గోగుచెట్టుకూ నపుంసకలిఙ్గంలోదాని ఫలానికీ వర్తిస్తుంది. కనుక నపుంసకంలో పీలునా, పీలునే, పీలునః, పీలుని అనేరూపాలు మాత్రమేవస్తాయి. పుంరూపాలు రావు.

౧౫. దీర్ఘమామి సనౌ.

అవర్ణేతర స్వరాన్తమైనలిఙ్గానికి నకారాగమంతోగూడిన 'ఆమ్' పరమైనప్పుడు అన్త్యస్వరం దీర్ఘమౌతుంది. అగ్ని + ఆమ్- "ఆమిచనుః" (కా. ౨. ౧. ౭౨) -అగ్ని + న్ + ఆమ్ "తృతీయాదేతుపరాదిః" (కా. ౨. ౧. ౭)-అగ్ని + నామ్ ప్రస్తుతసూత్రం ప్రకారంఅన్త్యస్వరదీర్ఘంవచ్చి, అగ్నీ + నామ్ - అగ్నీనామ్ అవుతుంది. ధేనూనామ్. కర్తౄణామ్. శుచీనామ్. పటూనామ్. కర్తృ-శుచి-పటు శబ్దాలకు నపుంసకలిఙ్గాలైనప్పుడు నకారాగమం "నామినః స్వరే" (కా. ౨. ౨. ౧౨) అనే సూత్రంవల్ల వస్తుందని గమనించాలి.

౧౬. నాన్తస్యచోపధాయాః.

"సఙ్ఖ్యాయాః ష్ణాన్తాయాః" (కా. ౨. ౧. ౭౫) అనే సూత్రం ప్రకారం షాన్త నాన్త సఙ్ఖ్యావాచక లిఙ్గాలకు 'ఆమ్' పరమైనప్పుడు నకారం ఆగమంగా వస్తుంది ఇది తృతీయాది విభక్తుల్లోది గనుక ప్రత్యయాదిని చేరుతుంది. కనుక 'న్ + ఆమ్ -'నామ్'అవుతుంది. 'నామ్' పరమైనప్పుడు నకారాన్త లిఙ్గాల ఉపధకు దీర్ఘం వస్తుంది. పఞ్చన్ + నామ్-పఞ్చాన్ + నామ్- "లిఙ్గాన్తనకారస్య" (కా. ౨. ౩. ౫౬) అనే సూత్రం ప్రకారం విరామంలోనూ, వ్యఞ్జనాది విభక్తులు పరమైనప్పుడున్నా లిఙ్గాన్తంలోవున్న నకారం లోపిస్తుంది. కనుక - పఞ్చా + నామ్ - పఞ్చానామ్ అనేరూపం సిద్ధిస్తుంది. ఇలానే సప్తానామ్, అష్టానామ్.

౧౭. ఘుటిచా సమ్బుద్ధౌ.

సమ్బుద్ధికాని ఘుట్ప్రత్యయం పరమైనప్పుడుకూడా నకారాన్త లిఙ్గాల ఉపధకుదీర్ఘం వసుంది. రాజన్ + సు-రాజాన్ + సి-"వ్యఞ్జనాచ్చ" (కా. ౨. ౧. ౪౯) అనే సూత్రం ప్రకారం 'సి' లోపించగా రాజాన్- "లిఙ్గాన్తనకారస్య" (కా. ౨. ౧. ౫౬) అనే సూత్రంచేత నకారం లోపించగా-రాజా అనే రూపం సిద్ధిస్తుంది. రాజన్ + ఔ - రాజాన్ + ఔ - రాజానౌ. రాజన్ + జస్ - రాజన్ + అస్ - రాజాన్ + అస్ - రాజానః. రాజన్ + అమ్ - రాజాన్ + అమ్ - రాజానమ్. నపుంసకలిఙ్గంలో -సామన్ + జస్- "జశ్శసోశ్శిః" (కా. ౨. ౨. ౧౦) సామన్ + శి - సామన్ + ఇ - సామాన్ + ఇ-సామాని. ఇలానే సామన్ +

శస్ - సామన్ + ఇ-సామాన్ + ఇ-సామాని సమ్బుద్ధిలో ఈవిధివర్తించదు. గనుక హేరాజన్+సి-"వ్యఞ్జనాచ్చ" (కా. ౨. ౧. ౪౯) - 'సి'లోపించగా హేరాజన్ అవుతుంది. ఇక్కడ లిఙ్గాన్త నకారస్య" (కా. ౨. ౩. ౫౬) అనే సూత్రం ప్రకారం నకారం లోపించదు. కారణం - "నసమ్బుద్ధౌ" (కా. ౨. ౩. ౫౭) అనే ఉత్తరసూత్రంచేత సమ్బుద్ధిలో లిఙ్గాన్తనకార లోపంనిషేధించబడిందిగనుక. నపుంసకంలో హేసామన్ +సి- 'సి'లోపించగా హేసామన్ అనేరూపం సిద్ధిస్తుంది. అయితే నపుంసక లిఙ్గాన్త నకారం సమ్బుద్ధిలోకూడా లోపించవచ్చును, కనుక 'హేసామ'అనేరూపంకూడా వుంటుంది.

౧౮. సాన్తమహతోర్నో పధాయాః.

సకారాన్త శబ్దాలకున్నూ మహన్త్ శబ్దానికిన్నీ సమ్బుద్ధికాని ఘుట్ ప్రత్యయం పరమైనప్పుడు సకారతకారాలతో కలిసివున్న నకారానికి ఉపధగావున్న స్వరం దీర్ఘమౌతుంది. శ్రేయన్స్+సి - శ్రేయాన్స్+సి - "వ్యఞ్జనాచ్చ" (కా. ౨. ౧. ౪౯) - 'సి'లోపించగా-శ్రేయాన్స్ - "సంయోగాన్తస్యలోపః" (కా. ౨. ౩. ౫౪) - శ్రేయాన్. శ్రేయన్స్ + ఔ - శ్రేయాన్స్ + ఔ - "మనోరనుస్వారో ధుటి" (కా. ౨. ౪. ౪౪) అనేసూత్రంచేత అన్తస్థానునాసికే తరవ్యఞ్జనానికి వెనుకనే వున్న మకారనకారాలకు బదులు అను స్వారం వస్తుంది. శ్రేయాంస్+ఔ - శ్రేయాంసౌ. ఇలానే-శ్రేయాంసః, శ్రేయాంసమ్, శ్రేయాంసౌ. మహాన్, మహాన్తౌ, మహాన్తః, మహాన్తమ్, మహాన్తౌ. సముద్ధికి విధివర్తించదుకనుక- హేశ్రేయన్స్+సి - సిలోపించగా - హేశ్రేయన్స్ - సంయోగాన్తలోపంరాగా- హేశ్రేయన్. అలానే హేమహన్, మహన్త్ శబ్దంతోకలిపి చెప్పటంచేత ఇక్కడ సకారాన్తం ధాతులిఙ్గంకాదు. క్విబన్తాలు ధాతుత్వం వదలి పెట్టవు. ధాతురూపాలే కొద్దిమార్పులతోనూ మార్పుశేమిలేకుండానూ లిఙ్గాలుగా గ్రహించబడుతుంటాయి. వాటికి క్విబన్తాలని పేరు. "హిసి హింసాయామ్" అనే ధాతువు నుండి అది ఇకారాను బన్ధంగా కలది గనుక నకారం ఉపధగాచేరి హిన్స్ అనే ధాతురూపం వస్తుంది. దాన్నే లిఙ్గంగా గ్రహించవచ్చు. 'సు' అనే ఉపసగంచేరిస్తే 'సుహిన్స్' అని అవుతుంది. దీనికి 'సి' విభక్తి ప్రత్యయం చేరిస్తే-సుహిన్స్ + సి- "వ్యఞ్జనాచ్చ" (కా. ౨. ౧. ౪౯) - 'సి' లోపించగా-సుహిన్స్. "సంయోగాన్తస్యలోపః" (కా. ౨. ౩. ౫౪)- స్ లోపించగా-సుహిన్ అనేరూపంవస్తుంది. ఇక్కడ ప్రస్తుతసూత్రం వర్తిస్తే ఇకారానికి దీర్ఘంరావాలి. కాని ఈశబ్దం క్విబన్తం కావటం చేతనూ, ధాతులిఙ్గానికి ప్రస్తుత సూత్రం వర్తించదుకనుకనూ ఇకారానికి దీర్ఘంరాదు. సుహిన్, సుహింసౌ, సుహింసః, సుహింసమ్, సుహింసౌ, హేసుహిన్.

౧౯. అపశ్చ

సమ్బుద్ధికాని ఘుట్ ప్రత్యయం పరమైనప్పుడు అప్ శబ్దంలో నకారం ఉపధగా వున్నా లేకపోయినా అకారం దీర్ఘమవుతుంది, 'అప్' శబ్దం నిత్య బహువచనాన్తం. అప్+జస్-ఆప్ + జస్-ఆప్+ అస్-ఆపః.దీనికి జస్ ఒక్కటే ఘుట్ ప్రత్యయం. (స్త్రీలిఙ్గం- కేవలం బహువచనమూ కనుక) కాని నపుంసక లిఙ్గంలో ప్రయోగించవలసి వచ్చినప్పుడు జస్, శస్‌లు ఘుట్ ప్రత్యయాలౌతాయి. స్వప్ + జస్-స్వప్ + శి- స్వప్ + ఇ - "ధుట్

స్వరాద్ఘుటినుః" (కా. ౨. ౨. ౧౧).-స్వన్ వ్ + ఇ - ప్రస్తుత సూత్రంచేత స్వాన్ వ్ + ఇ - "మనోరనుస్వారోధుటి" (కా. ౨. ౪. ౪౪)- స్వాంవ్ + ఇ- "వర్గే వర్గాన్తః" (కా. ౨. ౪. ౪౫) అనేసూత్రంచేత వర్గాక్షరం పరమైనప్పుడు అనుస్వారం ఆవర్గానికి చెందిన పఞ్చమాక్షరంగామారుతుంది. కనుక స్వామ్పి-స్వామ్పి. అనే రూపం సిద్ధిస్తుంది. స్వామితట్రాకాని. సమ్బుద్ధికి ఈసూత్రం వర్తించదు గనుక - హే అపః, హేస్వప్.

౨౦. అన్త్వసన్తస్య చాధాతోఃసౌ.

సమ్బుద్ధికాని 'సి' ప్రత్యయం పరమైనప్పుడు ధాతువులుకాని లిఙ్గాల చివరవుండే 'అన్త్' 'అస్' ల అకారం దీర్ఘమౌతుంది. భవన్ త్+సి-భవాన్ త్+సి- "వ్యఞ్జనాచ్చ" (కా. ౨. ౧. ౪౯)- 'సి' లోపించగా - "భవాన్ త్-" "సంయోగాన్తస్యలోపః" (కా. ౨. ౩. ౫౪)-భవాన్. ఇలానే గోమన్త్- గోమాన్. సుమనస్+సి-సమనాస్- "రసకారయోర్విసృష్టః" (కా. ౩. ౮. ౨) - సుమనాః. సమ్బుద్ధిలోనైతే-హేగోమన్. హేసుమనః. ప్రస్తుత సూత్రంలో చెప్పినట్టు దీర్ఘంరాదు.

(సశేషం)

శ్రీ భరతముని ప్రణీత

నాట్యశాస్త్రమ్

ఆంధ్రభారతి

డాక్టర్, శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి, ఎం. ఏ., ఎం. లిట్, పిహెచ్. డి.

షష్ఠోఽధ్యాయః

రస ప్రకరణము

నిర్వేద గ్లాని శఙ్కాఖ్యా స్తథాసూయా మదఃశ్రమః
ఆలస్యంచైవ దైన్యంచ చింతా మోహః స్మృతి ర్ధృతిః ౧౮
వ్రీడా చపలతా హర్ష ఆవేగో జడతా తథా
గర్వో విషాద ఔత్సుక్యం నిద్రా పస్మారఏవచ ౧౯
సుప్తం విబోధోఽమర్షశ్చా వ్యవహిత్థ మథోగ్రతా
మతి ర్వ్యాధి స్తథోన్మాద స్తథా మరణమేవచ ౨౦
త్రాసశ్చైవ వితర్కశ్చ విజ్ఞేయా వ్యభిచారిణః
త్రయస్త్రింశ దమీభావాః సమాఖ్యాతాస్తు నామతః ౨౧

నిర్వేదము, గ్లాని, శంక, అసూయ, మదము, శ్రమ, ఆలస్యము, దైన్యము, చింత, మోహము, స్మృతి, ధృతి, వ్రీడ, చపలత, హర్షము, ఆవేగము, జడత, గర్వము, విషాదము, ఔత్సుక్యము, నిద్ర, అపస్మారము, సుప్తి, విబోధము, అమర్షము, అవహిత్థ, ఉగ్రత, మతి, వ్యాధి, ఉన్మాదము, మరణము, త్రాసము, వితర్క అను ముప్పది మూడును వ్యభిచారి భావములని చెప్పబడుచున్నవి. వ్యభిచారి భావములనే సంచారి భావములందురు

సంచారి భావమనగానేమి ? భయము, కోపము, అసూయ అను వానిని సంచారి భావములుగా గ్రహింతుము. వీటిని ఆంగ్లమున "ఇమోషన్స్" అందురు. ప్రాణు లందరిచేతను ఇవి దాదాపు ఒకే ఒక విధమున అనుభవింపబడుచున్నవి. ఒకే ఒక సంచారి భావము అనేక విషయముల ద్వారా పైకి ఉబుకగలదు. సన్నివేశము నాశ్రయించుకొని సంచారి భావము ఉద్దీపితమగును భావములవలనగాని ప్రత్యక్ష దర్శనవలనగాని, శారీరక పరిణామములవలనగాని ఇది వచ్చుట కలదు. ప్రతి సంచారి భావము విశిష్ట వస్తువు నాశ్రయించుకొని బయలుదేరు, అవస్తుకముగా నుండ లేదు.

సంచారి భావములను స్థాయిభావములతోబాటు భావము లనుచున్నారు. భావమనగా చిత్తవృత్తి విశేషము. ప్రత్యక్షప్రతీతిలో అవగతమగు మార్పులనుండి బయలుదేరు సంచారి భావము ప్రవృత్తికి దోహద మొసగుచున్నది. అనగా

అనుభూయమానమగు సంచారి భావము ద్వారా తత్కారణమును తెలుసుకొనవీలగును. సంచారి భావమునకుగూడ కారణములు కలవని భావము. ఇతః పూర్వమున్న ప్రవృత్తి నాశ్రయించుకొనినదగుటచే సంచారి భావము విశిష్ట చిత్తవృత్తులవలన జన్మించినదనవచ్చును. పిల్లికూనను మనము తీసికొని వెళ్ళునప్పుడు పిల్లికి కలుగు కోపము మాతృప్రేమవలన కలుగునది, కాని మనము తీసికొని వెళ్లుటచేత కలగునదికాదు' స్థాయిభావము దీనిని ప్రవృత్తము చేయుచున్నదని భావము ఇంతేగాక స్థాయిభావమువలె సంచారి. భావములోకూడ ఇచ్ఛా, జ్ఞాన, ఆనందములు సంవలితములై ఉండును. ఈ మూటిలో నేదిలేకున్నను సంచారి భావము సమగ్రముకాదు. ఈమూటిలోను ఇచ్ఛారూపమగు ప్రవృత్తి అతి ప్రధానమైనది. మిగిలిన రెండును దీని కంగములుగా వర్తించునవి.

విషయ సంబంధములేకుండా కలుగు సంచారి భావము అర్థరహితమైనది. ఒక వస్తువు భయంకరమైనదని మన మనునపుడు భయమునుగొల్పు స్వభావము వస్తువులో అంతర్గతమైయున్నదని మరువరాదు. అనగా భయము మనమనుభవించునదైనను, వస్తువుయొక్క స్వభావనిష్ఠమని తాత్పర్యము. మంచుగడ్డ చల్లగా మనకు కన్పించుట మన వేదనయే ఐనను మంచుగడ్డలో చల్లదనము లేదనలేము. మంచుగడ్డలో చల్లదనము లేనిచో ఇతరులకుకూడ మనకుకలుగు అనుభవమే కలుగజాలదు. వస్తువుయొక్క ప్రధాన స్వభావమును నిరూపించజాలని సంచారి స్వభావము నిరర్థకము. కావుననే వ్యభిచార్యాది భావములు శుద్ధ తత్త్వరూప జ్ఞానస్వభావములని అభినవగుప్తుడనినాడు.

విశిష్టి భావాన్వితముగా సంచారి భావము ననుభవించుచున్నాము. యీ వైశిష్ట్యమును జ్ఞానాకారమనదగును. సందర్భానుసారముగా జ్ఞానముపొందు అనుభూతిరూపములే సంచారి భావములని సిద్ధమగుచున్నది. ఈ విషయమును గుర్తించవలసియున్నది. సంచారి భావ ముద్దీపితమైనదనగానే జ్ఞానను స్తబ్ధమైయుండునని మనము సామాన్యముగావించుట గలదు. ఇది పొరబాటు. సంచారి భావోద్దీపనముననే బుద్ధి ప్రచోదితమై, వికసితమై త్వరత్వరగా ప్రసరించుచున్నది.

సంచారి భావములో జ్ఞానముతోబాటు స్థాయిభావముకూడ ప్రచోదితమగుచున్నది. జ్ఞానజన్యమై, ప్రవృత్తిచోదకమై, ఉద్దిష్టార్థ ప్రాప్తినాశించునది సంచారి భావము. కాని మార్పులేక, మానసికముగా నుండు స్థాయిభావమును శాశ్వతముగా నుండుదానినిగాను, తత్కాలానుభవయోగ్యమై క్షణికమైయుండు దానిని సంచారి భావముగాను మనము స్వీకరించుచున్నాము.

సంచారి భావము విభావముకంటె విలక్షణమైనది సంచారి భావమును పరపోషకత్వమునకు తీసికొనిపోవునది విభావము. విభావము, కారణము, నిమిత్తము,

హేతువు అనునవి సమానార్థకములు. వాచిక, ఆంగిక, సాత్త్వికాభినయము వేరి ద్వారా విభావ్యమానమగుచున్నదో అవి విభావములు. స్థాయిభావమును రసముగా పరిణమింపజేయుటకు సహకారి కారణములగు విభావములు బాహ్యజగత్తులోని విషయములు లేక సన్నివేశములని భావము. ఈ విభావములు రెండు రకములు. ఇందు మొదటిది ఆలంబన విభావము. రసము ఏ వస్తువునుగాని, వ్యక్తినిగాని ఉద్దేశించి మోకరెత్తునో అది ఆలంబన విభావము. స్థాయిభావమును ప్రవృత్తిపరముగా జేయుటకిది హేతువగుచున్నది. రెండవది ఉద్దీపన విభావము. రూపము, యౌవనము, సౌందర్యము, అలంకరణములు స్థాయిభావాంతర్గతమగు సంచారి భావమును ఉద్దీపింపజేయునవగుటచే ఉద్దీపన విభావము లనబడుచున్నవి. అనగా నీరెండు విధముల విభావములు కేవలము బాహ్యజగన్నిష్ఠములేకాని, చిత్తవృత్తులుకావు. అందుచే వీటిని సంచారి భావములుగా గ్రహించరాదు. విభావానుభావసాత్త్వికభావములన్నియు రసములు కాగలవను వాదమిందుచే ఉన్మూలితమగుచున్నది.

సంచారి భావములను పరిశీలించినచో వీటి స్వభావము కొంత తెలియగలదు. భరతుడిచ్చిన ముప్పది మూడు సంచారి భావములలో కొన్నిటిని పరిత్యజింపవచ్చును గ్లాని, శ్రమ అనునవి రెండును పర్యాయ పదములగుటచే వీటిని రెంటిని స్వీకరింపనక్కరలేదు. గ్లాని లేక శ్రమయొక్క రూపాంతరమే ఆలస్యము, ఈ మూటిని ఒకే ఒక భావముగా గ్రహింపవలెను

నిద్ర, సుప్తి అనునవి మనస్సు విశ్రమించినపుడుగల దేహావస్థను తెలుపు పదములు. ఇవి శారీరకస్థితులేగాని చిత్తవృత్తులుకావు కావుననే సుప్తికి బదులు శౌచమును సాగరనంది పఠించినాడు శౌచము చిత్తవృత్తియని చెప్పనెవడును సాహసించలేదు. మరణము, అపస్మారముకూడ నిట్లే చిత్తవృత్తులుకావు. కావున వీటికి బదులు ఈర్ష్యాశమములను భోజుడు పేర్కొనినాడు. కాని భరతుని అసూయలో ఈతని ఈర్ష్య వచ్చుచున్నది. ఒకే విధమగు నిర్వేదమున శమమున్నది మతి, స్మృతి వ్యాధి, జడత అనునవి మానసిక స్థితులు లేక శారీరకస్థితులేగాని ప్రవృత్తిపరములైన చిత్తవృత్తులగు సంచారి భావములు కాజాలవు.

ఆంతరంగికమగు అనుభూతిని దాచుట అవహిత్థ అనబడును భానుదత్తుడు ఛలమును పఠించినాడుకాని, ఛలమనగా అవహిత్థయే. ఇందుగల గోపనము సంచారి భావముచే జన్మించునదేకాని సంచారిభావము మాత్రముకాదు. మదము, ఉన్మాదము, మోహము, విబోధము, చపలత, హర్షము అనునవి సందర్భవశమున సంచారి భావము కన్పరచు గుణములేకాని వేరుగాదు.

. వితర్కం, శంక అనునవి పర్యాయ పదములగుటచే వీటిలో నొకదానిని తీసివేయ వచ్చును. ఆవేగమున, ఔత్సుక్యమున తుల్యానుభూతి కలదు

యీ విధముగా భరతుడిచ్చిన ముప్పదిమూడు సంచారి భావములలో పందొమ్మిది పోగలవు. ఇక మిగిలిన సంచారి భావములు పదునాలుగు. గ్లాని. ఔత్సుక్యము, శంక, అమర్షము, అసూయ, ఉగ్రత, గర్వము, త్రాసము, దైన్యము. ధృతి, నిర్వేదము, వ్రీడ, చింత, విషాదము అను సంచారి భావములు మిగులు చున్నవి. వీటితో రతి, హాసము, శోకము, క్రోధము, భయము, ఉత్సాహము, విస్మయము, జుగుప్స అను సాయి భావములున్నవి. అమర్ష, ఉగ్రత అను సంచారి భావములు క్రోధమను స్థాయి భావముయొక్క రూపములు, దైన్య విషాదములు శోకము యొక్క రూపములు. ఉత్సాహముయొక్క రూపములు ధృతి, హర్షము అనునవి. భయానక రసమునకు త్రాసమును స్థాయి భావముగా సాగరనంది గ్రహించుచు, భయత్రాసము లభిన్నములని చూపినాడు. కాగా పదునాలుగు సంచారి భావములలోను ఆరు తగ్గగలవు. ఏ రీతిగానైనను మనము పరిత్యజించలేని సంచారి భావములు ఎనిమిది గలవు.

శారీరకస్థితులను, మానసికస్థితులను సంచారిభావములలో కన్పించుగుణములను భరతుడు సంచారిభావములుగా లెక్కించినాడు. కొన్నిస్థాయిభావములను సంచారిభావములుగా పరిగణించినాడు. అపస్మారము, నిద్ర, మరణము, సుప్తి, వ్యాధి అనునవి శారీరక స్థితులు. జడత, మతి, స్మృతి అనునవి మానసికస్థితులు అవహిత్థ, ఉన్మాదము, మదము, మోహము, విబోధము, హర్షము చపలత అనునవి సంచారిభావ గుణములు, ఉగ్రతామర్షలు, దైన్య విషాదములు, ధృతి. త్రాసము అనునవి స్థాయి భావములు. శ్రమ, గ్లాని, ఆలస్యములలో నొక్కటే గ్రహించవలెను. ఇట్లే ఆవేగౌత్సుక్యములలో నొక్కటి, శంకా వితర్కములలో నొకటి సంచారి భావములగును. ఇట్లు చేయగా ఎనిమిది సంచారి భావములే సిద్ధించగలవు. ప్రధాన సంచారి భావములు ఎనిమిది. రూపాంతరశ్లిష్టములై స్థాయి భావతుల్యములైన సంచారి భావములు అమర్ష, విషాద, ధృతి, త్రాసములను నాలుగు గలవు.

ఒక సంచారి భావము ఒకే స్థాయిభావముతో సంబంధించియుండునని చెప్పుట కష్టము. స్థాయిభావమును, తత్ప్రవృత్తిని ఆధారముగా జేసికొనివచ్చునవి సంచారి భావములు. ధృతి, ఔత్సుక్యము, దైన్యము అనునవి కోరికవలన వచ్చునవి. యీ భావములు ఉద్దిష్టార్థమునకు చెందియుండునవి. కోరిక తీవ్రముగా నున్నకొలది సంచారి భావముకూడ తీవ్రరూపమునందును ప్రాథమిక స్థాయి భావమునుంచి ఉత్పాద్యములగు నివి మిగిలిన సంచారి భావములకంటె విలక్షణములుగా కన్పించ గలవు. ఇట్లే కరుణస్థాయి యగు శోకము సంశ్లిష్ట సంచారి భావముగా ప్రతీయమాన మగుచున్నది.

భావ్యర్థ ప్రాప్తికి గాక గతార్థ విషయమును గూర్చి కోరిక బయలుదేరినచో చింత, విషాదము రాగలవు. వీటిద్వారా నిరాశ, వ్రీడ కల్గినచో పశ్చాత్తాపము

రాగలదు. చిత్తద్రవీకరణ గూడ యున్నచో శోకము వచ్చును. అసూయ తీవ్ర రూపమును దాల్చగా అమర్ష ముద్భవించును. అమర్షము, అసూయకలసినచో త్రాసము, దైన్యము ఉత్పన్నములగును. నిరాశతో భయముకలసిన విషాదముగాని, నిర్వేదముగాని వచ్చుచున్నవి. నిర్వేదమున చింతా, కన్నీరు, నిశ్వాసము, దీనతలు కలవని ప్రతాపరుద్రీయము చెప్పుచున్నది. చింత అనుభూయమాన మగునపుడు మనస్సు భావ శూన్యముగా భాసించును. ఔత్సుక్యమున ప్రత్యక్ష ప్రతీతి తీవ్ర రూపమును ధరించును. ఈ తీవ్రతవలన మనస్సు అస్థిరమై, తొట్రుపాటుపడును. ఈ చాపల్యము రాగద్వేషాదుల వలన బయలుదేరుచు మనస్సునకు అనవస్థితిని తెచ్చును. ఈ అనవస్థాన రూపమగు మనస్సు అనేక సంచారిణులకు హేతుభూత మగును. మనము ద్వేషించువానికి జయము కల్గినను, వాని ప్రవృత్తి భంగము చేయుటలో మనకు అపజయము కల్గినను నిరాశతో కూడిన క్రోధము వచ్చును. యీ స్థితిని అమర్ష మనదగును. యీ అమర్షలో ఉగ్రత తప్పనిసరిగా ఉండ గలదు.

ఆకస్మిక భయమువలన కలుగు చిత్తక్షోభమును త్రాసమందురు. ఆకస్మి కత్వమున ఆవేగాదులు రాగలవు. భయము కుతూహలముతో కూడిన విస్మయము వచ్చును. ఈ విస్మయమున హర్షము, విషాదము ధృతి గలవు. హర్ష విషాదములు ఉద్దిష్టార్థ ప్రాప్త్యప్రాప్తుల నాశ్రయించుకొనివచ్చునవి. ఇట్లేస్థాయి సంచారిణులతో సమనుగతములై మానసిక స్థితులను తెల్పునవి జడత, మతి, స్మృతి అనునవి. ఉన్మాదము, మదము, మోహము, చపలత అనునవి సంచారి భావముల తీవ్రత్వా దుల నాధారముగా చేసికొని విశిష్ట గుణములు కాగా వీనిని సంచారి భావములుగా పరిగణించుట సమంజసము కాదు.

పరస్పర సంశ్లేష రూపమున సంచారి భావములున్నచో రసమనబడుస్థితి వచ్చుచున్నది. ఇది యొక భావస్థితి. ఈ భావస్థితి స్థాయి రూపమున ప్రవర్తించుచు, విశిష్ట విషయ దర్శన కలుగగానే విశిష్టరూపమున నుద్దీపితమగును సంచారి భావ మనుభూయమానము కాకున్నను ఈ భావస్థితిరాగలదు. కొన్ని వస్తువులనుగాని, కొందరు వ్యక్తులనుగాని చూచిన వెంటనే నిష్కారణముగా మనము ప్రేమించుట గాని, ద్వేషించుటగాని, ఈ ప్రక్రియ ననుసరించియే జరుగుచున్నది. వీటినే రాగ ద్వేషము లనుచున్నాము. ఈ రాగద్వేషములు సుఖదుఃఖానుగతములై యుండును. అనగా ఒక్క స్థాయి భావమునకు ఒకే ఒక సంచారి భావముండునని చెప్పరాదు. ప్రాధానముగా నుద్దీప్తమైన సంచారి భావము ఉద్దిష్టార్థప్రాప్తికై వివిధ స్థాయి భావముల సహకారమును గ్రహించవచ్చును. ఒకే ఒక స్థాయి భావము భిన్న సంచారిణులతో సహకరించవచ్చుగూడ. ప్రతి ప్రవృత్తిలోనుగల స్థితిని, సందర్భ మును అనుసరించి ఒక భావము స్థాయియగునో, సంచారియగునో నిర్ణయించ

వలెను. ఇతర భావములను తన కంగములుగా చేసికొనునది మాత్రమే స్థాయి భావము.

స్తంభః స్వేదోఽథరోమాఞ్చః స్వరభఙ్గోఽథ వేపథుః
వైవర్ణ్య మశ్రు ప్రలయ ఇత్యష్టౌ సాత్త్వికాః స్మృతాః ౨౨

నిశ్చేష్టతగా నుండుట, చెమట పోయుట, గగుర్పాటు, గద్గదిక భాషణము, వణకుట, వివర్ణ భావమును పొందుట, కంటతడిబెట్టుట, ప్రలయము అని ఎనిమిది సాత్త్వికభావము లనబడుచున్నవి.

సాత్త్విక భావమనగానేమి? ఆభ్యంతరములుగా ననుభవింపబడునవి సంచారి భావములని, బాహ్యాముగా ప్రతీయమానములగునవి స్వేదరోమాంచాది సాత్త్వికభావములని శృంగార ప్రకాశమున భోజుడు చెప్పుచున్నాడు. బాహ్యాముగా, అనగా శారీరకముగా, ననుభవించువానిని అనుభావములు (Sensations) అందురు. ఇవి అంతర్గతమగు భావము ననుసరించి యుండునవి.

సంచారి భావమునకు అనుభావమను నర్థమును చెప్పవలసి యున్నది. విషయ దర్శన వలన కలుగు మార్పులు ప్రవృత్తి పరమగు మనస్సుచే నియంత్రితములై గహింపబడునవి, సంచారి భావ మనుభావరహితమైనచో అర్థరహితమగునని జేమ్స్ పలికినప్పుడు వాస్తవ విషయమునే గ్రహించుచున్నాడు. కాని అనుభావములకు భిన్నమైన సంచారి భావము లేదనుట పొరబాటు. శరీరము మొద్దుబారినచో సంచారి భావము ననుభవింపజాలని మాట వాస్తవమే. కాని అనుభావములు, సంచారి భావములు అవినాభావసంబంధము కలవని గుర్తించవలెను.

అనుపహితమగు మనస్సును సత్త్వమందురు. ఇట్టి మనస్సునుండి భావములు జన్మించుటచే భావములన్నియు సాత్త్వికములే యగునని శృంగార ప్రకాశలో భోజుడుపలికినాడు. కానిసమస్తభావములు సత్త్వమూలకములగుటచేసాత్త్వికములైనను, స్తంభస్వేదాదులు కేవలము సత్త్వమునుండి జన్మించుటచే వీటినే సాత్త్విక భావము లనవలెనని సింగభూపాలుడు నిర్ణయించినాడు. మనః ప్రభవమైనది సత్త్వము. సమాహితమగు మనస్సు నుండి వచ్చునది సత్త్వము. మనస్సు సమాధిలో నున్నపుడు సత్త్వనిష్పత్తి జరుగును. యీ సత్త్వము రోమాంచాది రూపమున వ్యక్తమగు చున్నది. ఒక వ్యక్తియందీ వ్యక్తీకరణ యెట్లు జరుగు చున్నదో దాని నితరుడు అనుకరించగలడేకాని, తద భిన్నముగా జూపలేడు అనగా సాత్త్వికభావములు మానసికవృత్తులవలన ఉత్పన్నములగు అనుభావములగుటచేత వ్యక్తిభేదమున భిన్నములుగా భాసించగలవు. సాత్త్విక భావానుగతమగు సంచారి భావము సుఖదుఃఖాది హేతుకమగుచు స్థాయిభావమును ప్రవృత్తిపరము చేయు చున్నది. సంచారిభావముద్దీపితముకాగా తదభివ్యక్తికితోడ్పడు శారీరక పరిణామములే సాత్త్వికభావములని తాత్పర్యము.

ఆఙ్గికో వాచికశ్చైవ హ్యాహార్యః సాత్త్వికస్తథా
చత్వారోఽభినయా హ్యేతే విజ్ఞేయా నాట్య సంశ్రయాః ౨౩
లోకధర్మీ నాట్యధర్మీ ధర్మేతి ద్వివిధః స్మృతః.

ఆంగికము, వాచికము, ఆహార్యము, సాత్త్వికము అని అభినయములు నాల్గువిధములు. ఇవి లౌకిక ప్రపంచమున కన్పించకపోవచ్చును కాని ఇవి నాట్యమునకు జీవితమువంటి వగుటచే రసాదుల తర్వాత వెంటనే చెప్పబడినవి. అభినయ స్వరూపము ముమ్ముందు విచారింపబడగలదు.

అభినయములకు లౌకిక ధర్మములతో నత్యంత సన్నిహితసంబంధములేనిచో నాట్యధర్మము, లౌకికధర్మము అని ధర్మములు రెండురకములు కావలెను. అందుచే లోకధర్మి, నాట్యధర్మి అని ధర్మిద్వయము చెప్పబడినది. తద్వారా నాట్యము లోకమునకు అనుకృతికాదని ముమ్ముందు వివరించబడగలదు.

భారతీ సాత్త్వతీచైవ కైశిక్యా రభటీతథా ౨౪
చతస్రో వృత్తయో హ్యేతా యాసునాట్యం ప్రతిష్ఠితమ్.
ఆవంతీ దాక్షిణాత్యాచ తథా చైవాంధ్ర మాగధీ ౨౫
పాంచాలీ మధ్యమాచేతి విజ్ఞేయాస్తు ప్రవృత్తయః.

దశ రూపకమున కుపకరించునవి నాలుగు వృత్తులు. వీటిని భారతి, సాత్త్వతి, కైశికి, ఆరభటి యందురు. దేశవశమున నీవృత్తు లనేకములగు నున్నవి. ఇట్టివాటిని ప్రవృత్తులందురు. ఆవంతి, దాక్షిణాత్య, ఆంధ్ర, మాగధి, పాంచాలి, మధ్యమ అని వీనినందురు.

బుద్ధ్యారంభానుభావములు వృత్తులని భోజుని మతము. వృత్తియనగా చేష్టా విశేష విన్యాసక్రమము. ఆనందవర్ధనుడు వృత్తిని వ్యవహారముగా గ్రహించినాడు. అభినవగుప్తుడు వ్యాపారముగా స్వీకరించినాడు. వాఙ్మనః కాయవ్యాపారములు వృత్తులని శృంగార ప్రకాశలో భోజుడు పలికినాడు. ప్రదర్శించు సన్నివేశము యొక్క స్వరూప స్వభావముల నభివ్యక్తము చేయునది వృత్తి. ఉదాహరణకు కైశికీ వృత్తిని తీసికొనినచో దీనియందు లాలిత్య సౌకుమార్య సహితములగు వ్యాపారములు కన్పించగలవు. అనగా దీనిని కేవలము అనుభావముగా గ్రహించ వీలులేదు. ఆరభటి కాయవృత్తి లేక చేష్టావృత్తియని, భారతి వాగ్వ్యాపారమని, సాత్త్వతి మనోవ్యాపారమని, అభినయపరముగా వ్యాఖ్యానించిన అభినవగుప్తునివాదమే సమంజసముగా కన్పించు చున్నది.

వేషవిన్యాసక్రమము ప్రవృత్తియని శృంగారప్రకాశమున భోజుడు చెప్పుచున్నాడు. చేష్టావిన్యాసకర్మవృత్తియని, వేషవిన్యాసకర్మ ప్రవృత్తియని, వచన విన్యాసకర్మరీతియని, రాజశేఖరుడు నిర్వచించినాడు. కాని భరతుడు భారతీవృత్తిని శబ్దవృత్తిగా గ్రహించుటచే వృత్తిని చేష్టావిన్యాసకర్మయనుట సంప్రదాయవిరుద్ధము.

శబ్దవృత్తియగు నీభారతీయందంతర్భావము నందునవి రీతులు. ఒకవిధముగా రీతి ప్రవృత్తులను వృత్తులరూపాంతరములుగా పరిగణింపవీలున్నది. కావుననే దాక్షిణాత్య ప్రవృత్తియగుశ్లిష్ణనేపథ్యమును భరతుడు కైశికీవృత్తిలో ప్రతిపాదించినాడు. సాత్త్వతిలో రీతులుకొంతవరకు వచ్చుచున్నవి.

లోకమున నానాదేశములు, వేషములు, భాషలు, ఆచారములు, వార్తలు గలవు. వీటిని ప్రఖ్యాపనజేయునది ప్రవృత్తియని భరతుడు చెప్పుచన్నాడు. బహు నృత్తగీతవాద్యములు, కైశికీవృత్తి, చతుర మధురలలితమగు ఆంగికాభినయములు దాక్షిణాత్యులకు చెప్పబడినవి. వైదర్భమును వివాహనేపథ్యముగాచెప్పుచు ఆంగికముగా మాలవికాగ్నిమిత్రమున కాళిదాసు ప్రస్తుతించినాడు. దాక్షిణాత్య గీత విషయమైన సుస్వరతాది ధ్వనిరామణీయకత్వము స్వాభావికముగా గలదని వక్రోక్తి జీవితమున కుంతకుడు పలికినాడు. కావుననే తత్తద్దేశోచితములగు భాషలు, క్రియలు, వేషములు కలసి ప్రవృత్తులగునని రసార్ణవ సుధాకరకారుడు చెప్ప గలిగినాడు.

ఆహార్యమునకు సంబంధించినది ప్రవృత్తియని భరతుడే చెప్పగలడు. భావ రసావస్థానుగుణముగా కేశనఖాదులతో సహా విభూషణ విన్యాసమును ప్రవృత్తిలో వచించినాడు. ఆదేశజనితమగు వేషము శోభాహేతువు గాకపోవుటచే ప్రవృత్తిని వివరించవలసి వచ్చినది. పైగా ఏజాతికి, ఏవర్ణమునకు, ఏవేషము సరిపోవునో దానిని గూడ విచారించినాడు. వేషభూషాదికము రసభావానుగుణముగా నుండవలెను. దేశ, కాల, జాతి, గుణ, వయోవస్థాదికము ననుసరించి వేషభూషాదికముతో నుండు ప్రవృత్తిని మున్ముందు భరతుడు వివరించబోవు చున్నాడు. ప్రవృత్తి యనబడు ఆహార్యము దేశ, కాల, కుల, ప్రకృతి, దశా, స్త్రీత్వ, పుంస్త్వ, షండత్వాదికమగు ఔచిత్యానుసారము విధేయమని నాట్యదర్పణముగూడ చెప్పుచున్నది.

దైవికీ మానుషీచైవ సిద్ధిః స్యాద్ద్వివిధైవతు ౩౬
శారీరాశ్చైవ వైణాశ్చ సప్త షడ్జాదయః స్వరాః.

రసభావాధికమునకు సిద్ధిపర్యవసానముండుటచే దైవికీసిద్ధి మానుషీ సిద్ధి అని రెండు విధముల సిద్ధులుగలవని చెప్పుచున్నాడు. కేవలము స్వరాలాపముకూడ ప్రయోగోప రంజకమగుటచే శారీర, వైణాది సప్తస్వరములు కలవని చెప్పబడినవి. ఇవి మున్ముందు వివేచింపబడగలవు.

ఆధునిక పదార్థ విజ్ఞానపు క్రొత్త ప్రపంచం

శ్రీ వసంతరావు వెంకటరావు

౨

మొదటి విజ్ఞానులు ప్రయోగాలుచేసిన సూక్ష్మతమమైన ద్రవ్యఖండమందున్న పరమాణువుల సంఖ్యతో లక్షటన్నుల రూపాయిలందలి రూపాయిలసంఖ్యను పోల్చిచూస్తే అదెందుకూ పనికిరాదు. అందుచేత నిర్ణాయకతభావం విజ్ఞానంలోనికి ఎలా ప్రవేశించిందో బోధపడుతుంది.

ఈసమస్యల గురించి నికరమైన జ్ఞానం మన కిప్పటికిని లేదు. కార్యకారణ భావం (causation) తుట్టతుదకు తన పూర్వస్థానాన్ని ఆక్రమిస్తుందని కొందరు విజ్ఞానులాశిస్తున్నారు, అట్టివారిసంఖ్య తగ్గిపోతూంది. విజానప్రగతితో వారిఆశలు సన్నగిల్లుతాయి, నవీన విజ్ఞానం ప్రదర్శించు జగచ్చిత్రంలో హేతువాదానికి స్థానంలేదు. జీవానికీ చైతన్యానికీ వాటితో సంబంధించిన ఇచ్ఛాస్వాతంత్ర్యానికి, విశ్వాన్నికొంతవరకైన మార్చగల మానవ సామర్థ్యానికి నేటి జగచ్చిత్రంలో ఎక్కువస్థానముంది. మనకు తెలిసినంతవరకు, నవీన విజ్ఞానం ఖండించనంతవరకు మన మెదడులోనున్న పరమాణువులను విధించుదేముళ్ళు మనమనసులే కావచ్చును. ఈపరమాణువులద్వారా మనమనసులు మన శరీరగమనాలనుమార్చి, తద్వారా మనలనావరించిన ప్రపంచస్థితిని మార్చవచ్చును. ఈఅవకాశాన్ని విజ్ఞానం నేడుకాదనలేదు. ఇచ్ఛాస్వాతంత్ర్యంలో ఆంతరంగికంగా మనకున్న విశ్వాసాన్ని చలింపచేయుడానికి మన మెదుర్కొనలేనివాదాలను విజ్ఞానం ప్రతిపాదించలేదు. పైగా, నిశ్చితత్వము హేతువాదము వర్తించనప్పుడేమౌతుందోచెప్పజాలదు. మనంగాని, ప్రకృతిగాని, బాహ్యప్రచోదనల కనుగుణంగా ప్రవర్తించకపోతే, ఘటనాక్రమాన్ని నిర్ణయించేదేది? ఏదైనాఉందంటే తిరిగి నిశ్చితత్వానికి హేతువాదానికిపోవాలి? ఏమీలేదంటే ఏసంఘటన మాత్రం ఎట్లువాటిల్లుతుంది?

కాలస్వభావం గురించి సరియైన జ్ఞానం పెంపొందేవరకు, పైప్రశ్నలకు నికరమైన జవాబులు సిద్ధించేటట్లులేదు. ప్రకృతియొక్క ప్రధాననియమాలు, మనకుతెలిసినంతవరకు, కాలమెందుకు స్థిరంగా ముందుకి సాగిపోవాలో చెప్పలేవు. కాలం ఆగిపోడానికిగాని కాలం వెనుకకు ప్రవహించడానికిగాని గల అవకాశాలను యోచించడానికే అవి సిద్ధంగానున్నాయి. కార్యకారణ సంబంధానికి ముఖ్యహేతువు కాలంయొక్క పురోగమనం దానిని, ప్రకృతి నియమాలపై ఆరోపిస్తున్నాము. కాలస్వభావంలో అది అంతర్భూతమై యుందాలేదాఅన్నది మనకుతెలియదు. కాని కాలపురోగమనాన్ని, హేతువాదాన్ని సాపేక్షతాసిద్ధాంతం కొంతవరకు ఖండిస్తుంది. దేశపరిమాణాలు మూడింటికి చేర్చవలసిన నాల్గవ పరిమాణంగా కాలాన్ని భావిస్తుంది.

కాలస్వభావ విషయమై జనించిన సమస్యయే మన భావగమనాన్ని నిరోధిస్తుంది. మనమెప్పుడూ బోధపరచుకోలేనంత క్లిష్టమైనదే కాలస్వభావమైతే, నిర్ణాయకతకు ఇచ్ఛాస్వాతంత్ర్యానికిగల వివాదాన్ని పరిష్కరించడంకూడా. బహుశః, సాధ్యంకాకపోవచ్చు.

క్వాంటం సిద్ధాంతచరిత్రలో నిర్ణాయక హేతువాదాల బహిష్కరణ ఈనడుమ సంభవించిన సంఘటన. కిరణప్రసారానికి సంబంధించిన కొన్ని విషయాలను వివరించడమే క్వాంటంసిద్ధాంతంయొక్క ముఖ్యోద్దేశము. ప్రస్తుతవిషయాన్ని అవగాహన చేసికోడానికి న్యూటన్ కాలమైన 17వ శతాబ్దం వరకు వెనుకకు పోవాలి.

కాంతికిరణం యొక్క ముఖ్యలక్షణం, స్థూలదృష్టికి, సూటిగా, ఋజుమార్గాన్న ప్రయాణం చేయడం. ధూళిగానున్నగదిలో పడు సూర్యరశ్మి సూటికర్రవలె కనిపిస్తుంది. మహావేగంగా గమించు ద్రవ్యకణంకూడా సూటిగా ప్రయాణం చేయడానికే ఉంకిస్తుంది. ఆకారణంచేత, ఒకతేజోమూర్తినుండి వెలువడు కాంతికిరణాలను కణపరంపరగా మొదటి విజ్ఞానులు భావించేరు. నిజమే. తుపాకినుండి వెలువడుగుండు సూటిగాదూసికొనిపోతుంది. ఆభావాన్నే న్యూటన్ ఆమోదించి నికరమైన కాంతికణసిద్ధాంతంగా దానిని రూపొందించాడు.

అయితే, కాంతికిరణం ఎల్లప్పుడూ సూటిగాపోదన్నది కూడా సామాన్య విషయం. ఏమంటే, అద్దంపైపడిన కాంతికిరణాన్ని ఆకస్మికంగా అద్దం పరావర్తిస్తుంది మరొక యానకంలో ప్రవేశించిన కాంతికిరణం వంగి వక్రీభవనం చెందుతుంది వక్రీభవనం చేతనే నీటిలోనున్న తెడ్డు నీటితలంవద్ద వంగినట్లు కనిపిస్తుంది. వక్రీభవనంచేతనే నదియొక్క లోతు తగ్గినట్లు కనిపిస్తుంది. ఈదృగ్విషయాలకు సంబంధించిన నియమాలు న్యూటన్ కాలంలో తెలుసును పరావర్తన విషయంలో అద్దంపైపడిన కాంతికిరణం అద్దంతో చేసిన కోణంతో, పరావర్తన కిరణం చేసిన కోణం సమానము. అనగా, నునుపైనగట్టి టెన్నిస్ కోర్టుపైపడిన టెన్నిస్ బంతి త్రుళ్ళినట్లే అద్దంపైపడిన కాంతికిరణంకూడా త్రుళ్ళిపోతుంది. వక్రీభవన విషయంలో పతనకోణం యొక్క జ్యాకి వక్రీకరణ కోణంయొక్క జ్యాకి గల నిష్పత్తి స్థిరమైనది. అద్దంయొక్క తలం వద్దను, వక్రీభవనయానకంలోను, నియతమైన బలాలు ప్రవర్తిస్తున్నాయనుకొన్న పక్షమందు తనకాంతికణాలు, పైనివివరించిన నియమాల ననుసరించి గమిస్తాయని రుజువు చెయ్యడానికి న్యూటన్ కష్టపడ్డాడు న్యూటన్ "ప్రిన్సిపియా"లో సూత్రాలు క్రిందగలవు.

XCIV సూత్రం

ఒక దానినుండి ఒకటి వేరుచేయబడిన రెండు సారూప్యయానకాలమధ్యనున్న అవకాశం యొక్క తలాలు సమాంతరంగానుండి ఆఅవకాశంలో గమించు వస్తువు ఏయానకంవైపైనా లంబదిశలో ఆకర్షింపబడి, ఇతరమైన బలాలచే వేధింపబడక పోయినయెడల, ఏతలంనుండైనా సమదూరాలలో సమఆకర్షణ కలిగి, ఆఆకర్షణ ఏతలానికైనా ఒకే వైపునను అంటే ఒకతలంపైపడిన పతనజ్యా రెండవ తలంనుండి వెలువడు బహిర్గత జ్యాకి ఒకే నిష్పత్తిఉండును.

XCVI సూత్రం

ఆవిషయాలే అంగీకరించి, పతనానికి ముందున్న గమనం తరువాతి గమనంకంటె ఎక్కువ వేగమైతే, పతనరేఖ క్రమంగా ఏటవాలైతే, తుద కావస్తువు పరావర్తనమొందుతుంది. పరావర్తనకోణం పతనకోణానికి సమానమౌతుంది.

కాంతికిరణం నీటితలంపై పడినప్పుడు దానిలో కొంతభాగంమాత్రమే వక్రీభవనం చెందుతుందన్న సత్యం న్యూటన్ యొక్క కాంతికణవాదానికి ఆఘాతం కలిగించింది. వక్రీభవనం చెందగా మిగిలినభాగం పరావర్తనం చెందుతుంది ఈభాగమే నీటిలో ప్రతిబింబాలనేర్పరుస్తుంది. దానిమూలంగా కోనేరులో చంద్రునిబింబం చక్కగాగోచరిస్తుంది. ఇట్టి పరావర్తనానికి సరియైన కారణాన్ని కణసిద్ధాంతం చూపించలేకపోయిందను అపవాద దానిపైపడింది ఏమంటే, కణాలతో కాంతిఏర్పడిందనుకొంటే నీటితలంపైనున్న బలాలు అన్నికణాలపై ఒకేవిధంగా ప్రవర్తించాలి; ఒకకణం వక్రీభవించి నప్పుడన్నికణాలు వక్రీభవించాలి. అట్టి సందర్భంలో సూర్యచంద్రనక్షత్రాల ప్రతిబింబాల నేర్పరచు సామర్థ్యం నీటికిఉండకూడదు. దీనిని ప్రతిఘటించడానికై నీటితలానికొక లక్ష

ణాన్ని న్యూటన్ ఆరోపించేడు. అదేమంటే ఒకసారి కాంతికణాలను లోనికిపంపి మరొకసారి పరావర్తించు సామర్థ్యంగలదని. కాంతి కణాలకు దారినిచ్చే ద్వారాన్ని నీటితలం తెరుస్తూ మూస్తూఉంటుందన్నాడు. తెరచినప్పుడు నీటిపైపడిన కాంతికణం నీటిలో జొరబడి వక్రీభవించగా, ఆద్వారం మూసుకొన్న క్షణంలో వచ్చినకాంతి కణాలు పరావర్తనం చెందుతాయనిన్యూటన్‌సమర్థించేడు. ఈభావం, ప్రకృతియొక్క సారూప్యాన్ని విసర్జించి సంభావ్యతాభావాన్ని ప్రవేశపెట్టు నేటిక్వాంటం సిద్ధాంతానికి పురోగామిగానున్నప్పటికి, ఆకాలంలో విజ్ఞానుల అమోదాన్ని పొందలేకపోయింది.

అంతకంటె ఎక్కువ క్లిష్టపరిస్థితుల నెదుర్కొనవలసిన అవసరం క్వాంటం సిద్ధాంతానికేర్పడింది. సూక్ష్మంగా పరిశీలించినప్పుడు, కణాలగమనాన్ని స్ఫురింపచేయు సూటిమార్గాన్న కాంతికిరణాలు ప్రయాణంచేయలేదని తెలియవచ్చింది. ఒకఇల్లు కొండవంటి పెద్దవస్తువేదైన నియతమైన నీడను కలిగించి నీడలో నున్నవారికి తుపాకి గుండ్లనుండి రక్షించు కొనునట్లు సూర్యకిరణాలనుండి కూడా రక్షించుకొను అవకాశాన్ని ఇస్తుంది. కాని, తలవెండ్రుక సన్నటితీగెవంటి సూక్ష్మపదార్థం నియతమైన నీడను కలిగించలేదు. ఒకతెరముందు అట్టివస్తువును పట్టుకొన్నప్పుడు నికరమైన నీడతెరపైపడదు. ఏదోవిధంగా కాంతికిరణాలు దానిప్రక్కనుండి వంగడచేత తెలుపు నలుపు గీతలు తెరపైపడతాయి. వాటిని "సంఘట్టన పట్టీ" (Interference band) అంటారు ఇంకొక ఉదాహరణ. ఒక అట్టలో పెద్దవృత్తాకారరంధ్రంచేసి, దానిని కాంతి దారిలో పెట్టినప్పుడు కచ్చితమైన కాంతి వలయం తెరమీద పడుతుంది ఆ రంధ్రమే చాలచిన్నదై సూదిమొనపాటి పరిమాణానికి తగ్గినప్పుడు, తెరపైపడేది చిన్ని కాంతి వలయంకాక, అంతకంటెపెద్ద ఏక కేంద్రవృత్తమండలం.ఆమండలం తెల్లటినల్లటి వలయాలు ఒకదాని ప్రక్కనొకటిఉంటాయి. వాటిని "వివర్తన వలయాలు" (diffraction rings) అంటరు సూదిమొనపాటి రంధ్రం నుండి బహిర్గమించిన కాంతిపుంజం ఫొటోగ్రాఫిక్ ప్లేటుమీదపడి చిత్రం 1లో చూపిన వలయాలను కలిగించింది.ఆరంధ్రం యొక్క వ్యాసార్థానికి పైనున్న కాంతియావత్తు ఏదో విధంగా దాని అంచు చుట్టువంగింది.

ఘనపదార్థం కాంతి కణాలను ఆకర్షిస్తుందన్న వాదానికి తార్కాణంగా ఈదృగ్విషయాలను న్యూటన్ పేర్కొన్నాడు "వర్తులంగాను చవకంగాను ఉన్ననాణేలు,కత్తులు, గాజుముక్కలు, రాతిముక్కలు: గాలిలో పీటికోణాల ప్రక్కనుండి గమించు కాంతి కిరణాలు ఆవస్తువులచే ఆకర్షింపబడినట్లు వాటిచుట్టు వంగుతాయి, వాటిగమనంలో వస్తువులకు దగ్గరగావచ్చినవి ఎక్కువ ఆకర్షింపబడినట్లు ఎక్కువగా వంగుతాయి"అని న్యూటన్ అన్నాడు.

ఈవిషయంలో కూడా నవీన విజ్ఞానానికి న్యూటన్ పురోగామియే! నేటితరంగయంత్రశాస్త్రంలోని క్వాంటం బలాలవంటివే న్యూటన్ ఊహించిన బలాలు. కాని వివర్తనను సమగ్రంగా వివరింపలేక పోవుటచేత న్యూటన్ వాదం అంగీకరింపబడలేదు.

వివర్తనం సంఘట్టనము మొదలగు దృగ్విషయాలను సమర్థించడానికి కాంతి తరంగాలతో ఏర్పడిందను భావాన్ని క్రమేణ అంగీకరించేరు. సముద్రంలో వాయువీచికలవల్ల ఏర్పడుతరంగాలవంటివే కాంతితరంగాలు. కాని, సముద్రతరంగం పొడవు కొన్ని గజాలుంటే ఒక అంగుళంలో కొన్ని వేల కాంతి తరంగాలు ఇమిడిపోతాయి. చిన్నరాతిబండచుట్టు సముద్రతరంగాలు వంగినట్లే తలవెండ్రుకవంటి చిన్నవస్తువుల చుట్టు కాంతి తరంగాలు వంగుతాయి. కొన్నిమైళ్ల పొడ

వున్న రాతిగుట్టలు సముద్రపుటొడ్డునఉంటే సముద్రతరంగాలనవి అరికట్టుతాయి; కాని, ఒక్క రాతిగుట్ట ఉన్నప్పుడు మాత్రం అదికెరటాలనాపలేదు. కెరటాలు రాతిగుట్టచుట్టు తిరిగి, మరలకలిసికొంటాయి అదే విధంగా వెండ్రుకమీదపడిన కాంతికిరణాలు దాని చుట్టుతిరిగి, మరలకలిసికొంటాయి. అట్లే హార్బర్ ద్వారంలో ప్రవేశించు కెరటాలు సూటిగారాక జలస్తంభకంయొక్క అంచుల వెంబడి తిరిగి హార్బర్‌లోనున్న నీటితలాన్ని కల్లోలపరుస్తాయి నీటితలం గరుకుగాతయారౌతుంది. సూదిమొనపాటి రంధ్రంగుండా పోయినకిరణాలు అంచులవెంబడి వంగగా ఏర్పడిన గరుకుతనాన్ని చిత్రంగచూపుతుంది. కాంతినొక కణపరంపరగా 17వ శతాబ్దం భావించింది సూక్ష్మపరిమాణంలో వాటిల్లు సంఘటనలను సహేతుకంగా వివరించడానికది చాలదని గ్రహించిన 18వ శతాబ్దం కణపరంపర వంతు తరంగ సమూహాలుగా భావించింది.

ఈమార్పువల్ల మరికొన్ని చిక్కులు కలిగేయి. ఒకపట్టకం (Prism) లోనుండి వెలువడిన సూర్యరశ్మి రంగులలోనికి విభజింపబడగా వర్ణపటం ఏర్పడుతుంది. హరివిల్లులోవలె అందులో నీలలోహితం, నీలి,నీలం, ఆకుపచ్చ, పసుపుపచ్చ నారింజ, ఎరుపు అనురంగులుంటాయి. సముద్రతరంగాలవలె కాంతిలో తరంగాలుంటే సూర్యరశ్మిలో నున్న కాంతియావత్తు వర్ణపటంలో నీలలోహిత ప్రాంతంలోనే ఉండాలని చూపవచ్చును. అంతేకాదు, తుదనున్న నీలలోహిత తరంగాలకు శక్తిని గ్రసించు సామర్థ్యం అపారంగానుంది. అవినోరుతెరచుకొనిఉంటాయి. అందుచేత, జగత్తులోనున్న శక్తియావత్తు అతినీలలోహిత కిరణరూపం ధరించాలి.

ఇట్టి అవక తవకలనుండి తరంగసిద్ధాంతాన్ని తప్పించడానికే క్వాంటం సిద్ధాంతం జనించింది. పూర్తిగావిజయం సాధించింది. కాంతిని కణాలుగా భావించిన న్యూటన్ పూర్తిగాతప్పలేదని చూపింది. వాయువును వేర్వేరు అణువుల సమూహంగా భావించినట్లు, తుపాకిగుండ్ల వర్షాన్ని సీసపు ముక్కల సమూహంగా భావించినట్లు, వర్షపాతాన్ని నీటిబిందువుల సమూహంగా భావించినట్లు ఒక కాంతి కిరణపుంజాన్నికూడా వివిక్తమైన ఫోటాన్ల సమూహంగా భావించవచ్చునని రుజువుచేసింది.

అంతమాత్రాన్న తనతరంగిత స్వభావాన్ని కాంతిపోగొట్టుకోదు. ప్రతిచిన్న కాంతి ఖండానికి అనుబంధమై నిశ్చితమైన పొడవుంది. దీనిని "అలపొడవు" అనవచ్చు. ఏమంటే ఆకాంతిని పట్టకంగుండా పోనిచ్చినప్పుడు ఆపొడవుగల తరంగాలు ప్రవర్తించినట్టే ప్రవర్తిస్తుంది. ఎక్కువ అలపొడవుగల కాంతిలో చిన్నశక్తిఖండాలు, తక్కువ అలపొడవుగల కాంతిలో పెద్దశక్తిఖండాలు ఉన్నాయి. శక్తిఖండంలో నున్నశక్తి దాని అలపొడవుకి అనుపాతంలోనుంటుంది కాగా, ఫోటాను యొక్కశక్తిని దాని అలపొడవు నుండి లెక్క కట్టగలము.

ఈభావాలకాధారమైన తార్కాణాలను క్రోడీకరించడానికైన సాధ్యంకాదు. అవన్నీ కూడా ఒక్క విషయాన్ని సూచిస్తాయి. మన పరిశోధనాగారాల ఉపకరణాలలో గమించు కాంతి అవిచ్ఛిన్న ఫోటాన్లుగా ప్రయాణం చేస్తూందని ఇంతవరకు ఫోటానులో భాగాలు ఏపరిశోధనలోనూ తారసిల్లలేదు. ఫోటానులో భాగాలుండగలవని అనుమానించడానికైనా కారణం కనిపించలేదు. రెండు ఉదాహరణలు దీనిని స్పష్టీకరింపగలవు.

అనుకూలపరిస్థితులలో పరమాణువులపై పడిన కిరణ ప్రసారము వాటిని ముక్కలు చేయవచ్చును. ముక్కలైన పరమాణువులను పరిశీలించి ఒకొక్క పరమాణువును భిన్నం చేయడానికై ఎంతశక్తివ్యయమైందో లెక్క కట్టవచ్చును. అది ఏసందర్భంలోనూ పూర్తి

ఫోటాను శక్తికంటె తక్కువలేదు. ఆసంఘటన ఎట్లుంటుందంటే ఒక కాంతి నివహం ఒకపదార్థనివహంతో యుద్ధానికి వచ్చినట్లు. పదార్థనివహంలో విడివిడిగా సైనికులున్నారని పూర్వంనుండీ తెలుసును అవే పరమాణువులు. కాంతినివహంలోకూడా వ్యక్తిగతమైన సైనికులున్నట్లు ఇప్పుడు విశదమౌతూంది ఆసైనికులే ఫోటానులు. ఏమంటే, యుద్ధరంగాన్ని పరిశీలించినప్పుడు వ్యక్తికి వ్యక్తికి పోరాటం జరిగినట్లు స్పష్టమౌతూంది.

రెండవ ఉదహరణ. ఎలక్ట్రానులపై X కిరణ ప్రసారం పడినప్పుడేమౌతుందో ప్రొఫెసర్ కాంప్టన్ పరిశీలించేడు. X కిరణాలు కణాలతో ఏర్పడితే ఏవిధంగా ప్రవర్తిస్తుందో అదేవిధంగా విక్షిప్తమౌతుందని గమనించేడు. కాంతికణాలను ఫోటానులంటారు. ఈకణాలు వేర్వేరు యూనిట్లుగా గమిస్తూ యుద్ధరంగంలో తుపాకి గుండ్లవలె వాటి దారిలోనున్న ఎలక్ట్రానులను ఢీకొన్నాయి. ఈసంఘాతంలో వ్యక్తిగత ఫోటానులు పొందిన విచలనం (deflection) బట్టి వాటి శక్తిని గణించడాని కవకాశముంది. ఆవిధంగా లభించిన ఫలితం X-కిరణాల అలపొడవునుబట్టి గణించగా వచ్చిన శక్తితో సరిపోయింది

• ఇట్టి అవిభాజ్యఫోటానుల భావం తిరిగి అనిర్ణాయకత (indeterminacy) కు దారితీస్తుంది. రెండువిభిన్నమార్గాలననుగమించునట్లు ఒక కాంతిపుంజాన్ని విభజించడానికనేక మార్గాలున్నాయి. కాంతిపుంజమంతటిలో ఒకే ఫోటానున్నప్పుడు రెండు మార్గాలలో ఏదోఒకమార్గాన్నే అదిఆశ్రయించాలి. ఫోటాను విచ్ఛిన్నంకాదు. కాబట్టి రెండు మార్గాలనూ అది అనుగమించలేదు. అట్టి సందర్భంలో అది ఎంచుకొనేమార్గం నిర్ణాయకముగాదు. రెండింటిలో ఏమార్గాన్నైనా ఎంచుకోవచ్చు ఇట్లు సంభావ్యతాభావానికి అవకాశం కలిగింది.

కాంతిని కేవలం కణసమూహంగా భావించింది 17వ శతాబ్దం; కేవలం తరంగాలుగా భావించింది 19వ శతాబ్దం. ఈరెండు భావాలూ తప్పులాగే కనిపిస్తున్నాయి; లేదా, రెండూ ఒప్పేకావచ్చు. కాంతీ, వివిధరకాల ప్రసారముకూడా కణస్వభావాన్నీ తరంగస్వభావాన్నీ కలిగి ఉన్నాయి. ప్రొఫెసర్ కాంప్టన్ ప్రయోగాలలో విడిగానున్న ఎలక్ట్రానులపై పడిన X-కిరణ ప్రసారం వివిక్త కణపరంపరవలె ప్రవర్తిస్తుంది; లవే, బ్రాగ్ మొదలగు వారు చేసినప్రయోగాలలో అట్టి X-కిరణ ప్రసారమే స్ఫటికంపైపడి మూడు మూర్తులా తరంగ సమూహమట్లు ప్రవర్తిస్తుంది. అంటే, ఒకే కిరణప్రసారం ఒకేసారి కణాలలాగ తరంగాలలాగ ప్రవర్తించగలదు. ఒకమారు తరంగాలలాగ ఒకమారు కణాలలాగ ప్రవర్తిస్తుంది; ఏక్షణంలో ఏప్రవర్తనను ఎంచుకొంటుందో ఇంతవరకు తెలిసిన సూత్రమేదీ చెప్పలేదు.

ప్రకృతి యొక్క సారూప్యంలో మనకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే కణాలూ తరంగాలూ స్వతస్సిద్ధంగా ఒకటే అని అంగీకరించాలి. మనకథలో ఉత్తేజకరమైన రెండవభాగానికి దారితీస్తుంది. ఒకప్పుడు కణాలలాగ, ఒకప్పుడు తరంగాలలాగ కిరణప్రసారం కనిపించగలదన్నది కథలో మొదటి భాగం. ద్రవ్యనిర్మాణానికి మూలాధారమైన ప్రాథమిక కణాలగు ఎలక్ట్రానులు ప్రోటానులుకూడా ఒకప్పుడు కణాలలాగ ఒకప్పుడు తరంగాలలాగ కనిపించగలవన్నది కథలో రెండవభాగం. కిరణప్రసారంలో కనిపించిన ద్వంద్వం లాంటిదే, ఇటీవల, ఎలక్ట్రాను ప్రోటానుల స్వభావంలో కూడా కనిపించింది. ఇవికూడా ఒకే సమయంలో కణాలలాగ తరంగాలలాగ ప్రవర్తిస్తాయి.

న్యూటన్ కణసిద్ధాంతాన్ని విడిచిపెట్టి తరంగసిద్ధాంతాన్ని ఆమోదించినప్పుడు,ఒక

తరంగ పరంపర పరావర్తనం వక్రీభవనం చెందినప్పుడు తప్ప, కణపరంపరవలె ఎట్లు ప్రవర్తించగలదో బోధపరచుకొనవలసి వచ్చింది. ఒకసన్నటి రంధ్రంద్వారా గదిలో ప్రవేశించు సూర్యరశ్మి తరంగసమూహమే అయితే నీటితలంపై తరంగాలు వ్యాపించునట్లు అది గదినిండా వ్యాపించాలిగదా? కాని, కొంత వెడల్పుగల తరంగపరంపర, స్వేచ్ఛగా గమించు కణపరంపరవలె సూటిగా, ప్రక్కలకు చెదరకుండా, కిరణపుంజంగా ప్రయాణం చేస్తుందని విజ్ఞానులు యంగ్, ఫ్రెనెల్ చూపించేరు అంతేకాదు. గట్టిసమతలంపైపడి త్రుళ్ళు బంతులవలె అద్దంపై పడిన తరంగ పరంపర పరావర్తనం చెందుతుంది. వక్రీభవన సూత్రాలప్రకారం అట్టి తరంగ పరంపర వక్రీభవనం చెందుతుందని కూడా రుజువైంది. నిరంతరం మారుతూన్న బలాలకు లోనైనకణం తనఋజుమార్గాన్ని తప్పి వక్రమార్గాన్ని ఆశ్రయించినట్లే, వక్రీభవన సామర్థ్యం నిరంతరం మారుతూన్న యానకంలో ప్రయాణంచేయు తరంగ పరంపర సైతం సూటి మార్గాన్ని తప్పి వక్రమార్గాన్న పోతుంది ఈ రెండిటి గమనాలు ఒకే విధంగా నుండడానికి వక్రీభవనాంకంలో కలుగు మార్పుయొక్క వర్గానికి కణం మీద ప్రవర్తించుబలం అనుపాతంలో నుందనుకొంటేచాలు. న్యూటన్ వివరణల విజయాన్ని ఈవిధంగా అర్థంచేసికోవచ్చు.

న్యూటన్ కణసిద్ధాంతంలోని కణాలు చేయకలిగిన పనినే తరంగ పరంపరసైతం చేయగలదు. తరంగాల సంకుల స్వభావం మూలంగా కణాలకంటె తరంగాలు ఎక్కువ పనిచేయగలవు. ఎట్లంటే తరంగాలుగా కణాలు ప్రవర్తించలేని సంఘటనలలో తరంగ పరంపర తన పనిని చక్కగా చేయగలిగింది. ఈవిధంగా, కణాలుగా న్యూటన్ భావించినవి తరంగ మండలాలుగా పరిణమించేయి.

ఇదేవిధంగా, ద్రవ్యనిర్మాణాని కాధారమైన ఎలక్ట్రానులు ప్రోటానులు, గత కొద్ది సంవత్సరాలలో, తరంగమండల స్వభావాన్ని ప్రదర్శించేయి. కణమనుకొని ఎలక్ట్రాను ప్రోటానుల ప్రవర్తనను సమర్థించడానికి అనేక పరిస్థితిలో కష్టమయింది. కణంయొక్క ప్రవర్తనని తరంగ సమూహం యొక్క ప్రవర్తనగా వివరించడానికి లూయీడీ బ్రోయ్, శ్రడింగర్ మొదలగువారు ప్రయత్నించేరు; తత్ఫలితంగా "తరంగయంత్రశాస్త్ర" (Wave Mchanics) మను నూతనశాస్త్రభాగాన్ని సృష్టించేరు. గణితపదార్థ విజ్ఞానంలో అదొక భాగం.

నున్నటి టెన్నిస్ కోర్టుపైపడి త్రుళ్ళిన టెన్నిస్ బంతిని గమనించి నప్పుడది నునుపైన అద్దంపైపడి పరావర్తనమొందు కాంతి కిరణ పుంజంవలె ప్రవర్తించునని తెలిసికొంటాము. అందుచేత, టెన్నిస్ కోర్టుపై బంతి పరావర్తన మొందిందనుట సమంజసమే. కాని, ఈపరిశీలనవల్ల అట్టేలాభం లేదు. కావాలంటే, టెన్నిస్‌బంతిని తరంగ సమూహమట్లు భావించడానికది తోడ్పడవచ్చును. కాని, అలా భావించలేము. ఏమంటే, మనం చూస్తూన్నవరకు, చూస్తున్నామనుకొన్నంతవరకు, టెన్నిస్ బంతి తరంగ సమూహం గాదు.

గమిస్తూన్న వస్తువు టెన్నిస్‌బంతి కాక ఎలక్ట్రాను అయినప్పుడు పరిస్థితి వేరు. ఒక సమతలంనుండి త్రుళ్ళిన ఎలక్ట్రాను గమనం తరంగమండల గమనంవలె కనిపించినప్పుడు ఎలక్ట్రాను తరంగమండలమే అనుకొనడానికి అభ్యంతరంలేదు. "ఇది నాకవసరం లేదు; ఎలక్ట్రానును స్పష్టంగా చూడగలను, అది తరంగమండలంగాదు" అని ఎవ్వరూ అనలేరు. ఏమంటే, ఎలక్ట్రానుని ఎవ్వరూ చూడలేదు; అదెట్లుంటుదో భావించడానికైనా అవకాశం లేదు. న్యూటన్ యొక్క కాంతికణాలను తరంగ మండలాలుగా భావించడానికున్న

స్వేచ్ఛయే ఎలక్ట్రానుని తరంగిమండలంగా భావించడానికీఉంది. అయితే, ఎలక్ట్రాను యధార్ధంగా తరంగమండలమా అన్న విష యాన్ని నిర్ణయించడానికి గట్టిగా నున్న కణమూ తరంగమండలమూ భిన్నభిన్నంగా ప్రవర్తించు సంఘటనలను పరిశీలించాలి.

ఎలక్ట్రానుని కణంగా భావించి నంత కాలం దాని గుణాలకనుగుణంగా అది ప్రవ ర్తించని సంఘటనలు మనకిక్కడ ఉపచరి స్తాయి. అట్టిసంఘటనలలో ఎలక్ట్రాను సరిగ్గా తరంగమండలమల్లే ప్రవర్తించింది. లోహ ఫలకంపైపడి త్రుళ్ళిన ఎలక్ట్రాను పరంపర దానికొక ఉదాహరణ. అవి వడగండ్లవలె గాని, టెన్నిస్ బంతులవలెగాని త్రుళ్ళక తరంగమండలాలు కలిగించు వివర్తన వల యాలను కలిగిస్తాయి. ఒకచిన్న రంధ్రలో నుండి ఎలక్ట్రాను పరంపరను పంపినప్పుడు కూడ ఇదేవరస; అవి చక్కగా వ్యాపించి కాంతి తరంగాలు కలిగించు వివర్తన వల యాలువంటి వలయాలనే కలిగిస్తాయి అయితే, ఎలక్ట్రానులో తరంగాలున్నాయని మాత్రం ఇది రుజువుచెయ్యదు. కాని, కఠిన మైన కణంగాకంటె తరంగమండలంగా ఎలక్ట్రానుని భావించడంలో ఎక్కువసౌలభ్య ముందేమో అనిపిస్తుంది. యధార్ధానికి, ఎల క్ట్రానుయొక్క ప్రవర్తనగురించి జోస్యం చెప్పినప్పుడు కఠినకణభావం చాలసార్లు తప్పి పోగా, తరంగమండల భావం అన్ని సంఘ టనలలోనూ విజయవంతమైంది.

ఒకనిర్దిష్టమైన అలపొడవు గల తరంగ మండలంవలె గమనమందున్న ఎలక్ట్రానుగాని ప్రోటానుగాని ప్రవర్తించాలని నూతనతరంగ యంత్రశాస్త్రము సూచిస్తూంది. అట్టి అల పొడవు గమిస్తూన్న కణంయొక్క ద్రవ్య రాశిపైని వేగంపైని మాత్రమే ఆధారపడి యుంది పరిశోధనాగారాలలో సామాన్య పరిస్థితులందు గమించు ఎలక్ట్రాను ప్రోటా నుల అలపొడవులు సామాన్యయంత్రాలతో కొలవడానికి వీలైనట్టివే.

ఎలక్ట్రానుల పరావర్తనంపైని వక్రీభవనం పైని ప్రయోగాలుచేసిన వారిలో అమెరికా దేశపు డేవిస్సన్, గెర్మర్ అను విజ్ఞానులు, ఏబర్డీన్ వాసి ప్రొఫెసర్ జి.పి. థామ్సన్, జర్మనీలో రుప్, జపాన్‌లో కికుచీ మొదలగు వారు కలరు. ప్రయోగాలలో లోహతలం పైకిగాని, లోహతలంలోనుండిగాని సమాం తర పుంజంగా ఎలక్ట్రాను పరంపరను పంపు తారు. రెండు ప్రయోగాలలోనూ ఫొటో గ్రాఫిక్ ప్లేట్లను అనుకూలంగా అమర్చి ఫలి తాన్ని రికార్డుచేయగా, ఎలక్ట్రానులు దృఢ మైన సూక్ష్మకణాలవలె ప్రవర్తించినపుడు లభించని ఫలితాలే వచ్చేయి. ప్రతిసారి వివ ర్తన వలయాలు ఏర్పడ్డాయి. అవిఏక కేంద్ర వృత్తాలు. అందులో తెలుపు నలుపు వల యాలు ప్రక్కప్రక్కగా నుంటాయి. ఒక నియతమైన అలపొడవు గల తరంగాలు లోహంపై పడినప్పుడు అవిగలిగించు వివర్తన వలయాలవంటి వలయాలే ఎలక్ట్రానులు కూడా కలిగిస్తాయి. ఆవలయాలనుండి అల పొడవును గణించగా, తరంగయంత్రశాస్త్రం నుండి లెక్కకట్టిన అలపొడవుతో సరిపో యింది. గమిస్తూన్న ప్రోటానుల విషయంలో కూడా ఇట్టి విజయాన్ని చేపట్టేడు చికాగో వాసి ప్రొఫెసర్ ఎ. జె. డెంప్‌స్టర్.

గమిస్తూన్న ఎలక్ట్రానులతోను ప్రోటా నులతోను అనుబంధమైయున్న అలపొడ వులు కేవలం మిధ్యకాదని పైనసూచించిన లాంటి ప్రయోగాలు, అనేకం, స్పష్టీకరిం చేయి. ఏదో తరంగిత స్వభావం ఇందులో ఇమిడిఉంది పరమాణువులందు, పరమాణు లకుపైని కూడగమిస్తూన్న ఎలక్ట్రాను ప్రోటా నుల ప్రవర్తనను వివరించడంలో అవి విద్యు దావేశంగల కణాలు అన్న భావంకంటె తరంగమండలాలన్న భావమే ఎక్కువ విజ యం పొందింది.

ఈతరంగాల స్వభావాన్ని మునుముందు ఎక్కువగా చర్చిద్దాము. ద్రవ్యం యొక్క మూలఖండాలైన ఎలక్ట్రాన్లు ప్రోటానులూ శక్తి ప్రసారమూకూడ ద్వంద్వస్వభావాన్ని ప్రదర్శిస్తాయన్నసత్యం ప్రకృతానికిచాలు. స్థూలంగా పరిశీలించినంతవరకు పైవాటి కణ స్వభావాన్ని అంగీకరించినా దృగ్విషయాలను సరిగా వివరించవచ్చును. కాని, ప్రకృతిని సూక్ష్మంగా పరిశీలిస్తూ,కొలదిమాత్రంగానున్న కణాలనీ కిరణ ప్రసారాన్నీ విజ్ఞానం శోధించినప్పుడు రెండూతరంగాలుగా ప్రవర్తిస్తాయి.

భౌతిక జగత్తుయొక్క మూలస్వభావాన్ని అవగాహన చేసికోవాలంటే సూక్ష్మతమ సంఘటనలను పరిశీలించాలి. అంతిమసత్యం వీటిలో అంతర్భూతమైయుంది. మరి, మనకు గోచరించేవి తరంగాలు.

ఇట్లు తరంగమయ జగత్తులో నివసిస్తున్నామా అను అనుమానం తల యెత్తుతుంది. ఈతరంగలక్షణాలను తరువాత చర్చిద్దాము. కఠినమైన ద్రవ్యశకలాల సమూహమే విశ్వమని, అందులో కిరణప్రసారం తరంగరూపంలో అప్పుడప్పుడు గోచరిస్తుందని భావించిన సంప్రదాయ విజ్ఞానం నుండి చాలదూరం నవీన విజ్ఞానం గమించిందని గమనిస్తే ప్రస్తుతానికి చాలు. తరువాతి ప్రకరణంలో ఆమార్గాన్నే మరికొంత దూరం పోదాం.

మనవి

రచయితలు, చిత్రకారులు, తమతమ రచనలను చిత్రములను ప్రతినెల 10 వ తేదీ లోపుగా కార్యాలయమునకు చేరునట్లు పంపవలెను.
ప్రచురించని రచనలు, చిత్రాలు త్రిప్పిపంపగోరువారు,
వారిరచనలతో, చిత్రాలతో కావలసిన తపాలా
బిళ్ళలు పంపవలెను.

సంపాదకులు : నవభారతి
విజయవాడ-2

గ్రీష్మము

(భాషా చందస్సు ననుసరించి)

శ్రీ "జౌమాకాన్త"

కృష్ణవైశాఖానిలమ్ముల
కోకిలాంగన సొమ్మసిల్లెను
ఆమ్రతరు శాఖాగ్ర దళములు
రుచి జెందినవి.

గ్రీష్మమరుదెంచుడు నటంచును
కూయసాగెను ద్విజకులమ్ములు
ఆగతమ్మగు విషమదశ కివి
స్వాగతములయ్యె.

జలములింకె జలాశయమ్ముల
కలత నొందెను జీవరాసులు
జలచరమ్ములు ప్రాణములకై
సంచలించినవి.

మింటి నడుమ ప్రచండ తేజము
నిండు వేసవి నిర్జలమ్మగు
తప్త భూమిని వటకుజమ్ములె
ఆశ్రయములయ్యె.

చరమ యజ్ఞాలయ వినిర్గత
జ్వాలకాధూమముల తెరగున
ఉష్ణవాయువు పాంసుపటలము
ఉబ్బటిల్లినవి.

గహన దుర్గమ నద నదీజల
కాంక్ష నరిగి విహంగజాలము
వీచు పడమటి గాడుపునబడి
ప్రాణముల వదలె.

పరహితార్థము జీవనమ్ముల
నిలుపు ఘనుల విధిన్ సరస్సుల
జీవనమ్ములు జీవితములకు
జీవనములయ్యె.

హరిత శాద్వల సస్యవర్ధన
కాలమరిగెను క్షేత్రజాలము
అవమతికి సజ్జనునిహృదివలె
బీట వారినది.

రోహిణిని రవి జేరువేళల
దేహధారుల తాపబాధలు
వాయు సంహత వహ్నిశిఖవలె
ప్రజ్వరిల్లినవి.

ప్రళయమున వలె అబ్జ మిత్రుడు
ఉగ్రతేజము గ్రుమ్మరించెను
పొడమె మృగ తృష్ణికలు జనులకు
ఆశకల్పించి.

కాల వైరుధ్యమున దుర్జన
వినతుడై మోచన నిరీక్ష
బద్ధ సాధువు రీతి లోకము
ముగ్ధమై యుండె.

కష్టములు కలకాలముండవు
సహజములు నిమ్నోన్నతమ్ములు
గ్రీష్మరాజ నిరంకుశత్వము
పతనమును బొందె.

తొలకరించిన వాన చినుకుల
దీర్ఘబాధలుసమసిపోయెను
మృగశిరోనిల హతి చరాచర
సృష్టి హర్షించె.

చిమ్మ చీకటి గ్రమ్మె దిశలను
మేఘ పటలమ్ములమె నభమున
వర్షసమయపు శంఖరవములు
చెలగు చుండంగ.

పైన సుందరమైన తారలు
క్రింద నిప్పులు చెరుగు వాయువు
తేనె బూసిన యట్టికత్తికి
ఇది నిదర్శనము.

విలయ గతివలె వీచు నొకపరి
స్తబ్ధమైయుండు నింకొకతరి
మతి భ్రష్ఠుని రీతి వాయువు
బాధలను బెట్టె.

మర్మజ్ఞ తత్త్వము - తర్కము

బెర్ట్రండ్ రసెల్

స్వేచ్ఛానువాదం శ్రీ "మృదంగ"

మానవుని జ్ఞేయప్రక్రియలలో కామించడం అనేదివొకటి. నిద్రాణమై మానవునిలోనున్న భావనలు పురిగొల్పుతున్నప్పటికీ, కాంక్షించడం అనేది అతడు పూర్తి జాగ్రదవస్థలోనేచేస్తాడు. సఫలీకృతం కాని ఆకాంక్షలు అణగద్రొక్కబడి తిరుగామానవుని సుషుప్త్యవస్థలో వెలికి వస్తాయనేదికూడా సత్యమే బంధింపబడిన మానవుని భావాలకు ఈవిధంగ ఒక విముక్తి మార్గం లభిస్తుందని మనస్తత్త్వవేత్తలు విశ్వసిస్తారు. అయితే మానవుని కోరికలు అన్నీ తీరుతాయనీ, అతడి ఈప్సితాలన్నీ. - అవి ఎంత అసంబద్ధంగావుండినప్పటికీ - నెరవేరుతాయనీ అనుకోవడం పొరబాటే అవుతుంది. పెను తుపానులో చిక్కుపడి, రివ్వున నిర్దాక్షిణ్యంగా వీస్తున్న గాలిలో కొరడాకొసలవలె దేహమంతటినీ బాధిస్తున్నవర్షపు చినుకులలో నానాదురవస్థలూపడిన ఒకమానవుడు "ప్రకృతినాపై కొంతయినా కనికరం చూపలేదు నేనోమట్టి ముద్దనయినట్టు నా బాధలు తనకేమి పట్టనట్టు ప్రవర్తించింది" అన్నాడట! ఈకోరికఎంత ఉచితంగా ఉన్నదో ఆలోచించండి. ఇంకొక ఉదాహరణ; ఒకనదిలో పడవపై ఒక యువకుడు ప్రయాణిస్తుండగా పడవతాలూకు తెరచాపకర్ర ఒకటి మీదనున్న వంతెనకు తగిలి పడవఆగిపోయిందట అప్పుడు నదిలోనీటిలోతు కాస్త తగ్గడంగాని, లేదావంతెన కొంచెంమీదికి పోయి తనపడవకు దారియివ్వడంగానీ జరగనందుకు ఆయువకుడు ఆశ్చర్యాన్ని వ్యక్తపరిచాడట స్థూలదృష్టితో చూసినట్లయితే ఈ కోర్కెలు అర్థంలేని వానివలె కన్పించవచ్చు కాని వానిలో మానవసహజమైనప్రగాఢకాంక్ష ఒకటి ప్రతిఫలిస్తున్నది. ప్రకృతిని మానవ జీవితావసరాలకు వినియోగించుకోవడమనేది ఆకోరిక. ఈకోరిక ప్రోద్బలంవల్లనే మానవుడు ప్రకృతి రహస్యాలను ఛేదించడానికి, అనిశ్చితమైన ప్రకృతి రహస్యాలను కనిపెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. అన్ని విషయాలనూ స్వయంగా చూచిన మీదటనే నిర్ణయానికి రాకుండా, కొంత ఆలోచనాశక్తితో, కొంత భావనాపటిమతో ప్రకృతి స్వరూపస్వభావాలను తెలుసుకోను యత్నిస్తున్నాడు. అనగా కేవలము అనుభవైకవేద్యములైన విషయాలను మినహాయించి మిగతావాటిని మానవమేధతోనే తెలుసుకోనిచ్ఛగిస్తున్నాడన్నమాట. ఈకోరిక కారణంగానే మర్మజ్ఞతత్త్వమొకవంకా, శాస్త్రమొకవంకా ఉద్భవించాయి.

అయితే ప్రపంచాన్ని అర్థంచేసుకోవడంలో మర్మజ్ఞతత్త్వం (దీనినే ఛాయావాదమనికూడా అంటారు) ఒకదారీ, శాస్త్రమొకదారీ పుచ్చుకున్నాయి. శాస్త్రీయమైనపద్ధతి ఒకనిర్ణీతమైన మార్గాన్ని అవలంబిస్తుంది ఈపద్ధతిలో ముఖ్యమైన మెట్లు. విషయాలను పరిశీలించడం, వివిధ విషయాలకు మధ్యగల సంబంధాన్ని గుర్తించడం, గుర్తించిన ఈసంబంధం ఆధారంగా సామాన్యసూత్రాన్ని నిర్వచించడం, ఈసూత్రం ప్రాతిపదికగా మిగతా విషయాలపట్ల ఈ సత్యాన్ని ఋజువుచేయడం. ఈపద్ధతిలో ఒక మెట్టునుండి మరోమెట్టుకు వరుసగా ప్రయాణించవలసివుంటుంది మరినాలుగుమెట్లు పూర్తి అయితేనే శాస్త్రీయమైన సూత్రమొకటి ఏర్పడినట్టన్నమాట. శాస్త్రీయమైన పద్ధతి గురించి మనంకొద్దిగా తెలుసుకోవలసి వుండడంచేత ఇక్కడ ఆవిషయాన్ని క్లుప్తంగా వివరించాను.

కాని శాస్త్రీయమైన పద్ధతిలో స్వతస్సిద్ధమైన దోషమొకటి వున్నది అదేమంటే శాస్త్రీయమైన పద్ధతిద్వారా తీర్మానించబడిన ఒకసూత్రం సత్యమాకాదా అనేవిషయంతేలదు. అది తార్కికమాకాదా అనేవిషయంపైచర్చించవచ్చుకాని అది పూర్తిగా నిజమాకాదా అనే

విషయం శాస్త్రానికి పట్టదు. దృష్టాంతానికి భౌతికశాస్త్రము భౌతికమైన ప్రపంచంలోని కొన్ని సంఘటనలను పరిశీలించి వాటినుండి కొన్ని సూత్రాలను తయారుచేస్తుంది. భౌతిక శాస్త్ర ప్రయోగశాలలో సూర్యకాంతిపుంజాని కడ్డంగా ఒకగాజు పట్టకాన్నివుంచి, ఆకిర ణాన్ని విశ్లేషణంచేసి, "సూర్యకాంతిలో ఏడు రంగులున్నవి" అనిశాస్త్రజ్ఞుడుసిద్ధాంతీకరిస్తాడు. అయితే మానవుని కంటికి కనిపించని రంగు లెన్నోవుండవచ్చుననీ, నీలలోహితకిరణాలను గాని, ఇన్‌ఫ్రారెడ్ కిరణాలనుగాని మానవుని నేత్రం చూడగల్గితే సూర్యకాంతిలో మరిన్ని రంగులు కనిపించవచ్చుననీ, అప్పుడు ప్రపం చపు ఆకారమే పూర్తిగా మార్పుచెందుతుందనీ అనిపించే ఈ విషయాలతో శాస్త్రవేత్తకు నిమిత్తంలేదు.

ఈకారణాల మూలంగా ప్రపంచపు నిజ మైన స్వరూపాన్ని తెలుసుకోవడంలో శాస్త్రం అన్నివేళలా ఉపయోగానికిరాదు. మర్మజ్ఞ తత్త్వం శాస్త్రానికి భిన్నమైన మరోమార్గమవ లంబిస్తుంది. "ఒకసారి అడుగిడిన నదిలోనికి మళ్ళీఅడుగిడలేవు. నదిలోనీరు నిరంతరంగా ప్రవహిస్తుండడమే దానికి కారణం" అన్నాడో వేదాంతి. ఈ భావన ఎంతశాస్త్రీయంగావున్నదో చూడండి! "ఒకసారి అడుగిడిన నదిలోనికి వేరొకసారి అడుగిడగలము; అడుగిడలేము, మనము జీవించియున్నాము, లేము" అనేది మరొక్కభావన. ఈరెండుభావనలకు కొంత సారూప్యముండినప్పటికీ మొదటిది శాస్త్రీ యంగావున్నది; రెండవది విచిత్రంగావున్నది. శాస్త్రీయదృక్పథానికీ, మర్మజ్ఞతత్త్వానికీ వున్న తేడా ఇదే!

అయితే మర్మజ్ఞతత్త్వంలోవుండే ముఖ్య మయిన నమ్మకాలేమిటి? ఏపద్ధతుల ద్వారా ఈతత్త్వము అవలంబించ బడుతుంది? అనే ప్రశ్నలకు జవాబులు చెప్పుకుందాం

మొదటగా మర్మజ్ఞతత్త్వంలో గమనించ వలసినదేమంటే దీనిలో అంతర్దృష్టికీ,మానసిక గ్రహణశక్తికీ ఉన్నప్రాముఖ్యత విశ్లేషవిజ్ఞా నానికీ, అకర్తృతర్కానికీలేదు. మర్మజ్ఞుడు అంతర్దృష్టిద్వారా సామాన్యమైన వస్తువులను అలౌకికమైన దృష్టితో వీక్షించి అచ్చెరువొందు తాడు. ప్రపంచమనే అవగుంఠనం చాటునచిత్ర మైన నిగూఢమైన మర్మమేదో దాగొనివున్న దని తలపోస్తాడు. గాఢమైన ఏకాగ్రతతో అతడు ఆలోచించగా, అతనికి ఉన్నట్టుండి అరహస్యమేదో కరతలామలకమయినట్టూ అవ గుంఠనం వెనుకదాగొని లీలామాత్రంగా స్ఫురి స్తున్న గుప్తవిషయమేదో తన కనులముందు విచ్చుకున్నట్టూ భావిస్తాడు. అతని ఆత్మహృద యమూ ఈనవవిజ్ఞానకాంతిచ్ఛటా ప్రకాశితమై వెలుగొందగా, స్థూలదృష్టికి దృగ్గోచరమయ్యే వస్తువులన్నిటి వెనుకానిత్యమైన ఓసత్యం వున్న దని తలపోస్తాడు.

ఇకరెండవవిషయం, మర్మజ్ఞులు ప్రపం చంలోని ద్వైధీభావాలను గుర్తించరు. ప్రపం చంలో వ్యతిరేకాలూ, వ్యత్యస్తాలూ లేవనే వీరు నమ్ముతారు. "మంచీచెడూ రెండూ ఒకటే" అనివీరు ఉద్ఘోషిస్తారు. ఉచ్చము, నీచము అనేవిలేవు, మీద, క్రింద అనేవి మన భావాలు మాత్రమే అని వీరినమ్మిక.

మూడవది దుష్టత్వసమస్యకు వీరిజవాబు. ఏతత్త్వమయినా ఈప్రపంచంలో దౌష్ట్యమెందు కున్నది? మరణము, బాధ, విచారము, రోగము మొదలయినవన్నీ ఎందుకున్నవి? అనేప్రశ్నలకు జవాబిస్తుంది. హిందూతత్త్వం లోని ఒకభాగము కర్మసిద్ధాంతం ద్వారా ఈ సమస్యను వివరిస్తుంది. మానవ జీవితాన్ని మృత్యుపాశ మెందుకు బంధించాలి? రుజా శోకాంతముల మానవుల నెప్పుడూ ఎందుకు బాధించాలి? మంచీ, చెడూ రెండూ ఒకటే అయితే మంచివలె చెడు మానవుల కెందుకు ఆహ్లాదాన్ని కలిగించదు? ముఖ్యమైన ఈప్రశ్న లకుకూడా మర్మజ్ఞతత్త్వము జవాబిస్తుంది. లోకంలో దుష్టత, చెడ్డతనం లేదని ఈతత్త్వం వాదించదు. అవి నిజాలు కావని మాత్రం ఈ

తత్త్వం ఉద్ఘాటిస్తుంది నిజమైనా, మృత్యువు జీవితానికి అడ్డంకికాదని వీరి భావన. నదికి గట్లుఅడ్డాలుకావా? ఒకదృష్టితో చూచినట్టయితే అవిఅడ్డాలే. కాని నదిముందుకు పోవడానికి అవిదోహదం చేయడంలేదా? అదేవిధంగానే ప్రపంచములోని దౌష్ట్యము, దుర్మార్గము, మరణము, రుజా-ఇవన్నీ మానవుని అభ్యుదయానికీ, ప్రగతిశీలతకు దోహదకారులవుతున్నాయి. మృత్యువు ఆలోచనకు ఎంత ఘోరంగా కనిపించినప్పటికీ, జీవించే జీవిపై అది ఏమాత్రమూ ప్రభావాన్ని చూపలేదు. మృత్యువు తప్పదని తెలిసికూడా జీవులు ఆనందంతో ఉల్లాసంగా ఆడుకోవడం లేదా? హాయిగా విహాయసపథంలో విహరించే విహంగపు పక్షాలపై నీలంగా కనిపించే ఆకాశం తన నీలిమను ముద్రించలేదు. అలాగే భీకరతిమిర రూపంతో భయావహంగా కనిపించేమృత్యువు కూడా జీవులపై ఎలాటిముద్రలూ వేయలేదు.

ఇవీ మర్మజ్ఞసూత్రంలోని ముఖ్యతత్త్వాలు ఇకమనం శాస్త్రీయతత్త్వాన్నీ మర్మజ్ఞతత్త్వాన్నీ తులనాత్మక పరిశీలనచేతాం.

ప్రపంచంలోని సత్యాలను తెలుసుకోవాలంటే తార్కికమైన మార్గంఒకటీ, అంతర్దృష్టి మార్గమొకటీ ఉన్నదని మనంతెలుసుకొన్నాం. సత్యాన్ని ఈరెండు పద్ధతులద్వారామనంతెలుసుకోగలిగితే ఏసత్యం నమ్మదగినసత్యం? అందుకు కారణాలేమిటి? ఇక ప్రపంచంలో ద్వైధీభావం, వైవిధ్యం మిథ్యయేనా? మంచీ,చెడూ వీటిలోని సత్యమేది? — ఈప్రశ్నలకు మనమిప్పుడు జవాబులు చెప్పుకుందాం.

ప్రేరణ - తర్కము :— వస్తువిచక్షణాజ్ఞానానికి ముఖ్యంగా రెండుమార్గాలున్నవి. మొదటిది వస్తువు చుట్టూతా ప్రదక్షిణంచేసి, దాని బాహ్యస్వరూప స్వభావాలనూ, ప్రవర్తనావిధానాన్ని గమనించడం. రెండోది వస్తువులలోనికి మానసికంగా ప్రవేశించడం. భౌతికతత్త్వవేత్తల విజ్ఞానం మొదటిరకానిది. మర్మజ్ఞతత్త్వజ్ఞుల విజ్ఞానం రెండవరకానిది. వస్తువులలోనికి మర్మజ్ఞులు మానసికమైన పరకాయప్రవేశం చేసిప్రతిసత్యాన్ని ప్రేరణవిధానంతో పరిశీలిస్తూ సామాన్యమైన వస్తువులలో ఒక విచిత్రమైన అనిశ్చితత్త్వాన్ని వీక్షిసూ, ఏకాంతమైన ఆత్మవస్తువులో విలీనంకాగా, బాహ్యప్రపంచాన్ని వింతదృక్పథంతో వీక్షిస్తూ, విచిత్రమైన ప్రపంచాన్ని సృష్టించుకొని గాఢమైన ఆత్మఉద్రేకానికి లోనవుతూవుంటారు. ఈమర్మజ్ఞుల ప్రపంచం నిజమయినదా, కాదా, అనే ప్రశ్నలతో మనకు ప్రమేయం అక్కరలేదు. కాని ఒక్క విషయంమాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. పరీక్షింపబడని, నిరాధారమైన అంతర్దృష్టిమాత్రం నిజమైన సత్యాన్ని ఇవ్వలేదు. ముఖ్యమైన సత్యాలన్నీ మొదట అంతర్దృష్టిచేతనే కనుగొనబడినాయి. ఆపిల్ పండునేలపై పడడానికీ, యూనివర్సల్ గ్రావిటేషన్‌కూ మధ్యగల దూరాన్నంతటినీ న్యూటన్ తన అంతర్దృష్టిచేతనే దాటగలిగాడు. అయితే అంతర్దృష్టిద్వారా కనుగొనబడిన ఈసత్యం తర్వాత తర్కసహాయంతో (మనఉదాహరణలో వివిధ ప్రయోగాల సహాయంతో) ఋజువుపరచబడాలి. అంతర్దృష్టితో ఒకవిషయాన్ని కనుగొనడమొకఎత్తూ, దాన్నితర్కంతో ఋజువుపర్చడమొకఎత్తూను. కొంచరు ప్రేరణకూ తర్కానికీ విరోధమున్నదనీ, రెండింటికీ చుక్కెదురనీ ఆరోపిస్తారు ఇదికూడా నిజంకాదు. పరిశుద్ధమైన తర్కవిజ్ఞానవిషయాలతోకూడా అంతర్దృష్టిద్వారా క్రొత్తవిషయాలను కనుగొనవచ్చునని చరిత్రచెబుతున్నది. అయితే ఈప్రేరణ సత్యాలను మాత్రమే కనుగొనడానికి ప్రోత్సహిస్తుందనిగాని, అంతర్దృష్టివలనఉపలబ్ధమయిన ఏవిజ్ఞానలేశమయినా నిస్సందేహంగా నిజమవుతుందనిగాని తలపోయడానికి వీలులేదు. తర్కంకంటే ప్రేరణముఖ్యం అనే సంగతి మనమిక్కడ చెప్పడం లేదని గమనించాలి. ప్రేరణఅనేది ముఖ్యంగా పెద్దలకంటె పసిపిల్లలలోను, విద్యావంతులకంటె విద్యావిహీనులలోను ఎక్కువగా వుంటుందని కూడా గమనించాలి.

ఏకత్వమూ-భిన్నత్వమూ:- మర్మజ్ఞ విజ్ఞానం వలన అన్ని వస్తువులూ ఒకటేననే సత్యం బయటపడుతోంది. వేదాంతపరంగా చూసి నట్టయితే ఇది ఒకరకమయిన అద్వైతవాదమని అనొచ్చు. మర్మజ్ఞులు తమ అంతర్దృష్టిసహాయ్యంతో ఈవిశ్వమంతా అభిన్నపదార్థమని, దానిభాగములవలె కనబడేవీ లేక వేర్వేరుగా కనబడేవి మాత్రం మనభ్రమఅనీ విశ్వసిస్తారు. మర్మజ్ఞుల మనస్సు జ్ఞానేంద్రియాల కతీతమైన సత్యవీక్షణం చేయడంలో నిమగ్నం కావడం చేత వారు ఈనిర్ణయానికి రాగలిగారు కాని ఈనిర్ణయం భౌతికశాస్త్ర సిద్ధాంతాలనుగాని, లౌకికప్రపంచంలోని సామాన్యమైన సత్యాలను గాని పూర్వపక్షంచేయలేదు. కాని మర్మజ్ఞులు ఇంద్రియాతీతమైన సత్యాన్నే నమ్మి ఈవిషయాల జోలికేపోలేదు.

ఆధునిక శాస్త్రంలో భిన్నత్వాన్ని విడదీసి చెప్పేది ముఖ్యంగా పరిణామవాదం. నేటి ప్రకృతి శాస్త్రం జంతువృక్షముల మధ్య కనిపించేభేదం పైకికనబడే మారనటువంటి భేదం కాదని వాదిస్తున్నది. మానవునికీ, క్రింది తరగతి జంతువులకూ ఉండేతేడా సహజంగా ఒక్కసారే ఉద్భవించలేదనీ, ఈతేడాక్రమబద్ధంగా పరిణతిపొందింది, ఒకానొకయుగంలో ఇటు మానవకోటికీ, అటుజంతుకోటికీ కూడా చెందని మధ్యరకపు జీవులను సృష్టించిందని తెలుపుతుంది. ఇకఖగోళశాస్త్రంలో సూర్యుడూ మిగతాగ్రహాలూ అతిప్రాచీనమైన నెబ్యులాల నుండి ఉద్భవించినట్టు తెల్పుతున్నారు. (అయితే ఈసిద్ధాంతాలు పూర్తిగా ఋజువు పర్చబడనిఊహలేనని మనం జ్ఞాపకముంచుకోవాలి.) ఈపరిణామవాదులు మనం మర్కటబంధుకోటిలోని వారమనే వెగటైన సత్యాన్ని జీర్ణించుకోలేక, "ఏకకణజీవినుండి, మానవునివరకూ పరిణామం చెందడం అభ్యుదయమే" అనడం మొదలుపెట్టారు. ఊహాజనితాలైన శాస్త్రసిద్ధాంతాలను ఆధారం చేసుకొని, "పరిణామం అంటే మంచివేపుకు ప్రగతి" అని అభివర్ణించారు. జీవమొక నిరంతర ప్రవాహమైతే, విభిన్నవస్తువుల మధ్య అవ్యవహితపరిణామమున్నదనీ, ఈపరిణామం కూడా మంచివేపుకేననీ వీరు వాదిస్తారు. ఈ వాదంచాలామటుకు అనుపపత్తికంగా ఉన్నందువల్లా, మంచీ, చెడూ మొదలైన సాపేక్షపదాలను వీరుపయోగించడంవల్లా వీరివాదనను మనం పూర్తిగా అంగీకరించ నక్కరలేదు.

మంచీ — చెడూ:— మర్మజ్ఞతత్త్వంలోనే మంచి, చెడులను గురించి రెండు విభిన్నదృక్పథాలున్నవి. "మంచీ, చెడూ రెండూవొకటే" అంటారు కొందరు. "దేవునిదృష్టిలో అంతా మంచే. కాని మానవులు మాత్రం కొంతమంచిగానూ, కొంతచెడుగానూ భావిస్తారు" అంటారు మరికొందరు. అయితే ఈభావాలకు సమన్వయం కుదిర్చేందుకుగాను అల్పతరమైన మంచీ, చెడులున్నాయనీ, వీనికతీతమైన అధికతరమైన "మంచి" అనే పదార్థమొకటున్నదనీ, అదే పరమ సత్యపదార్థమనీ మనం భావించాలి. భౌతిక ప్రపంచం కర్మప్రధానమయినది. కాబట్టి ఇక్కడ మంచి, చెడుల విచక్షణ అవసరం. కాని ఈకర్మచేయడమనేది మర్మజ్ఞుల దృష్ట్యాచూస్తే మిథ్యాప్రపంచంలో చేయాల్సివుంటుంది. అందుచేత ఒక రకమైన అల్పతరమైన మంచిచెడులున్నాయన్నమాట. ఇక మనఆలోచనా జీవితంలో కర్మచేయు వలసిన అవసరంలేదు. ఈదృష్ట్యామంచి, చెడులు కేవలం భ్రమలు మాత్రమే. ప్రపంచంలోని ప్రత్యణువులోనూ, సంతోషాన్నీ, కాంతినీ, సౌందర్యాన్నీ, ప్రేమనూ చూడగలిగితే (మర్మజ్ఞులకీ దృష్టి ఉన్నది) ఈభ్రమల కతీతమైన శివమైన పదార్థమేదో అధికతరమైనది వున్నదని తోస్తుంది. ఇది మర్మజ్ఞుల భావన.

కాని నిష్పాక్షికమైన ఏతత్త్వంలోనైనా కర్తృత్వభావనకు ఆస్కారం ఉండరాదు. "మంచి, చెడు" అనేపదాలు ఇటువంటివే. మంచి, చెడులకు సంబంధించిన భావనలు తీసివేయవలసిన అవసరం ఏర్పడినదని నేటిశాస్త్రిులు ఋజువు

పరుస్తున్నవి. నేటిశాస్త్రజ్ఞులకు వారు పరిశీలించే వస్తువులయొక్క నైతికప్రవర్తనతో సంబంధం లేదు. రసాయన శాస్త్రవేత్త తనఅణువుల మంచి తనాన్ని గురించి వివరించనక్కరలేదు. ప్రతి శాస్త్రమూ నిష్పాక్షికవిషయ సేకరణా, తర్క-సమ్మతమైన తీర్మానమూ అనేవి అవధులుగా కలిగివుండాలనే విషయం రూఢిఅయింది. శాస్త్ర విషయాలలో ethical considerations యొక్క వితరణ ఉండరాదు. అలావుండి నప్పుడే ఏశాస్త్రమయినాఅభివృద్ధిపొందుతుంది. కాబట్టే సాపేక్షపదాలవిచికిత్స అంతలాభ దాయకంకాదు.

ఇంతవరకు మనం మర్మజ్ఞతత్త్వాన్నీ, తర్క-పద్ధతినీ తులనచేశాం. మర్మజ్ఞతత్త్వమొకమత మేమీకాదు కాని మతమునగానే మనకు ప్రపంచంపట్ల అడకువతో కూడిన ఒక సద్భావాన్ని ఏర్పరచగలగాలి. మానవశక్తులు పరిమితాలనే భావం కలగించి, సృష్టిపట్ల ఒకరకమైన వినయాన్ని పెంపొందించాలి. నేడుకోరవడిన సల్లక్షణాలలో ఇదొకటి. మర్మజ్ఞతత్త్వం అంత ర్దృష్టిద్వారా మానవునికి అతిలోక శక్తిని సాక్షాత్కరింపజేసి, ఈకొరతను తీరుస్తుందని నిస్సందేహంగా చెప్పవచ్చు కాబట్టే మర్మజ్ఞతత్త్వం జీవితం పట్ల మంచి దృక్పథాన్ని ఏర్పరచే ఒక చక్కని ఉపాధి.

చందాదారులకు వినతి

"నవభారతి" పత్రికకు అన్నివిధాలా సహాయ, సహకారాలు ఇస్తూవస్తున్న పాఠకులకు, అభిమానులకు కృతజ్ఞతను తెలియజేస్తున్నాము.

ఇంతవరకూ తమ చందాలను పంపటం పడనివారు, వెంటనే తమ చందాసొమ్మును పంపి, యధాతథంగా తమ సహాయ, సహకారము లిచ్చి, అన్ని విధాలా తోడ్పడవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

మేనేజరు, నవభారతి

మానవుడు - చంద్రుడు

శ్రీ శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి, బి. ఎ., బి. ఇడి.

[చంద్ర గ్రహంలోని పదార్థాన్ని తీసికొని రావాలనీ, చంద్రగ్రహం వెనుక భాగం యొక్క ఛాయా చిత్రాల్ని "లూనిక్" సంగ్రహించిందనీ, వెలువడిన వార్తలను చూచి]

మా న వు డు :—

నినుజూచి యే అప నిందల పాల్పడ్డ
జనులు మనోవ్యథన్ శాపమిడిరో !
తొలి సమాగమము ముందుగ విరహార్తి నే
జవ్వనుల్ కసిదీర శాప మిడిరో !
తన సతీమణిని గూడిన నేరమునకు ని
ర్జర గురుండలుకమై శాపమిడెనో!
కులుకుచు విరియు రేకులు ముకుళింప నే
సరసీజ సుందరి శాపమిడెనో !

చంద్ర ! నీలోని వస్తు సంచయము దెచ్చి
నీ రహస్యాలు శోధించి నిను జయించి
నీదు రాచటీకమ్ము మన్నీట గలిపి
వేయ మాశాస్త్రవేత్త యుర్వీశులూరె !

నీవమృతంపు రాశివని నీకిరణమ్ములకై చకోరముల్;
నీవు శుభప్రదుండవని నీయుదయమ్మునకై సువాసినుల్;
నీవను రాగమూర్తివని నీప్రణయమ్మునకై కుముత్సతుల్;
భావము నందలంతు రిటు పైని పరిస్థితు లెట్లు మారునో !

అతి రోషోద్ధత సైంహికేయ పటు దంష్ట్రాగ్ర క్షతాంగుండవౌ
స్థితి నీకున్ దొలగింప జేయుదురు శక్తిన్ బ్రార్థనల్ భూ జనుల్;
తతగోళాంతర రోదసీ కుహర యాత్రా కౌతుకోపేతులై
క్షితి శాస్త్రజ్ఞులు నిర్దయన్ విడుచు "రాకేట్లి"ంక నెట్లోర్తువో !

నీబింబమ్మున నర్ధభాగమె కదా నిత్యంబు చూపించుచున్
దోబూచుల్ గడుసుందనమ్మునను మాతో నాడుచున్నాడవో
జాబిల్లీ ! పరిశిష్ట భాగమున మాశాస్త్రజ్ఞు లీమధ్య నే
వో బొమ్మల్ సమకూర్చినారట రహస్యోదంత మెన్నాళ్లులే !

చంద్రుడు :—

అవని తలమ్ము దుస్తర జలావృత మత్యధికంబు; దుర్గమా
టవులు మహీధరమ్ములు నెడారులు నిండును కొంత మేర; మా
నవులు వసించు నట్టి దొక నాల్గవవంతును లేదు; వారి వౌ
అవసరముల్ ఘటింప కిటు లాకసముంగన నేమి లాభమో!

నాలోనున్న పదార్ధశోధనకు విజ్ఞానంబమూల్యార్ధముల్
కాలంబున్ శ్రమమున్ వ్యయింప తుదకున్ ప్రాప్తించు మేలేమిమీ
భూలోకస్ధుల జీవితావసరముల్ పూర్ణాయురారోగ్య వి
ద్యా లాభంబులు గూర్చినన్ బ్రతుకు ధన్యంబయ్యెడిన్ మానవా!

అణు గర్భాంతర భేద నోద్గత మహీయశ్శక్తి మద్ఘోరమా
రణ కార్య ప్రవణాస్త్ర శస్త్రచయ నిర్మాణాధిక త్రస్త ధా
రుణి శాంతిన్ నెలకొల్ప బూనుటది సర్వోత్కృష్ట కార్యంబగున్
ఘుణి కోత్సాహమునన్ వ్యయింపకుము శాస్త్రజ్ఞానమున్ మానవా!

మహాకవి శ్రీ బాణభట్ట ప్రణీత

పార్వతీ పరిణయము

ఆంధ్రీకరణ: శ్రీ జూలూరి హనుమంతరావు

౫

పంచమాంకము.

(కంచుకి ప్రవేశించును.)

కంచుకి:- సకలకులాచలచక్రవర్తియగు హిమవంతునిచే నాజ్ఞాపితుఁడనైతిని, "శిలాధర! క్రిందటిదినమే పరమేశ్వరునిగూడి సారుంధతీకులైన సప్తర్షులేతెంచి లబ్ధవరయగు గౌరికినీదినము వివాహమంగళయోగ్యముగా నొనర్చినారు. కాన, నీఓషధిప్రస్థ పురనివాసులను బురాలంకారమొనర్చుటకుఁ బ్రబోధింపుము." అని, స్వామినియోగమును బాలింతును. (అని పరిక్రమించి యంతటఁ జూచి) ఓహో! పౌరులారా!

ప్రతి భవనమ్ము దోరణపుఁ బంక్తులఁ
జిత్రముగా నొనర్ప డు
ద్ధతఁ బ్రతి భాగమందునఁ బతాకల
నాకసమంటనెత్తు డం
చితముగఁ బూలబాటల రచింపుడు
గొజ్జగి నీరుచల్లి పా
ర్వతికి వివాహమౌదినము వచ్చెను
విశ్వ శుభప్రదమ్ముగా.

(జనాంతికముగా)ఏమంటిరి? "భగవానుని వచనములఁ బురస్కరించుకొని ప్రాతఃకాలముననే మాచే సర్వమును ద్విగుణముగా నాచరింపఁబడిన"దనియా! (అన్ని యెడలఁ జూచి సంతోషముతో) ఆహా! మాయాదేశానుసారముదయముననే నగరము మహోత్సవప్రవృత్తమైనది. అదియటులే.

అవె కదళీస్తంభోర్జిత
భవనద్వారమ్ములందుఁ బంక్తులుగా నిం
పవుఁగడు రసాల నవప
ల్లవ చందన మాలికా కళావిలసనముల్

మఱియు—

మణిమయశింజానమ్ముల
గణికల్ నృత్యమ్ము సలుపగాఁ దంత్రీని
క్వణనంబులు మోహనగతి
ఝణం ఝణమని మురజములు
స్వనియించునిటన్.

ఇటు ప్రక్కను—

అగరుధూప పరంపర లలిమికొనుట
నభినవమ్ముగ నగు జలదాగమమ్ము
ప్రచురమణితోరణప్రభా పటలివలన
నగు నదే శతమన్యు శరాసనమ్ము.

అటుప్రక్కను వారు—

అంగనాజనం బపాంగ వీక్షలతోడ
నున్న తోరణమ్ము లొరసి కొనగ
రాగ గౌర నీలరంగవల్లుల పున
రుక్తితో రచించు చుండి రచట.

(సర్వత్ర చూచి)

సరభసమ్మునఁ బౌరులు జల్లు కనక
రజము పచ్చని వెలుగుల గ్రమ్ముకొనఁగ
నుదయ రవిభాను తతిశోభలొంది దిక్కు-
దిక్కునను గౌంకుమపరాగదీప్తులెసఁగు.

ఈ నగరాలంకారమును స్వామికి నివేదింతును.

[తరువాత వివిక్తస్థానము నధివసించి హిమవంతుఁడు ప్రవేశించును.]

హిమవంతుఁడు :-

కోరితి నేను దాని సమకూరగ నల్లుఁడు
చంద్రమౌళి నా
నారదు పూర్వ సూచనమనారతమున్-
లభియించె నాతప
స్సార ఫలంబు-విఘ్నముల సంతతిదాటి
వివాహ కాలమే
తేరెను నేడు సర్వురునుతింపఁగ -
ధన్యులలోన ధన్యుఁడన్.

శిలాధరుఁడు:— (దగ్గఱకు వచ్చి) స్వామికి జయమగుగాత.

హిమ:- పురాలంకారమొనర్పఁజేసితివా?

శిలా:— స్వామి! ఈ యుత్సవము మాదే యని పురజనులకు ప్రత్యేకాభిమానము; పురాలంకారమెటు లొనరింపఁబడకుండును? పౌరులచే ద్విగుణముగా నాచరింపఁబడినది.

హిమ:- శిలాధరా! పార్వతీ వివాహ మంగళముఁ దిలకించుటకు సకల పర్వత స్వాములు వచ్చినారా ?

శిలా :- స్వామి ! అవధరించుఁడు. స్థల పద్మకర్ణిక యంత శరీరుఁడై సురులకు ప్రీతిపాత్రుఁడగు మేరుఁడు. రజ్జువయిన యాదిశేషునియొరపిడిచే స్నిగ్ధోపలుఁడగు మందరుఁడు, నాకాసమున సూర్యపదవి నడ్డగించు శృంగావళి గలిగిన వింధ్యపర్వతుఁడు, గంధమాదనుఁడు మున్నగు పర్వత శ్రేష్ఠులందఱు మిమ్ములఁ జూచుట కేతెంచినారు.

హిమ:- మఱి, కైలాసుఁడేమి చేయుచున్నాఁడు ?

శిలా :- స్వామి ! కైలాసుఁడు తమ యల్లుని పక్షమున నిలచివచ్చును.

హిమ:-సరియే. మఱి విశ్వావసు ప్రభృతి గంధర్వులు వధూ గణములతోఁ గూడి వచ్చినారా?

శిలా:-

చెలులం జేకొని గంధ
ర్వులువచ్చిరి వాద్యవస్తువులఁజేఁగొంచున్
లలితోత్సవ గౌరవ బు
ద్ధులు వాయింపంగ ముదముతోడన్
వీణల్.

హిమ :- అమరులతో గూడి యప్సరస లేతెంచినారా ?

శిలా:- వినుఁడు.

విద్యుల్లతా వితానద్యుతి వ్యతికర
త్విడ్వృతుల్ వ్యోమానవిస్తరిల్ల
నీలోత్పలప్రభానీకమ్మువలె నేత్ర
కాంతులాశాముఖాక్రమణసేయ
నా స్వర్గభూభాగమంత చిత్రవిచిత్ర
మై పూర్ణచంద్ర బింబాళి దోప
స్మితరుచిప్రసర విస్తృతచాంద్రి దినవేళ.
సర్వతోముఖ వికస్వరసుగాగ

మంజుగాత్రలు రంజితామలినదృశలు
చంద్రవదనలు స్వచ్ఛప్రశస్తరదన
లమర సంఘమ్ముతోడఁ బ్రియమ్ముగూర్ప
వచ్చిరందఱు స్వర్వార వనిత లిటకు.

హిమ:- అయినచో సరి. అంతఃపురమునకుఁ

బోయి కులవృద్ధురాలగు కౌశికికి వచ్చిన యచ్చరలతోఁగూడి పార్వతిని బాగుగ నలంకరింపుమని చెప్పవలసినది. అలంక్రియా పద్ధతినిఁ గౌశికి వచ్చి నాకు వినిపింపవలయును. వచ్చిన గిరిపతులకు, వారి వధూ గణములకు సకల లోకవస్తు సంభార ములను నీవు సమకూర్పవలసినది.

శిలా:- దేవరచెప్పిన విధమున నన్నియు నిర్వహింతును. (అని నిష్క్రమిం చును)

నారదుఁడు:- (ప్రవేశించి)

గురుతరమ్మగు కార్యమ్ము సురులకొఱకు
నేఁచు నాచే నుపక్రాంతమయ్యె పూర్వ
మెయ్యదది నేటితో ఫలియించుచుండె
నంతరాయమ్ములన్నిటి నధిగమించి.

(అని పరిక్రమించి చూచి) అడుగో, హిమవంతుఁడు వివాహమండపము దరినున్నాఁడు ఆతని సమీపింతును. (అని దగ్గరకుఁ బోవును.)

హిమ:- (చూచి) ఓహో! నారదమహా ర్షియా! (అంజలి ఘటియించును.)

నార:- హిమవంతా! నీకభ్యుదయమగు.

హిమ:- మీచే నాటిన బీజము యొక్క ఫలమేయిది (అని యాసనము నొసం గును. నారదుఁడు కూర్చొనును.)

(తరువాత కౌశికి ప్రవేశించును. కూర్చొని పార్వతి కొనరించిన యలంక్రియాపద్ధతినిఁ జెప్పును.)

హిమ:- బిడ్డ యలంకరింపఁబడినదా?

కౌశికి:- భగవన్! చెప్పుదును. వినుడు.

హిమ:- అవధానుఁడనై యున్నాను.

కౌశికి:-

భూషణములవిప్పి పొలుపారు కౌశేయ
వసన ధారణమ్ము పొసఁగ నునుకు
వివిధ పరిమళాల పెంపారు నాలేప
నమ్ము తైలమున నొనర్పఁబడియె.

హిమ:- తరువాత తరువాత.

కౌశికి :-

మంద్ర ఘోషలందు మంగళ శంఖాల
ముఖల పీఠిపైఁ గుమార్తె నుంచి
స్వర్ణదీ జలాల సలిపి రభ్యంగన
మంగళాంగి శోభిలంగ సఖులు.

హిమ:- తరువాత!

కౌశికి:-

చారు మజ్జనదేహ కర్పూరచూర్ణ
పాండురంబైన సులలితాంబరము గట్టె
జలద ధౌతమ్ము శరదిందు చంద్రికా క
ళా తరంగితమగు నంబరమ్మువోలె.

హిమ:- తదుపరి!

కౌశికి:-

సంవలితమయ్యె పార్వతీ చరణ కమల
మమల లాక్షారుణిమచేత-గుములుకూడి
భృంగములు వచ్చి వ్రాలి సేవించుచుండె
మణిఖచిత నూపురవ్యాజ - మరలిపోక.

హిమ:- ఆఁ- ఆపైన!

కౌశికి:-

చేరి సురనదీపులిన శృంగారభూమి
సారసంబులు పంక్తులు దీరినట్లు
తనరు శైలజావిపుల నితంబమందుఁ
గనక సారసన ప్రసంఘటితమణులు.

హిమ:- తరువాత!

కౌశికి:-

కరతరమ్ములదాక విస్తరణగొనిన
గౌరికుచకుంభములగుంకుమారుణిమలు
గ్రాలు సిందూర నక్షత్రమాలవోలె
దీప్తి గజరాజ కుంభప్రదేశమందు.

హిమ:- తరువాత! తరువాత!

కౌశికి:-

కలికి కర్ణమ్ము సౌందర్య నిలయమయ్యెఁ
దాల్చుచు విచిత్రమణిభూష దవులనున్న
స్నిగ్ధ సుమరత్నమును శంఖనిధినిదూర
తర మొనర్చెను సౌందర్యగర్వమణచి.

హిమ:- తదుపరి!

కౌశికి:-

పార్వతీ చారు కర్ణపార్శ్వంబులందు
నుంప మౌక్తిక తాటంకయుగము,నామె
వదన కమలము సేవింప వచ్చియున్న
యమృతకరబింబయుగమననలరు మండె.

హిమ:- తరువాత తరువాత!

కౌశికి:-

రుచిర కజ్జలిరేఖికా ప్రచురరచన
శైలజాయతనేత్రాల సవదరించు
నమర యోషాప్రసాధికా హస్తమలసి
కాంచె విశ్రాంతి చిరమపాంగంబుగాగ.

హిమ:- ఆపైన!

కౌశికి:-

పార్వతీలలాట భాగానమేనక
చందనమ్ముతోడ నందమొలుకఁ
జందమామ బొట్టుసరిదిద్దె కళ్యాణ
కాంతియుతనుచాయ కానఁబడఁగ.

హిమ:- తరువాత!

కౌశికి:-

పిఱుదులంటంగ మందార విరులతోడఁ
బెన్నెఱుల నందగింపంగ వేణిగూర్చఁ
జతుర బంధమ్ముఁదలపోసి సఖులుచిరము
నిశ్చలాశ్చర్య నేత్రలై నిలిచిరంత.

హిమ:- తరువాత తరునాత!

కౌశికి:-

భూషలవయవములకు సొంపులుఘటించు
ననుట లౌకికవాదమ్మె యవునుగాని
శైలబాలాంగములు క్రొత్తచవులనింపెఁ
దాల్చుమణిమయ భూషణతతికినేడు.

హిమ:-అయినచోసరి. నీవుదగ్గఱనుండుట
యనువిశేషముచే నాబిడ్డ చక్కగ
నలంకరింపఁబడినది.

(నేపథ్యమందు)

చెలగన్ మందర కందరాహతచలక్షీరోద
పూరోచ్చల
ద్వలితాభంగతరంగఘోషలవలెన్ వైతండి
కారావముల్
కులభూమీధరగహ్వరావళుల నిర్ఘోషప్ర
తిధ్వానముల్
విలసింపం జెలరేగుచుండె దివిషద్భేరీ
పరా రావముల్.

(అందఱు సంభ్రమముతో నిందురు.)
(తిరిగి నేపథ్యమందు)

నిలువుమయింద్ర! పార్శ్వమున; నిల్వుమ
దగ్గఱ నేరమాపతీ!
పలుకుమ స్వస్తి వాచకము బ్రహ్మ!
పఠింపుడు శైవఋక్ మునుల్
సలుపుడు చంద్రభాస్కరులు
చామరసేవ; యహీశ ఛత్రమా;
మెలఁగుడు రుద్రులగ్రమున, మెల్లగ
మారుతమా చలించుమా.

హిమ:- భగవన్! నారద! దేవతల కోలాహలమువలె వినఁబడుచున్న దేమి!

నార:- సకలజగముల యుత్పత్తిపోషణ విలయములచే మహామహిమోన్నతుఁడు, చరాచర శ్రేష్ఠుఁడైన తమ యల్లుఁడు వివాహమంగళవేషమును ధరించి దేవగణములతోఁగూడి యిట కేతెంచుచున్నాఁడు. యీ కలకల మాతనిని బురస్కరించుకొని ముందు నడచు నందీశ్వరునిచే నుత్సారితమైనది. అర్ఘ్యపాద్యముల స్వీకరించి భగవానుఁడగు నిందుశేఖరుని సత్కరింపవలసినది.

(తరువాత వివాహ వేషముతో శంకరుఁడు, దేవతాగణములు ప్రవేశింతురు.)

శంకరుఁడు:- (శార్ఙ్గితో) ఈ యోషధిప్రస్థ మమరావతినిమించి శోభిల్లుచున్నది.

శార్ఙ్గి :- మహేంద్రుని కంటె మహా మహేంద్రుఁ డధిగమించుచున్నాడా యేమి!

(హిమవంతుఁ డర్ఘ్యమును దీసికొని యెదురేగును.)

శంకరుఁడు:- (చూచి) పర్వతేంద్రుఁడు నా కెదురు వచ్చుచున్నాఁడు. వాహనము నుండి దిగి నడచుదును.

(అటులే యొనర్చును.)

హిమ;-

కనులు విరియఁజేసి కనుటకైనను దూర
మైన వాని వాక్కుకందరాని
వానిఁ జంద్రమౌళిఁ బడయ నల్లునిగఁ బు
ణ్యములనేమి నేనొనర్చినానో!

(అని దగ్గఱకేగును.)

శంకరుఁడు :- (చూచి)

ఎత్తుపల్లాలగూడు నీయిలను జదు నొ
నర్చురీతినఁగడు నంగలార్చుచుండి
వినయముపదేశ మొనరింపఁదనకుఁబోలి
నన్ను దరిజేరుచుండె నీ నగవిభుండు.

(హిమవంతుఁ డర్ఘ్యము నిచ్చును. శంకరుఁడు నమస్కార పూర్వకముగా స్వీకరించును. హిమవంతుఁడు లజ్జతో ముఖమును వంచుకొనును. అల్లుని పురస్కరించుకొని హరివిరించ్యాదులు పరిక్రమింతురు)

బ్రహ్మ:- భగవన్! వైవాహిక వేదిక యెక్కడ ?

హిమ:-ఇటు, ఇటురండు

(అందఱు వేదికదగ్గఱకు వెళ్ళుదురు)

బృహస్పతి:- హిమవంతా! ముహూర్త మాసన్నమైనది.

(తరువాత జయ విజయలతోపార్వతి ప్రవేశించును.)

పార్వతి;- నేడు నా మనోరథ కల్పవృక్షము ఫలము ప్రసాదించు చున్నది.

జయ:- (చిఱునగవుతో) అవును పార్వతీ! నీ ప్రియ సఖులమగు మాకు గూడ నిటులే కలుగుచున్నది.

పార్వతి:- (అసూయతో) విజయా! ఈపె యేమనుచున్నది.

విజయ:- పార్వతీ! ఇది సరసాలాప పేశలత్వమును జూపుచున్నది.

బ్రహ్మ:- (శార్ఙ్గితో) భగవన్! సర్వ దేవతలు భూతగణములతో యథాస్థానములందుఁ గూర్చొనవలసినది.
(అందఱు నటులే యొనర్తురు.)

హిమ:- నా పక్షమువారు కులపర్వతులు కైలాసునితో సమముగా వామ పార్శ్వమునందు గూర్చొనుఁడు.

(కులపర్వతులటులే యొనర్తురు)

శంకరుఁడు:- (పార్వతిని జూచి తనలో)

ప్రచుర వివాహ వేషమునభాసిలుచుండి
విశేషరమ్యయై
సుచలిత మోహనమ్ములగు జూడ్కులతో
గిరిరాజ కన్య తా
నచలమనోజ్ఞ మన్మథసహస్రము నాదగు
మానసమ్ములో
రచన మొనర్చుచున్నదన గ్రాలెడు నవ్య
కళా విలాసయై.

బృహస్పతి:- శంకరా! వధువుతోఁగూడ నీ వేదికయందు, దూరుపు దిక్కున కభిముఖముగాఁ గూర్చొనవలసినది.
(శంకరుఁడు పార్వతితో గూడి కూర్చొనును.)

శంకరుఁడు:- (తనలో)

నవ్యలావణ్య చంద్రికాదివ్యయగుచు
ముదిత నయన చకోరియై మోహనాంగి
జలనిధినిఁ గౌముదీ కళ వలెను నాదు
చేతమునునీమెయుప్పొంగజేయుచుండె.

బృహస్పతి:- (అగ్నిని ప్రజ్వలింపజేసి) శంకరా! నీ చేతితోఁ బార్వతి చేతినిఁ బట్టికొనుము.
(శంకరుండటులే యొనర్చును. పార్వతి పులకితురాలగును.)

శంకరుఁడు:- (తనలో)

బాలయిది నాదు పాణి సంస్పర్శచేతఁ
బులకిత మనోహరాంగియై పొలుపుమీఱె
నభినవ వసంత సంగమావాప్తి చేత
దీప్తముకురాల లేమావి తీగవోలె.

బ్రహ్మ:- వధూవరులారా! అగ్నికిఁ బ్రదక్షిణ మాచరించుడు.
(ఇర్వురు ప్రదక్షిణ మాచరింతురు. పార్వతి శంకరునిఁ జూచును. శంకరుఁడు పార్వతిని బ్రత్యవలోకించును. పార్వతి దృష్టులను బ్రక్కకుఁ ద్రిప్పుకొనును.)

శంకరుఁడు:- (తనలో)

సంచలించును నను జూడ సంభ్రమమున
ద్రిప్పుకొనుజూచి హరిణాక్షిదృష్టి వేగ
నెదురుచని ప్రవాహమ్మునఁ గెనయుచుండి
క్రమ్మఱ మరలు శుభ్రమత్స్యమ్మువోలె.
(బృహస్పతి పార్వతి చేతితో జలాంజలిని విడిపించును పార్వతి ధూమ మాఘ్రమించుకొనుటచే వైక్లబ్యమును బొందును.)

శంకరుఁడు:- (తనలో)

చెమరించి పత్రరేఖికలు చెక్కిలులందున
జారగా సమ
గ్రము చెలరేగు ధూమమునఁ గజ్జల
మంతయు కారిపోవ నే

త్రములకుఁ బాటలత్వ మొనరం
గమలాక్షి వసంత నీరజా
స్యము హృదయాన నాకెదియొ
యర్పణ సేయును రాగముద్రికన్.

బృహస్పతి:- శంకరా! పార్వతీ పాదకమలమును జేతులతో నీ సన్నికల్లుపై నారోపింపుము.

(శంకరుఁడు స్మయమానముఖుఁడైయూరకయుండును.)

కులపర్వతులు:- (సంభ్రమముతో) భగవన్! ప్రమాణభూతుఁడగు పురోధసుఁడు చెప్పినట్లొనరించుడు.

భూతగణములు:- (సంభ్రమముతో) కులపర్వతులారా! త్రిభువన నియంతృత్వము వహించిన నీల లోహితుఁడు దీనినెట్లొనరింపగలడు ?

బ్రహ్మ:- (చిఱునవ్వుతో నుభయులను నివారించి) సకల జన నియామికము స్వతఃప్రమాణభూతమునగు శ్రుతియే దీనినిట్లే పరిపోషించుచున్నది కనుక చెప్పబడిన విధముగా నాచరింపవలసినది.

(శంకరుఁడు సంకుచితములైన చేతులతోఁ బార్వతీ పాదకమలమును సన్నికల్లుపై నారోపించును. బృహస్పతి మిగిలిన వివాహకార్యమును ముగించి, వధూవరులను బ్రహ్మకుఁబ్రణమిల్లజేయును.)

బ్రహ్మ:-(చేయి యెత్తి)

సవితృనక్కువలెను సకల భువనముల క
నన్య సామాన్యమగుత మీయలరు ప్రేమ
పడయుదురుగాత తారకధ్వంసి భువన
భయ విదారణ దక్షుఁడౌ వర కుమారు.

(అని ఆశీస్సు నొసంగును.)

వృద్ధపురంధ్రులు :-

విలస దన్యోన్య సంతతప్రేమ మయులు
సమ్యగకళంకితాన్యోన్య సమశరీరు
లయిన యువకుల కనురాగ మలరుగాత
లలిత శంకర చంద్రికేందులకువోలె.

(అనియార్ద్రాక్షతలు వధూవరులశిరస్సులపై జల్లుదురు.)

నారదుఁడు:- (లేచి యంజలిబద్ధుడై) దేవకార్య హేతువుచే నపరాధ మొనరించిన కందర్పునిఁ దిరిగి సశరీరుఁడై త్వదీయ పదకమలముల సేవకునిగా నొనరింపఁ గరుణింప వలయు.

శంకరుఁడు:- కోరిన విధముగనే యగుగాత.

(తరువాత పూర్వాధికశరీరుఁడై కాముఁడు రతివసంతులతోఁ బ్రవేశించును.)

అందఱు:-

అమ్మకచెల్ల! రుద్రనయనానల దగ్ధ
తనుండనంగుడు
ల్లమ్మునఁబొంగి స్త్రీయనవలా కరలంబిత
హస్తుడౌచుఁ బూ
ర్వమ్మునకన్న శోభిలుచుఁ బర్వముగా
నరుదెంచుచుండెఁ జా
పమ్మున నమ్ములో సుడులు వారగఁ
దీయదనమ్ము తావియున్.

(అందఱు విస్మయపడుదురు)

హిమ:- (హర్షముతో) అనును.

ఆత్మజ భూరి సద్గుణ సమాశ్రిత శుద్ధ
చరిత్ర గౌరి వి
శ్వాత్మునిచేఁ బురాణ సుకృతావళిఁ బాణి
గృహీతయయ్యె నే

డాత్మ మనోరథమ్ము త్రిదశావళికిన్
ఫలియించె బ్రీతి లో
కాత్మకుఁడై స్మరుండు గొనె
నంచిత దేహము కంటి విందుగా.

శంకరుఁడు:- ఇంతకన్నను మీకు నెయ్యది ప్రియమగును ?

హిమ:- సర్వరకు మనోరథములు సిద్ధింపగా నింతకన్న ప్రార్ధింప వలసిన దేమి ? అట్లగుట నిది భరతవాక్య మగుగాత.

జలదుఁడు లోకభద్రమగు చాడ్పున
నిచ్చుత మిష్టవృష్టి పు
ల్కలఁగొని భూతధాత్రి సిరిగాంచుత
మెల్లెడ సస్యవృద్ధి ని
చ్చలు నుపకారముల్ సుజనసంతతి
సంపద వృద్ధియౌత మా
కలషుఁడు చిన్మహేశుఁడునయంబు
సుఖంబొనగూర్చుఁగావుతన్.

(అని యందఱు నిష్క్రమింతురు.)

పంచమాంకము సమాప్తము

మహాకవి శ్రీ బాణభట్ట ప్రణీత పార్వతీ పరిణయమందు
సర్వము సమాప్తము

విశ్వనాథవారి కథాకథనము

శ్రీ. 'గాండీవి'

రామాయణ కల్పవృక్షము నందలి కథలలో ఋష్యశృంగుని కథయొకటి. ఋష్యశృంగుని కథ సుమంత్రుఁడు దశరథునకుఁ జెప్పెను. అందులో దశరథుని పుత్రోత్పత్తి హేతువుకలదు. దశరథుఁడును రోమపాదుఁడును స్నేహితులు. మీఁదుమిక్కిలి దశరథుని కూఁతురగు శాంతను రోమపాదుఁడు దత్తత చేసికొన్నాఁడు. కాన ఋష్యశృంగుని రోమపాదుఁడు తీసికొని వచ్చుట దశరథునకు విదితపూర్వమేయని యంగీకరింపక తీరదు. కావుననే సుమంత్రుఁడు కథ నారంభించుచు నీవృత్తాంతము చారులవలన దశరథుఁడెఱుఁగునని చెప్పినాఁడు. అయినచో నీకథయేలచెప్పుట? ఋష్యశృంగుని వేశ్యలుతీసికొనివచ్చిన విధము వివరముగా దశరథుఁడెఱుఁగఁడు. చారులు చెప్పినది వార్తమాత్రమే. ఇట సుమంత్రుఁడు సనత్కుమారుని వలన వినిన కథను జెప్పినాఁడు. సనత్కుమారుఁడు త్రికాలవేది, మహాఋషి. "ఈఋషు లెవ్వరు చెప్పిన సారకథాకథనమొక్కచాయనె నడచున్." అన్నది యిటుఁ గూడ ననుసంధింపఁదగును. ఆకథాకథనవైఖరి యెట్టిదో పరికింతము.

ఋష్యశృంగుఁడున్నచోట వర్షములుపడును. రోమపాదుఁడు ధర్మవ్యతిక్రమము చేయఁగా నంగదేశములో ననావృష్టియేర్పడెను. పురోహితులు ఋష్యశృంగునిఁదెచ్చిన ననావృష్టి తొలఁగుననిరి. పిదప నిట్లనిరి.

క। నీతనయశాంత నొసఁగుము
యాతబిసికిఁగదలఁడిచట నాతండెన్నా
శ్రైతావు నందునుండునొ
యాతావున నీతిబాధయనిలేదునృపా.

ఋష్యశృగుంఁడున్నచోట వర్షముపడును. ఇయ్యది నిజమే. ధర్మవ్యతిక్రమము జరిగినచోటఁగూడఁగురియునా? అన్నచో గురియుననియే సమాధానము. కాని యాకురియుట యతివృష్టి కావచ్చును క్షామము కలుగుట కతివృష్టియైనను ననావృష్టియైనను నొక్కటేకదా! ఇఁక ఋష్యశృంగునిఁ దెచ్చిప్రయోజనమేమి? "అతండెన్నా, శ్రైతావునందునుండునొ యాతావున నీతి బాధయని లేదునృపా" అని రెండవసారి పురోహితులన్నట్లుకలదు. దీనికి ముందుమాట "నీతనయ శాంత నొసఁగుము, యాతబిసికి! గదల! డిచట" అని. అంగదేశములోనే యుండిపోవుటకు శాంత నొసఁగు మన్నట్లు స్థూలదృష్టికి దోఁచును. కానిపురోహితులయాంతర్యమిదికాదు. రాజుధర్మవ్యతిక్రమముచేసెను, దానికిఁబ్రాయశ్చిత్తము జరిగితీరవలెను. జరుగనిచో ఋష్యశృంగుని రాకవలన ననావృష్టి తొలఁగును గాని యతివృష్టి మున్నగు నీతి బాధలు కలుగక తప్పదు. కావుననే మొదట ఋష్యశృంగుని 'నిటకుఁదెచ్చితివే ననావృష్టి తొలఁగు' అని యనావృష్టిమాత్రమే తొలఁగుననిరి. అతివృష్టియైనం గావచ్చునన్నమాట. శాంత నొసఁగుమన్న తరువాత ననావృష్టి తొలఁగుననలేదు. ఈతి బాధలు కలుగవనియనిరి. దీనినిబట్టి శాంతను ఋష్యశృంగునకిచ్చుట వారు రాజునకు విధించుచున్న ప్రాయశ్చిత్తమని స్పష్టపడుచున్నది. అందుచేతనే 'ఎల్లప్రాయశ్చిత్తరూపనుతుఁడు' అనుట. సామాన్యముగా నన్నట్లున్న వాక్యములలో నింతనిగూఢార్థమిమిడి యున్నది. శాంత నొసఁగుట ప్రాయశ్చిత్తమునకే యనుటకు ప్రమాణముకూడఁగలదు. "శుద్ధబ్రహ్మచారిణే కన్యాదానమేవపరమం ప్రాయశ్చిత్తమేవ వక్ష్యం తీత్యాహ" అని యీసందర్భమున గోవిందరాజీయమున వ్రాయఁబడియున్నది. 'అతఁడు పుంరూపబ్రహ్మచర్యంబు' అనుటయునిందుకే.

ఋష్యశృంగుని దీసికొనివచ్చి శాంత నొసఁగినచో నీతిబాధలు తొలఁగుటతథ్యమే కాని యతనినెవరు తీసికొనిరాఁగలరు? ఇది పిల్లి మెడలోగంటకట్టు కథవంటిది. "అనావృష్టిచే

జెడియున్ మృత్యువు వద్దనుండియు మునిం జేరన్ భయంబంట." ఇదే మాయాపిహిత జీవలక్షణముగాఁ బేర్కొనఁబడినది. అట్టి సమయమున వారయువతులు ముందంజ వేసిరి. వారు రామాయణ కల్పవృక్షమున రాజాజ్ఞచే వెళ్ళిన వారుకారు. లోకహితమునకై తామే బయలుదేరిన వారు. వారిలో నాయకురాలు 'ఇప్పుడే బయలుదేరుచుంటిని' అనెను. 'ఉంటిని' భూతకాలిక క్రియ. వర్తమానకాలమున వాడఁబడినది. అర్థవిశేషములు సాధించుటకిట్లు వాడుచుండుట కావ్యములలోఁ గలదు. ఇట, ద్వరితార్థమున నీక్రియ వాడఁబడినట్లు గ్రహింపనగును. 'తావచ్చెసుదర్శనాయుధుడు' అను భాగవత ప్రయోగము నందలి 'వచ్చెన్' అనునది త్వరితార్థమునఁ గని ప్రౌఢవ్యాకర్త సూత్రించి యుదాహరించియున్నాఁడు. వేయేల "హతౌ తౌ విద్ధి రాక్షసౌ" అని వాల్మీకియే ప్రయోగించెను ఇట 'హతౌ' అను భూతప్రత్యయముచేత వధయొక్క సుకరత్వము సూచితమని తిలకవ్యాఖ్యలో నిట్లుకలదు. 'హతావితి భూతప్రత్యయేన వధస్య సుకరత్వం ధ్వన్యతే.'

వేశ్యలు ఋష్యశృంగుని, దెచ్చుటకు బయలుదేరినారు. వారతని నెట్లుతేఁగలరు? అతఁడు 'మూఁడవ మానిసినెఱుఁగఁడు, నాకుదియన నేమో యెఱుఁగఁడు' ఇట్టివానిని, దీసికొని వచ్చుటెట్లు? తీసికొనిరాలేని వారేల తమకుఁ దామే బయలుదేరిరి? ఋష్యశృంగుఁడు యౌవనములోనున్నవాఁడు. అతనికి శరీరగత వాంఛలు రేకెత్తించి ప్రవృత్తి గలిగించినచోఁ దీసికొని రావచ్చును. స్త్రీయననేమో యతనికిఁ దెలియక పోవుఁగాక! అతనికి, దెలియకుండనే యౌవనదశా పరీపాకముచే నతని శరీరగత స్వజనాభిశక్తి తదభిముఖముగా నుండును. ఈ విషయమునా వేశ్య లెఱిఁగియే తీసికొని వత్తుమనిరి. వారు వెళ్ళుచున్న పాట 'జాతినిగూడ మాదు మెయిదాపుగ గుర్వొడిపించు నట్టివే, చేతము కల్గువారినికఁ జెప్పనటంచును" సంభాషించుకొనిరి. ఈసంభాషణములోఁ బై విషయము వారెఱిఁగినట్లు స్పష్టపడుచున్నది.

పాత్రలు కొలఁదిగా మాటాడుట. ఆకొలఁది సంభాషణముతోనే యాపాత్రల శీలము మున్నగునవి వ్యజ్యమానములగుట యొక విలక్షణమైన రచన. ఇంతవఱకు వేశ్యలలోకహితార్థబుద్ధి, యౌవనదశా పరీపాకమునందలి స్థితి నెఱిఁగిన లోకజ్ఞత స్పష్టపడెను ఇంత మాత్రమే కాదు. ఈవేశ్యల రాజభక్తి యపారము. "కోపంబున నోసిమిమ్ము నెవరిందుం బంపి నారన్న భూవరునిం జెప్పకుఁడేమె వచ్చితిమనన్ బాడౌనా బీడౌనా" అని వారనుకొందురు. ఈయొక్క వాక్యముతో వారెంత రాజభక్తికలవారో విశదమగుచున్నది. వేశ్యల పాత్రచిత్రణము నింత మహోదాత్తముగా జేయుట నాన్యతోదర్శనీయమన్నను నతిశయోక్తియుండబోదని చెప్పఁదగును.

ఋష్యశృంగుఁడొకనాఁడా వేశ్యలున్నచోటున కభిముఖముగా వచ్చుచుండెను. వచ్చుటఁ జూడ గానే వారందఱోసియోసి యని సంభ్రమించిరి. వారు ఋష్యశృంగునెన్నఁడును జూడలేదు. అగునో కాదోయని యైన దొలుత సంశయింపక యతనినెట్లు గుర్తింప గలిగిరి? పురోహితులు ఋష్యశృంగుని గూర్చి చెప్పుచు 'వాని నాషాఢమేఘమువోనివాని' అనిరి. ఇదియొక యానవాలు కావచ్చును. ఇదికాక యతనితలపై శృంగముండునని యతనిపేరును బట్టియే తెల్లమగుచున్నది "ఋష్యమృగతుల్య శృంగత్వా దృష్యశృంగాఖ్యోభూదితి పౌరాణికీ కథా" (గోవిందరాజీయము) ఈకారణములచేత నతనిని వారు వెంటనే పోల్చుకొనిరని గ్రహింపవలెను. "ఇట్లుండ నొకనాఁడు ఋష్యశృంగుఁడు...వచ్చుటఁజూచి" అని ఋష్యశృంగుఁడనుటయిది ద్యోతకమగుటకే.

"నాయకరాలు గొంతెత్తి నాటపున్నాగయారభి శ్రీవరాళి రాగంబులు క్రమంబున నెత్తి కృతులు వర్ణంబులు పాడి"నది. నాటరాగముతో నారంభింపనేల? దేశాక్షిరాగముతో నారంభింపరాదా? ఋష్యశృంగుఁడే వేళ నచ్చటికి వచ్చుచుండెను?

ప్రాతర్మధ్యాహ్న సాయం సమయములలో నెప్పుడు వచ్చుచుండెను? ఈప్రశ్నలకు సమాధానమునాటరాగ ప్రసక్తిలోనున్నది. ఎట్లున్నదో వివరింతును.

శ్రీవిశ్వనాథ వారు గురుస్థానీయులుగా నెంచిన కవులలో పెద్దనయొకఁడు. మనుచరిత్రము విశ్వనాథవారికి ప్రీతిపాత్రమైన గ్రంథములో నొకటి. మనుచరిత్రమునఁ బ్రవరుఁడు వచ్చుసరికి వరూథిని వీణవాయించుచుండెను. ప్రవరుఁడు వచ్చిన పిమ్మట నామె తిరిగివీణెను ముట్టుకొనలేదు. ప్రవరుఁడు వచ్చుసరికామె యేరాగము నాలపించుచుండెను? "వాలారుంగొన గోళ్ళనీవలసతన్ వాయించుచో నాటకున్, మేళంబైనవిపంచి నిన్నమొదలున్ నీవఁటమింజేసియాఁ, హాలాంజెయువేళఁబల్కెడు" (మను) అని చెలికత్తె ప్రాతఃకాలమున వరూథినితో దేశాక్షికి రాగమును మేళవింపుమని కోరుచు బల్కినది. కాఁబట్టి వరూథిని పాడుచున్నది నాటరాగము. నాటరాగము మధ్యాహ్నము పాడవలసినది. ఆమె నాటరాగము పాడుచున్నప్పటికి ప్రవరుఁడు వచ్చెను. అతఁడింకను మధ్యాహ్నసంధ్య వార్చలేదు. వరూథినితో సంవదించిన కొంతసేపటికి సంధ్యవార్చు సమయమైనది. అప్పుడే "వార్చి ప్రవరుండు గార్హపత్యవహ్నిని" స్తుతించినాఁడు. (మను. 2.74)

పైసందర్భమును బట్టి ఋష్యశృంగుఁడు మధ్యాహ్నసంధ్యకు ముందు వేశ్యలున్నచోటునకు వచ్చినట్లు తేటతెల్లమగుచున్నది. వారితో సంభాషించిన కొంతసేపటికి సంధ్యవార్చు కాలమాసన్నమైనది. సంభాషణానంతరమా వేశ్యలు "తత్క్షణమయార్చవలెంజని "అని పలుకుటచేత సంధ్యవార్చుటకుఁ బూర్వమే ఋష్యశృంగుఁడు వచ్చినట్లు సరిపడుచున్నది. ఈసంధ్యసాయం సంధ్యకాదు. సాయంసంధ్యయైనచో నాటరాగ ప్రసక్తి సందర్భపడదు అది మధ్యాహ్నసంధ్యయే యనుటకు మరియొకని దర్శనము చూపెదను. ఋష్యశృంగుఁడింటికిఁ బోయి "దినము దినమునారేయునువారల గూర్చి యూహాలూహించుచు" నుండెనని చెప్పఁబడెను. సాయంసంధ్యయే యైనచో 'దినము దినము' వారినిగూర్చి యూహించుట పొసఁగదుగదా! ఈవిధముగా మధ్యాహ్న సంధ్యకుముందే యతనిరాకయని తెలియుచున్నది. నాయకురాలు నాటరాగముతోఁబాడనుపక్రమించినట్లు వ్రాయుటలో నింత విశేషమున్నదని పాఠకులు గమనింప వలయును. ఈఘట్టములో మనుచరిత్రము విశ్వనాథవారి స్మృతిపథమున నున్నదనుట కొక చిన్ని యుదాహరణము నిత్తును. ప్రవరుని వరూథిని యాతిథ్యమునకు రమ్మనఁగా నతఁడు "అండజయాన నీవొసఁగునట్టి సపర్యలుమాకువచ్చె" అనెను. ఋష్యశృంగునితో వేశ్యలు "మీదునాతిథేయమ్ములు మాకువచ్చె" అనిరి. ఈయనుస్మృతినిబట్టి యీవిషయమూహింపనగును.

సంగీతము వినఁగానే ఋష్యశృంగుఁడు దానికి వశుఁడయ్యెను. అతని సంగీతానుభవమును గూర్చిన "తన గొంతులోన మ్రాఁగుని నాదముల పూర్వనినదితంబులువచ్చి నిట్టవొడిచి" అను పద్యముపూర్వముగా నున్నది. ఋష్యశృంగుఁడు వేశ్యల నాలింగనము చేసికొనినాఁడు. అతనికి స్త్రీవిషయకజ్ఞానము లేనేలేదు. కాని "చికక్కనియొక స్పర్శయే చితనుకంపముపుట్టి యొడల్ బిరానజిల్లన దెలియంగరాని సుఖము" కలిగినది. "చికక్కని యొకస్పర్శ" అనుటలో జమత్కారమున్నది. ఆస్పర్శసుఖము యొక్క స్వరూపమతనికిఁ జిక్కలేదన్న భావము ద్యోతకమగుచున్నది. అందుచేతనే "ఇదేమయుమాయగోభవ, త్తనువులు దాఁకఁజల్లనగు దానికి నెట్టితపంబుఁ జేసిరోఁ" అని యిదొకతపోమాహాత్మ్యముగా భ్రమించినాఁడు.

'మీశిరస్సున జడల్ మేలుగా నునుపుగానట్టె ముప్పేటగాఁ బుట్టెనొక్కొ" "ఇత్యాదిగా వారినిఁ బ్రశ్నింప మొదలిడినాఁడు. ఈప్రశ్నలలో నొకక్రమమున్నది. శిరస్సునుండి మొద

లిడి పాదము వైపునకుఁజూచుట చెప్పబడెను. స్త్రీవర్ణనలు చేయునపుడు మనుష్యకాంతలైనచో శిరమునుండి పాదమునకు దేవతా స్త్రీలైనచోఁబాదమునుండి శిరమునకువర్ణించుట సంప్రదాయము. ఇంతేకాక తలవైపుచూడక కాళ్ళవైపుచూచుటయు సహజముకాదు. కావున జడలనుండియే ప్రశ్నలు ప్రారంభింపఁబడెను. "ఎపుడు సర్వాంగానసపునిష్ఠచేతనే, పిఱుఁదులు మీకింత పెటిఁగెనొక్కో" అన్నది చివరి ప్రశ్న అందుచేతనే "మునికుమారుండవ్వరారోహలన్, మీపర్ణాంగనశాల దూరమొ" అను ప్రశ్నలోని 'వరారోహ' శబ్దము సాభిప్రాయమగు చున్నది. (వరారోహ - శ్రేష్ఠములగు పిఱుఁదులు గలది.)

వేశ్యల ప్రసంగముతో వారి యాశ్రమములు చూడవలెనను కుతూహలము ఋష్యశృంగునకుఁగలిగినది. ఆకోరిక వెల్లడించఁగానే వారన్నమాటలలో "మూఁడుమంటలు నెగడున్" అన్నదొకటి "అనినంత ఋష్యశృంగుడు తనతండ్రి యుటజంబుఁజేరువేళయైనదని గ్రహించి" నాఁడు. ఇట్లని నంతనే యేల తండ్రి పర్ణశాలకు వచ్చువేళయైనదని గ్రహించెననఁగా 'మూఁడుమఁటలు నెగడున్' అనగానే యగ్నికార్యము తీర్చవలసిన వేళయైనట్లు స్ఫురించినదన్నమాట.

ఋష్యశృంగుని సంభాషణమెల్ల మౌగ్ధ్యమాధుర్యమాధుర్యము అతఁడుచేసిన లేటికూన ప్రసంగమాశ్రమ వాతావరణమును భావుకులకు జ్ఞాపకము చేయును. "మఱిదర్భలునేఁద్రుంచెడు, తఱినదియును గొఱికిపెట్టు "నని ఋష్యశృంగుఁడు తెలిపెను. ఋష్యాశ్రమములలో " పవనవేగవిశీర్ణపాదపాగ్రంబుల జడియకుండఁగఁబట్టు సామజము"లేయున్నప్పుడు (ఉత్తరహరివంశము) దర్భలు కొఱికిపెట్టులేటికూన యుండుటలో నాశ్చర్యమేమున్నది? దానినిగూఁడఁజూడవచ్చును రండని యాచకితనేత్రల నడిగినాఁడట ఇట 'చకితనేత్ర'లనుట సాభిప్రాయము. అసలులేటికూన గూర్చి ఋష్యశృంగునకు స్ఫురింపనేల? ఆ వేశ్యల చకితనేత్రములను జూడఁగా నతనికి లేటికూన జ్ఞాపకము వచ్చినదన్నమాట. స్త్రీల నేత్రములను లేడికన్నులతో నుపమించుట సుప్రసిద్ధము. చకితనేత్రలనుటకు లేటికూన ప్రసంగమునకు నింత సంబంధమున్నదని తెలియవలెను.

మరునాఁడువత్తునని చెప్పి ఋష్యశృంగుఁడు పర్ణశాలకేగినాఁడు. ముండ్లపైఁగూర్చున్నట్లున్న వేశ్యలయొద్దకు 'అబద్ధపుదోసముగల్గకుండగా' వచ్చినాఁడు. 'అబద్ధపుదోసము కల్గకుండఁగా' అనునది స్థూలదృష్టికి సామాన్యముగాఁదోఁచును. కానియప్పటి పరిస్థితియంతయు దీనిలోనున్నది

తానుచూచిన వేశ్యలనుగూర్చి ఋష్యశృంగుఁడు తనతండ్రితోఁజెప్పనేలేదు. ఇది సహజమా? అనఁగా 'దినము దినమునారేయును వారలగూర్చి యూహలూహించుచు' నుండెనని చెప్పఁబడుటచే నావ్యగ్రతలోనతనికిఁదండ్రితోఁజెప్పవలెననియే తోఁచియుండదు. తండ్రియగ్నికార్యమును దీర్చుకొని 'అడవులంబడి చనెను చనునప్పుడైనఁజెప్పవద్దా? అనగా ఋష్యశృంగుఁడప్పటికింక నే నిశ్చితాభిప్రాయమునకును రాలేదన్నమాట. వెళ్ళుటయా? మానుటయా? అన్నయాలోచనలో నిమగ్నుఁడై యుండెను. తుదకు వెళ్ళుటకే నిశ్చయించెను. అప్పటికిఁదండ్రియడవులలో నెక్కడికేగెనో! 'అడవులంబడి' చనెనను బహువచన స్వారస్యముచే నతఁడెచ్చటికేగెనో తెలిసికొనుటకు వీలు లేదని వ్యజ్యమానమగుచున్నది. తనతండ్రితోఁజెప్పుటకతఁడెటనున్నాడో తెలియదు. చెప్పిన చొప్పున వెళ్ళనిచో నబద్ధదోషము వచ్చును. కానవెళ్ళుటకే నిశ్చయించికొన్నాడు. ఈపరిస్థితియంతయు 'అబద్ధపుదోసముకల్గకుండఁగా' అనుదానిలో నిమిడియున్నది.

ఋష్యశృంగుఁడు పోవుచుండఁగా వర్షమారంభమయ్యెను. "వెనుకన్ దెసలన్ ప్రపాతధారా, రమణీయవాఃకణధురాపరితర్పితదేశమైచనెన్." వెనుకన్, దెసలన్' అనుటలోఁజిటపటచినుకులతో వర్షమారంభించుట ద్యోతకమగును. ప్రపాతధారేత్యాది సమాసము వర్షపు

ధారాసంపాతమును దెలుపును. ఋష్యశృంగుఁడు 'చూచుచుఁజూచుచుండియే' సర్వము నెఱుంగుట 'సహజటోద్ధలు నిశ్చలతత్త్వమానసుల్' అనిసమర్థింపఁబడెను ఇట్టిసమర్థనము నిశ్చలతత్త్వమానసులే చేయఁగలరు.

ఋష్యశృంగుఁడంగదేశమును జేరిన పిమ్మట నతనితండ్రి విభాండకుఁడేమిచేసెనో చెప్పఁబడలేదు. కుమారుని వేశ్యలు తీసికొని పోవుట రాజుకూఁతునిచ్చుట కోపకారణములు కావా? అన్న ప్రశ్నలుపుట్టును వీనికిఁబురోహితుని మాటలలోనే సమాధానము లున్నవి. పురోహితులు 'ఆజనకుండు పుత్రవిరహంబు సహింపఁడు ఋష్యశృంగునేఁ యోజనుదెత్తువో అనిరి. పుత్రవిరహము సహింపఁడనుటచేఋష్యశృంగునతని కన్నొఱఁగి తెచ్చిన పిమ్మట నతఁడు దివ్యదృష్టినెఱిఁగి కొడుకున్న వద్దకువచ్చునని తెలియుచున్నది. శాంతనొసఁగుట కోపకారణముకాదు. ఎందుకనఁగా 'బ్రహ్మచర్య మిపుడైనను నశ్లెద్విధా. గతిప్రసారితముగఁబొల్చు' అనుపురోహితులవాక్యమునుబట్టి ఋష్యశృంగుని బ్రహ్మచర్యమునకుభంగములేదు. "ద్వైవిధ్యం బ్రహ్మచర్యస్యభవిష్యతి మహాత్మనః" అని వాల్మీకి రామాయణము. "ఋతుకాలమున నాత్మసతియందరతిసల్పు, భవ్యశీలుఁడు సదాబ్రహ్మచారి" అనిభారతము చెప్పుచున్నది. ఇదిస్మృతిసమ్మతమే. "యాజ్ఞవల్క్యః- షోడశర్తుర్నిశాః స్త్రీణాంతస్మిన్ యుగ్మాసు సంవిశేత్. బ్రహ్మచర్యేవ పర్వాణ్యాద్యాశ్చతస్రశ్చ వర్జయేత్" (గోవిందరాజీయము.)

ఈవిధముగా నాలోచించిన కొలఁదియీ కథాకథనము నీరు కొలఁదితామరగానున్నది. విస్తరభీతిచే ముఖ్యవిషయములు మాత్రమే యిట ప్రదర్శింపఁబడినవని విజ్ఞులకు మనవి.

అపౌరుషేయత్వము

శ్రీ కల్లూరి చంద్రమౌళి

ఆస్తికులు భగవంతుని విశ్వసింతురు. ఆయనను నిరాకారుడుగను, సగుణుడుగను భక్తి విశ్వాసములతో నారాధింతురు. తమకువలెనే ఆ భగవంతునకును మనస్సు గలదని తలంతురు. అది విశ్వమనస్సు; దివ్యమనస్సు. దీని సర్వ ఆలోచనములను, కృషిని విశ్వ చైతన్యము - 'చిత్తు' అని నిర్వచింతురు. విశ్వవ్యాప్తములుగ ప్రసరించి ప్రకాశించు సర్వ ఉత్కృష్టభావములు, ఉన్నత సత్యములు, నియమములు, సిద్ధాంతములు, అవినూతతముగ కనిపెట్టబడినవిగాని, యింకను కనుగొనబడక గుప్తముగనున్నవిగాని, మన యెఱుకకు వచ్చినవిగాని, యెఱుకకురాక అణగియున్నవిగాని - అనగా లౌకికసంబంధమగు సర్వవిజ్ఞానమును, ఈ విశ్వమనస్సునందు గలదు. దాని ఫలితమును నదియే. అట్లుగానినాడు అది విశ్వమనస్సుగ నంగీకరింపబడ జాలదు. ఏదో యొకస్థితియందున్న మానవ మనస్సున కొక నూతన భావముగాని, ఆలోచనగాని తటస్థించినచో నది మానవ మనస్సునకు మాత్రమే నూతనముగ, అద్భుతముగ దోచునుగాని, విశ్వమనస్సునకు మాత్రము అట్లుదోచదు. కాబట్టి మానవుడు నూతనముగ దేనిని సృష్టింపజాలడు. ఇదివరకున్న దానినేగనిపెట్టును దానినే ఆవిష్కరించును. మానవుని విజ్ఞానము విషయగతము; వస్తుగతము. అది క్రియాజన్యజ్ఞానము. అది నిశ్చల, నిర్మల జ్ఞానము గాదు. పరిపూర్ణ మంతకన్నను గాజాలదు.

జీవాత్మ అల్పము. అది పరమాత్మయందలి అంశము కాబట్టి మానవుని మనస్సు విశ్వమనస్సు నందలి యంశము మాత్రమే. మానవ మనస్సు హద్దులయందున్నది. దేశ, కాలనిమిత్తములకు లోబడియున్నది. అది విభజనమునకు గుఱియగును. శరీరాది ఉపాధులచే బంధింపబడును. కాబట్టి అది వ్యక్తిగతము; పరిచ్ఛిన్నము. అంతమాత్రమున మానవ మనస్సు, విశ్వమనస్సు అనునవి రెండును రెండు విభిన్న విభాగములుగావు. వాస్తవమున కవియేకమే. ఏకత్వమునే సదా వెలుగొందజేయు చుండును. లౌకిక దృక్పథమునకు భిన్నముగ గనిపించుచున్నను, వాస్తవమునకు ఏకమే. 'ఏకం సద్విప్రాబహుధావదన్తి' అను సత్యమును ఇదియే.

ఉదా:- ఒక పాత్రను సముద్రమున ముంచి జలముతో నింపుము. అపుడా జలము పాత్రయను నుపాధిచే బంధింపబడినది గావున దాని యాకారమును, రూపమును దాల్చును. అట్టితఱి, పాత్రయందలి జలము వ్యక్తిగతమై విభజింపబడినదగును. కాని యథార్థమునకు సముద్రజలమునకును, పాత్రయందుగల జలమునకును యిసుమంతయును విభేదము లేదుగదా! అవి రెండుగ గన్పించుచున్నను ఒక్కటియేగదా! పాత్రయందుగల జలము దాల్చు వ్యక్తిత్వము, విభజనము, భావరూపములు, దాని నిజతత్త్వమగు సముద్ర జలముతోగల ఐక్య

మును, యేకత్వమును, విస్మరింపజే యును. మానవ మనస్సునకును. విశ్వ మనస్సునకునుగల సంబంధము, వాని, నిజతత్త్వమగు ఏకత్వమును నిదియే! కాబట్టి సర్వవిజ్ఞానమును, చైతన్యమును, భావములును విశ్వ మనస్సు నుండియే వెలుగొందుచుండును.

మానవ మనస్సు నిమిత్తమాత్రమేనని నిర్వచించితిమి. అది విశ్వమనస్సుతో సంధానమొనర్చు సాధనము. (Medium) ప్రజ్ఞానము సదాసాధు సంపన్నము. కాబట్టి సర్వ విజ్ఞాన ప్రజ్ఞానములకును జన్మస్థానము దివ్యత్వము. ఈ దివ్యత్వ మునుండియే సర్వమును జన్మించును. కాబట్టి ప్రజ్ఞానము దివ్యము. అది అపౌరుషేయము.

విశ్వమనస్సు కనుగుణముగ మానవ మనస్సు సంధానమును బడసినపుడు, భావరూపములు తిరిగి విశ్వమనస్సునకు జేర్చబడినదే తడవుగ, మానవుడు లోగడ యున్నదానినిగనిబెట్టజాలును. అంతియే గాని ఇదివరకులేని దానిని వెలికిదే జాలడు. కాని మానవుడు అహంకార బుద్ధితో సర్వ విజ్ఞానమును తన మనస్సు నుండి తనదిగ వెలువడు చున్నదని భ్రమించి ప్రగల్భములు బల్కుచుండును. ఇదియే మానవుని బంధించు బంధనము.

శ్లో॥ ప్రకృతేః క్రియమాణాని గుణైః
కర్మాణి సర్వశః ।
అహంకార విమూఢాత్మా కర్తా ఽ
హం ఇతిమన్యతే॥

గీత॥ 3॥ అ. 27 శ్లో.

నిత్యముగనున్న ప్రజ్ఞానము నుండి మానవుడు అల్పాల్పఖండములుగ, జ్ఞాన మును పరుకొనవలసినదే. అట్లుపరుకొ నిన స్వల్పజ్ఞానమును గ్రాహ్యాపరచుకొన వచ్చును. అంతియే కాని విజ్ఞామును సృష్టింపజాలడు. మానవుడు సృష్టికర్త గాడు. ఇదివరకున్నదానిని ఎఱుకకు దెచ్చుకొనగలడేకాని నూతనముగసృష్టిం పజాలడు. ఇట్లు మానవుడు పఱుకొనిన విజ్ఞానము పౌరుషేయము. దానికి ప్రకృ తిగ నున్న ప్రజ్ఞానము అపౌరుషేయును. సర్వకేంద్రములందు, రంగములయందు, పరిస్థితులయందునను మానవుడుగావించు కర్మలు కేవలము పౌరుషేయములు గాజాలవు.

శ్లో॥ నహికశ్చిత్ క్షణమపిజాతు
తిష్ఠత్యకర్మకృత్ ।
కార్యతేహ్యావశః కర్మ సర్వః
ప్రకృతి జైర్గుణైః॥

గీత॥ 3 వ. అ॥ 5 వ శ్లోకం.

ప్రతివ్యక్తియును స్వభావ ప్రేరణము చేతనే కర్మములను చేయు చుండును. సీమితమగు స్వల్పజ్ఞానమును, అవధుల యందున్న అల్పకార్యమును మాత్రమే మానవుడు తనదిగ భావింపవచ్చును. మిగిలినదంతయు అపౌరుషేయమేగదా!

ఉదా:- మానవుడు ఆహారములోనికి దీసికొనవచ్చును. కాని దానిని జీర్ణింప జేయుటకు వలయుకృషిని తాను గావిం పజాలడు శరీరము లోపల సహజముగ నున్న జీవశక్తుల కార్యమే జీర్ణమును గావించువిధానము అనగా, ఆహారమును లోనికి దీసికొనుట పౌరుషేయము. జీర్ణ

మునకు దెచ్చుట అపౌరుషేయము. సృష్టి కార్యమునందు భగవంతుడు దానుకర్త నని భావింపడు. సర్వము తనదేనను మమతను జెందడు. తాను నిశ్చలత్వముగ, సృష్టికి సాక్షిగ, వెలుగొందు చుండును. 'ఉదాసీనవత్ ఆసీనమ్' ఉదాసీనుడుగ, ఆసీనుడై ప్రకాశించు చుండును. 'ప్రకృతి యందు గుప్తముగ లీనమైయున్న స్వయంకృషి శక్తులు, కృషికి గడంగగనే సృష్టి జరుగు చుండును.'

గీత V అ. 14 వ. శ్లోకం.

శ్లో॥ నకర్తృత్వం నకర్మాణి లోకస్య
సృజతిప్రభుః
నకర్మఫలసంయోగం
స్వభావస్తుప్రవర్తతే

గీత అ 5. శ్లోకం 14.

భగవంతుడే సృష్టికర్తృత్వమునకు అధికారమును వహింపనపుడు, తాను స్థాణువుగ, సాక్షిగ వెలుగొందుచున్నపుడు మానవుని యనుభావమునకు ఉపజ్ఞకు (Originality) సృజనశక్తికి స్థానమే యుండదుగదా? మానవుడు తానే కర్త నని భావించుట యజ్ఞానము, అహంకారము. మానవుని భావప్రకటనమునందు, రచనమునందు, అనుభావముండవచ్చును కాని 'ప్రకటనము గావింపబడినది. రచియింపబడినది' అనుదానియందుమాత్రము మానవుని అనుభావము (మౌలికత) మృగ్యము. మనదేశమునందు ఋషులు, తాపసులు, మున్నగు మహాత్ములు భగవంతునితోడను, ప్రకృతితోడను, యెడ తెగని సంబంధమునుగలిగి తమ జీవితములను గడపిరి. నిత్యసత్యమునుగదీపించు భగవంతుని ప్రత్యక్షముగ గాంచి అనుభూతి నందుకొనిరి. తాము ప్రత్యక్షముగ గాంచిన సత్యమును ఎఱుకకు దెచ్చుకొనిన ప్రజ్ఞానమును ఆవిష్కరించిరేగాని నూతనముగ కనిపెట్టితిమని పలుకలేదు. సృష్టించితిమని నుడవనులేదు. 'మనము దేనిని నూతనముగ సృష్టింపజాలము'అని ధైర్యముగ, నైక్యకంఠముతో నెలుగెత్తి చాటిరి. మేము భగవంతుని గాంచితిమి నిత్యానందములుగ వెలుగొందు చుంటిమి' అని మాత్రము ప్రబోధించిరి. అనగా, వేదమునందుగల సత్యము నావిష్కరించుకొని, ప్రత్యక్షముగ గాంచిరి గావున వారిని మంత్రద్రష్టలు అందుము. అంతియేగాని కర్తలు మాత్రము గాజాలరు. ఇందులకే వేదములు అపౌరుషేయములు అని నుడువుదుము.

మానవుడు గావించు ప్రతి కార్యమునకు, అతనికి తెలిసినదియో, లేక తెలియనిదో యొక ప్రయోజనముండి తీరను శారీరకముగాని, మానసికముగాని జరుగు ప్రతి చలనమునకును, దాని ఫలితము లక్ష్యముగ నుండును. యీ గమ్యఫలము ఎంత విస్పష్టముగ గోచరమగునో, అంత యెక్కువగ భావమునందునను, కార్యమునందునను, బలము (శక్తి), సమతలు సమకూడుచుండును. ఈ ప్రయోజనము - సాఫల్యత సఫలవంతముగానంతదనుకనుగాని, మధ్యలో విడిచిపెట్టబడినను, ప్రతి కార్యమును అసంపూర్ణముగనే, అసంతృప్తికరముగనే యుండును. కావున, కార్య మొక విధానము. అది కార్య సంఘటనముల గొలుసు. సఫలతా పూర్వక కార్యమున నొక విధానముండును. ఆ విధానమున

ననేక సంఘటనలుండును. సంఘటనల పరంపరయే విధానమనినను దోషముండదు. పరంపరాత్మకమగు నీ శృంఖలలో ప్రతి సంఘటనము నొక యవయవములింకు. ఈ పరంపరాగత సంఘటనల యందు బిందువులు (Points) ను, **Units** (ప్రమాణములును) గలవు. ఈ గొలుసుగనున్న సంఘటనముల యందన్నిటికిగాని, ఈ విధానమునందలి యన్ని బిందువులకుగాని మానవుడు కర్త గాజాలడు. ఏవో కొన్ని బిందువులయందు మాత్రమే తన కర్తృత్వమును, సృజనత్వమును గలిగియుండగలడు. 'ప్రకృతి యందు గుప్తముగ నణిగియున్న గుణముల కారణముగ మానవుడుగావించు కార్యములు, ఎక్కువగ ప్రకృతి చర్యల నుండియే సముద్భవిల్లును.' - గీత.

మానవుడు గావించు సత్కర్మల యోగ్యతకుగాని, దుష్టకర్మల అయోగ్యతకుగాని తానే కర్తనని దలంచుట వృథా ప్రలాపము, అది వాగాడంబరతనే వ్యక్తపరుచును. మానవుని పౌరుషేయత్వము,సీమాబద్ధము. పరిచ్ఛిన్నము. ఆయనవిజ్ఞాన, కర్తృత్వములును సీమాబద్ధములు. జ్ఞానక్రియల కర్తృత్వముల యందాయన నిమిత్తమాత్రుడు తనగు మిన్నగ నుత్తమస్థాయిని వెలుగొందు ప్రజ్ఞాన పూరితశక్తుల హస్తగతముగనున్న సాధనమే తానని యెఱుంగు విజ్ఞానము వానికి సుఖమును కలిగించును. శ్రమరహితుని గావించును. ఇట్టి యెఱుకను గలిగినపుడే జ్ఞానము, కర్మలు అనుబంధనములనుండి కొంతకు కొంతగనై నమానవుడు ముక్తినిబడసి, స్వాతంత్ర్యమును సముపార్జించుకొనజాలును. ఇంత మాత్రమున మానవుడు కార్యరహితుడు, ఆలోచనారహితుడు అని మా భావముగాదు. కఠినశిలవలె నుండునని భావించుటయు సక్రమము గాజాలదు యిది అభావ్యము.

మానవుడు గావించు ప్రతి కర్మయందును, ఆలోచించు ప్రతిభావమునందును వాని బాధ్యత గురుతరము. అది యెంతయు నెక్కుడుగ నుండును. అట్టి పరిస్థితులయందే మానవుని బాధ్యత వానిని తన వ్యక్తిత్వమునుండి అహంకారమునుండి, సమష్టికి, విశ్వరంగమునకు గొనిపోవును 'తన చర్యలకు తానే బాధ్యుడు' అను తలంపు సహేతుకముగ నిర్వచింపబడును. పరులపై దోషముల నంటగట్టక తనకుతానే బాధ్యుడనను విశ్వాసము దృఢమగును.

శ్రీకృష్ణపరమాత్మను గాంచుడు. వ్యాసమహర్షి భారతమున వెలిబుచ్చిన ప్రతి యాలోచనమునందునను, కార్యమునందును శ్రీకృష్ణుని శక్తిప్రభావ ప్రసరణము, ఐక్యమునున్నట్లు సదా, సర్వత్రగాంతుము, అందు వాని బాధ్యతయును గురుతరము, కాని యీ సర్వము త్యాగమయము. నిష్కామము. అవి అంటియు అంటనట్లు, దృశ్యాదృశ్యములుగ వెలుగొందుచుండును. శ్రీకృష్ణపరమాత్మని అన్ని భావనులు, చర్యలు, ఆలోచనములు నిష్కామములు. త్యాగమయ సంపన్నములు ఆయన గావించు సర్వకర్మలును, ఆలోచించు సర్వ భావములును, లోక సంగ్రహార్థమే, జగత్కల్యాణమునకు మాత్రమే! అవి విశ్వమయములు.

అపౌరుషేయము నిమిత్తమాత్రము' అను పదముల భావము వివరించుచు, విస్పష్టమొనర్చున దేమన మానవుని క్రియారంభమున వ్యక్తమగు సర్వకార్యకలాపములును, విజ్ఞానరంగమున ప్రదర్శనములగు సర్వ భావములును, విశ్వకార్యమును, విజ్ఞాన క్షేత్రమును బాగుగ దున్నుటకు మానవుడొక సుసాధనమనియే. భూమిని దున్నుటకు నాగలివంటి సాధనము మానవుడని ధృవపడుచున్నది

జైమిని భారతం
(అశ్వమేధ పర్వం)

శ్రీ రెంటాల గోపాలకృష్ణ

౨

గతసంచిక తరువాయి

[కురుక్షేత్ర యుద్ధం తరువాత ధర్మరాజు దుఃఖసముద్రంలో మునిగిపోయాడు. దాయాదులను చంపిన పాపానికి పరితపించ సాగాడు. అప్పుడు వ్యాసులవారు వచ్చి అశ్వమేధయాగం చెయ్యమనీ, అది సకల పాపహరమనీ సలహా ఇచ్చాడు. యాగం చెయ్యవలసిన విధమంతా చెప్పాడు. యజ్ఞానికి పనికివచ్చే గుర్రం భద్రావతీపురంలో ఉన్నదని తెలిపాడు. అప్పుడు ధర్మరాజు, కృష్ణపరమాత్మను రావించి ఆయన అనుజ్ఞ తీసికొని యాగానికి పూనుకున్నాడు. యజ్ఞాశ్వాన్ని పట్టుకుని రావడానికి భీమసేనుడు బయలుదేరాడు. అతని వెంట, ఘటోత్కచుడి కుమారుడు మేఘవర్ణుడు, కర్ణ పుత్రుడు వృషకేతుడు బయలుదేరారు యిదీ జరిగిన కథ.]

భద్రావతీపురం

జైమిని మహాముని జనమేజయ మహారాజుకు మళ్ళీ ఇలా చెప్పసాగాడు :

జనమేజయ మహారాజా! తరువాత కథ చెపుతాను విను—

ఆ విధంగా భీమసేనుడు - మేఘవర్ణుణ్ణీ, వృషకేతుణ్ణీ వెంటపెట్టుకొని, సకల సన్నాహాలతో బయలుదేరి కొన్నాళ్ళకు భద్రావతీపురం చేరుకున్నాడు. అల్లంతదూరంలో వాళ్ళకు పట్టణం కనుపించింది. అందని అందచందాలతో వెలుగొందుతున్నది భద్రావతీ పట్టణం. రంగు రంగుల మేడలూ, మిద్దెలూ కనుపిస్తున్నాయి. ఎన్నో అంతస్థులతో చూడచక్కని భవనాలు ఆకాశం అంటుతూ అగుపిస్తున్నాయి. అన్నీ బంగారు మేడలే. అంతటా మణులు పొదిగిన గోడలే. స్ఫటికపురాళ్ళతో కట్టిన పెద్ద పెద్ద ప్రాకారాలు, ఎత్తయిన గోపురాలు. వజ్ర వైడూర్యాలు, మరకత మాణిక్యాలు, గోమేధిక పుష్యరాగాలు, కెంపులు నీలమణులు — ఇవన్నీ చిత్ర విచిత్రంగా పొదిగి - ఎంతో రమణీయంగా నిర్మించారు ఆ నగరం. ఎక్కడ చూచినా కళకళలాడిపోతున్నది పట్టణంచుట్టూ సుందరమైన తోటలూ, ఉద్యానవనాలూ ఉన్నాయి. మనోహరమైన సరస్సులూ కోనేళ్ళూ ఎన్నో కనుపిస్తున్నాయి. ఎక్కడబట్టినా అందం ఉట్టిపడుతున్నది ఏదిక్కున చూచినా కన్నులపండువగా ఉన్నది. లోకంలో అందమంతా అక్కడే గూడుకట్టుకున్నదా అనిపిస్తున్నది. కొండంత కోటలూ, బ్రహ్మాండమైన బురుజులూ, రాత్రింబవళ్లు వీరులు కాపలా కాస్తున్న పురద్వారాలూను. నగరం నాలుగు గవుళ్ళలో సేనానాయకులు తమ తమ సేనలతో పొంచిఉన్నారు. శత్రువులు ఆ పట్టణం వంక కన్నెత్తి అయినా చూడలేరు ఆ పట్టణం లోపలికి పోతుటీగ అయినా పోలేదు రాత్రిళ్లు కూడా పట్టపగలున్నట్లు దేదీప్యమానంగా వెలిగిపోతున్నది పట్టణం. రాజా. ఆ పట్టణ వైభవం వర్ణించతరంకాదు. అక్కడ సిరి ఓలలాడుతున్నది అక్కడ యెల్లప్పుడూ వేదపఠనం సాగుతున్నది. దశదిశలా ధూమం కమ్ముకునేటట్లు హోమాలు జరుగుతున్నాయి. పట్టణంలోకి పోవడానికి ఎక్కడా త్రోవ కనుపించదు. తోటల్లోని, ఉద్యానవనాల్లోని శోభ చెప్పనలవికాదు. అక్కడ పండని పండులేదు పూయని పువ్వులేదు. ఇహ పక్షులూ, మృగాల సంగతి చెప్పనేఅక్కర్లేదు. రంగు రంగుల పిట్టలూ పక్షులూ మృదుమధుర అనురాగాల రాగాలు

తీస్తూ గానంచేస్తున్నాయి. జింకలూ దుప్పులూ ఇంకా రకరకాల జంతువులూ ఎన్నెన్నో తమాషాలు చేస్తూ విలాసంగా విచ్చలవిడి విహరిస్తున్నాయి.

ఈ విధంగా ఉన్న భద్రావతీపుర వైభవం అంతా ఉద్యానవనంలో ఉండి చూచాడు భీమసేనుడు. తరువాత వృషకేతుడి వంక చూచి ఇలా అన్నాడు.

"అబ్బాయీ ! చూచావా ఈ పురవైభవం ! యిటు చూడు, యీ వనశోభ ! అటు చూడు, ఆ తటాకం. తరంగాలతో ఊగుతూ తూగుతూ ఉన్నది. యీ తటాకం ఎంత చక్కగాఉన్నది! ఎంత చల్లగాఉన్నది! తప్పకుండా ఈ తటాకం దగ్గరికి రాజుగారి తురంగాలు నీళ్ళు త్రాగవస్తాయి. సందేహం లేదు. ఆ గుఱ్ఱాలతోపాటు మనకు కావలసిన యజ్ఞాశ్వంకూడా వస్తుంది. అప్పుడు మనం అశ్వరక్షకులుగా వచ్చిన సైనికులను హతమార్చి గుఱ్ఱాన్ని పట్టుకునిపోదాం" - ఇలా చెప్పి భీమసేనుడు, వృషకేతుణ్ణీ, మేఘవర్ణుణ్ణీ వెంట తీసుకుని అక్కడొక కొండచాటున పొదలమధ్య పొంచుకుని కూర్చున్నాడు.

అప్పుడు కర్ణపుత్త్రుడయిన వృషకేతుడు భీమసేనుణ్ణి చూచి — "చిన్నాయనా ! యీ పట్టణం ఏలే రాజుకు గల సైన్యంయావత్తూ పది అక్షౌహిణీలు. అందులో కొంత సైన్యం మాత్రమే గుఱ్ఱంవెంట వస్తుందికాని, అంతా కదలిరాదు. కాబట్టి మనం గుఱ్ఱాన్ని పట్టడం సులభం. గంగాతీరానికి చేరిన జనుల పాతకాలూ,ముక్కంటి ముందరికివచ్చిన కాలకూటవిషమూ, కృష్ణపరమాత్మనుధ్యానించే మలిన మానవుడి జన్మా, గయలో పిండంపెట్టినవాడి పితృదేవతల దుర్గతీ-క్షణంసేపట్లో ఏవిధంగా ధ్వంసమయిపోతున్నాయో ఆవిధంగా యౌవనాశ్వుడి సైన్యం నిమిషం సేపట్లో నీ గదాయుధానికి బలిఅయిపోతుంది." - అని పలికాడు. ఈవిధంగా వారు ఇష్టాగోష్ఠిగా మాట్లాడుకుంటున్న సమయంలో పెద్దచప్పుడు వినవచ్చింది. తప్పెట్లూ, తాషామరుపుల మ్రోతలు వినిపించాయి. వెంటనే ఏనుగులు భయంకరంగా ఘీంకారం చేయడం చెవినపడింది. మదపుటేనుగులు ఘంటలు ఘణఘణ మ్రోగించుకుంటూ, మందలు మందలుగా రావడం కంటపడింది. మావటివాళ్లు ఏనుగులను తోలుకుని వస్తున్నారు. ఆవిధంగా ఏనుగులు గుంపులు గుంపులుగా సరోవరం దగ్గరకు వచ్చాయి. ఏనుగులన్నీ నీళ్ళలోదిగి వాటి ఇష్టంవచ్చినట్లు ఆటలాడుకున్నాయి. తొండాలతో నీళ్ళు పీల్చుకుని, చిమ్మనగ్రోవులు చిమ్ముకున్నట్లుగా చిమ్ముకున్నాయి. ఆడ ఏనుగులూ, మగ ఏనుగులూ ఒకదానిని ఒకటి రాచుకుంటూ తొండాలు తొండాలు తాకించుకుంటూ ఎన్నెన్నో తమాషాలు చేశాయి. నీళ్ళలో మునిగి ఇష్టం వచ్చినట్లు ఈతకొట్టాయి. ఆ మదించిన ఏనుగులు ఆ ప్రకారంగా చాలాసేపు జలవిహారంచేసి సరోవరాన్ని అల్లకల్లోలం చేశాయి. చివరకు మావటివాళ్ళు పట్ల - బలవంతాన వాటిని మళ్ళించారు. మళ్ళీ వాటినన్నింటినీ పట్టణానికి తోలుకుని పోయారు.

నీళ్ళు త్రాగవచ్చిన అశ్వమేధాశ్వం

తరువాత రథాల చప్పుళ్ళు వినవచ్చాయి. ఎన్నో రథాలు, వేలకొద్దీ గుఱ్ఱాలు, లెక్కలేనంత సైన్యం రావడం కనుపించింది. ఆ సైన్యం చూస్తుంటే సముద్రం పొంగి వస్తున్నట్లుగా ఉన్నది. ఒకటేమైన దుమ్మురేచి ఆకాశం అంటుతున్నది. వాయిద్యాలు దిక్కులు పిక్కటిల్లేటట్లు వినవస్తున్నవి. ఈ అర్భాటమంతా చూచాడు కర్ణకుమారుడు వృషకేతుడు. మహారాజు యౌవనాశ్వుడు తన సైన్యంతో రానేవచ్చాడనుకున్నాడు.దిగ్గునలేచాడు. దిక్కులు కలయ చూచాడు. ఆ వచ్చేది యౌవనాశ్వుడు కాదు, గుఱ్ఱాలు, నీళ్లుత్రాగడానికి వస్తున్నాయి. అని తెలుసుకున్నాడు. భీముణ్ణి చూచి "చిన్నా

యనా! ఈ వచ్చేది యౌవనాశ్వుడు కాదు. వేలకొద్దీ గుఱ్ఱాలు ఈ సరోవరంలో నీళ్ళు త్రాగడానికి వస్తున్నాయి ఉఱ్ఱట్లూగుతూ ఉరుకులు-పేశేలు పెట్టుకుంటూ వస్తున్నాయి అదిగో! అటుచూడు చిన్నాయనా! అఘ-మేఘాలమీద వస్తున్న అశ్వసమూహం. అవిగో! కొన్ని అప్పుడే కొలనులో నీళ్లుత్రాగి పోతున్నాయి. కాని చిన్నాయనా! రంగురంగుల గుఱ్ఱాలు, రకరకాల గుఱ్ఱాలు - ఇన్ని కనిపిస్తున్నాయి కాని, మనకు చెప్పిన గుర్తులుగల యజాశ్వం వీటిలో ఎక్కడా కనుపించడంలేదే ఏమిటి కారణం? దాన్ని అక్కడే కట్టేసిఉంచారేమో. ఉన్నచోటనే ఉంచి గడ్డీ-నీళ్ళూ అమర్చిపెడుతున్నారేమో? దాన్ని బయటికి ఎక్కడికీ విడిచిపెట్టరు కాబోలు." అన్నాడు. అది విని భీమసేనుడు-" అబ్బాయీ. ఇదొక పెద్దచిక్కుగా ఉన్నది. మనం ధర్మరాజులవారివద్ద నానా ప్రగల్భాలూ పలికివచ్చాం. ప్రతిజ్ఞలు చేసి వచ్చాం. ఇంతాచేసి తీరా మనం - గుఱ్ఱాన్ని తీసుకునిపోకుండా ఉత్తచేతులతో యింటికి పోయామూ అంటే - పదిమందీ మనలనుచూచి పక్కున నవ్వుతారు నాయనా. పుత్రుడులేని పురుషుడు పున్నామనరకంలో పడుతున్నాడు. ఆడదాని అడుపాజ్ఞల్లోఉండే అవివేకి. ఆయిన వాళ్ళందరికీ దూరమవుతున్నాడు మంత్రులతో ఆలోచనచెయ్యని రాజు రాజ్యం కోలుపోతున్నాడు. శ్రీహరిని చిత్తంలో నిలుపనివాడు సమస్త శుభాలకూ, సుఖాలకూ నోచుకోనివాడవుతున్నాడు. శివుణ్ణి పూజించనివాడు సిరిసంపదలు పొందనివాడవుతున్నాడు. ఆ విధంగానే మనం ఈ యజ్ఞాశ్వాన్ని పట్టుకోకుండా తిరిగివెడితే అపకీర్తిపాలవుతున్నాం నాయనా-" అని బదులు చెప్పాడు.

ఆ సమయానికి యజ్ఞాశ్వం అక్కడికి అరుదెంచింది మహాశీవిగా, మహారాజు బయలువెడలి వచ్చినట్లు వచ్చింది. దాని మెడలో బంగారు మువ్వలూ. ముత్యాల కుచ్చులూ వ్రేలాడుతున్నాయి ఛత్రచామరాదులతో, అగరుధూపాలతో, చిత్రవిచిత్రమైన ఆభరణాలలో, అలంకారాలతో అలరారుతున్నది ఆ అశ్వరాజం. దానికాళ్ళు ధరణిమీద ఆనడంలేదు.ఆ విధంగా తెల్లని - చల్లని వెన్నెల వెలుగుతో దిక్కులన్నీ వెలిగిస్తూ మహావైభవంగా యజ్ఞాశ్వం ఆ సరోవరానికి రావడం చూచాడు భీమసేనుడు. దానిని పట్టుకోవడానికి ప్రయత్నించాడు వృషకేతుడు. అప్పుడు భీముడు తొందరపడవద్దని అతన్నివారించి మనుమడైన మేఘవర్ణుడి వంక చూచాడు. ఘటోత్కచుడి కుమారుడు మేఘవర్ణుడు, భీమసేనుడికి నమస్కరించి - "తాతయ్యా! ఈ వస్తున్న సైన్యాన్ని యావత్తూ క్షణంసేపట్లో పారదోలుతాను ఆవుదూడను చెవిపట్టి లాక్కొచ్చినట్లుగా ఈ గుఱ్ఱాన్ని లాక్కొస్తాను. ఒక్కగుఱ్ఱం ఏమిటి? మీరు అనుజ్ఞ ఇవ్వాలేకాని - మహారాజయిన యౌవనాశ్వుణ్ణీ, అతని కుమారుణ్ణీ కూడా, మూటకట్టినట్టుకట్టి మూపునపెట్టుకుని తెచ్చి మీ ముందు ఉంచుతాను తాతయ్యా! చెప్పండి? ఏంచెయ్యమంటారో?-" అని సమరోత్సాహంతోపలికాడు-ఇలా పలికి మేఘవర్ణుడు వీరావేశం పొంగులెత్తగా సింహంపిల్ల దూకినట్లు కొండమీదనుంచి అమాంతం ఎగిరి క్రిందికి దూకాడు. దూకి తన రాక్షసమాయ ప్రయోగించాడు. ఆ మాయాప్రభావంవల్ల దిక్కులన్నీ కటికి చీకట్లు కమ్ముకున్నాయి. ఘనఘోంత రాళాలు దద్దరిల్లేటట్లు ఉరుములు ఉరిమాయి. కళ్ళు భ్రమలు కప్పేటట్లు తళతళ మెరుపులు మెరిశాయి. సమస్త భూతకోటి గుండెలు బ్రద్దలయ్యేటట్లు పిడుగులు పడ్డాయి. ఆవిధంగా రాక్షస వీరకుమారుడైన మేఘవర్ణుడు ఆకాశంలో నిలుచుని అద్భుతమైన మాయాజాలం పుట్టించాడు. మేఘనాథుడిలా మేఘనాదం వంటి సింహనాదం చేశాడు. అతని భయంకర సింహగర్జన విని దేవేంద్రుడు అదరి - బెదరి, ఏమిటీ విలయం అనుకున్నాడు. వీడెవడు? ఎందుకీ ఆర్భాటం చేస్తున్నాడు? - తెలుసుకొని రమ్మని ఒక దూతను పంపాడు. ఆదూత శీఘ్రంగా వెళ్ళి అంబరాన శాంబరీ విద్యలు ప్రయోగిస్తున్న మేఘవర్ణుణ్ణి చూచాడు-"ఎవరు

నీవు? ఎందుకింత భయంపుట్టిస్తున్నావు. దీనివల్ల నీకేంలాభం? నీవు ఎవరు పంపితే వచ్చావు? నాకు చెప్పు. నేను ఇంద్రునిదూతను. ఇంద్రుడు కనుక్కోమని పంపితే వచ్చాను -" అని అడిగాడు. అందుకు మేఘవర్ణుడు- "నేను భీమసేనుడి మనుమణ్ణి. ఘటోత్కచుడి కుమారుణ్ణి. నా పేరు మేఘవర్ణుడు. ధర్మరాజులవారు అశ్వమేధయాగం చేస్తున్నారు యాగానికి పనికివచ్చే గుఱ్ఱం ఈయౌవనాశ్వుడినగరంలో ఉన్నదని విన్నారు. నన్ను దాన్ని పట్టుకుని రమ్మన్నారు. అందుకని వచ్చాను. అందుకే మాయలుపన్నుతున్నాను. అంతేకాని మరేమీ కాదు-" అని బదులు చెప్పాడు, దూతవెళ్ళి ఆవిషయం ఇంద్రుడికి తెలిపాడు. విషయమంతా విని ఇంద్రుడు సంతోషించాడు.

మేఘవర్ణుడు గుఱ్ఱాన్ని అపహరించడం

ఆవిధంగా మేఘవర్ణుడు ఎన్నెన్నో మాయలుచేశాడు ఒకచోట రాళ్ళవాన కురిపించాడు. ఒకచోట నిప్పులుపుట్టించాడు. ఒకతావున ఫెళఫెళ ఉరుములు కళ్ళుమిరుమిట్లుగొలిపే మెరుపులూ కలిగించాడు. ఒకప్రక్క దట్టంగా దుమ్ముకమ్ముకునేటట్లు చేశాడు. ఒకవంక చీకట్లు విరజిమ్మాడు. ఈవిధంగా అతను రాజసైనికులందరినీ అదరగొట్టాడు. బెదరగొట్టాడు. సైనికులంతా చెదరి చీకాకుఅయి నలుప్రక్కలకూ పరుగుతీశారు. అప్పుడు మేఘవర్ణుడు గుఱ్ఱం నాలుగుకాళ్ళూ పట్టుకుని గొర్రెపిల్లను బుజానపెట్టుకున్నట్టు పెట్టుకుని చటుక్కున ఆకాశానికి ఎగశాడు. ఆఅద్భుతకార్యం చూచి దేవతలు ఆశ్చర్యచకితులయినారు. "అరెరె! చూడండి, చూడండి. ఆరాక్షసకుమారుడు గుఱ్ఱాన్ని ఎలాపట్టుకుని పోతున్నాడో!-" అని పెద్దపెట్టునకేకలుపెట్టారు. అతనిసాహసకార్యం ప్రశంసించారు. అతనిమీద పూలవాన కురిపించారు. గుఱ్ఱాన్ని ఎత్తుకుని ఆకాశానికి ఎగసిపోతున్న మేఘవర్ణుణ్ణిచూచి భీమసేనుడూ వృషకేతుడూ మహాసంతోషంతో సింహనాదాలు చేశారు.

రాజసైన్యంతో మేఘవర్ణుడియుద్ధం

అంతట భటులవలన ఈవార్తవిన్నాడు మహారాజు యౌవనాశ్వుడు. వినీవినడంతోటే ఉలిక్కి పడ్డాడు. ఆయనకు పట్టరానిఆగ్రహం వచ్చింది. నాగుఱ్ఱాన్ని పట్టేమొనగాడున్నాడా!- అన్నట్లుఉరిమిచూచాడు. వెంటనే యుద్ధానికిసిద్ధపడ్డాడు మహావీరులతో కూడినసైన్యాన్ని సమకూర్చుకున్నాడు. మేఘవర్ణుడిపై దండెత్తివెళ్ళాడు. ఆమ-మేఘాలమీదపోయే నాలుగువేలమంది రథికవీరులను మేఘవర్ణుడి మీదికి పంపించాడు. ఆమహావీరులు చండప్రచండంగా వెలుగుతూ మింటికి ఎగసి మేఘవర్ణుణ్ణి ఎదుర్కొన్నారు. అతనిమీద బాణాల వర్షం కురిపించారు గదలూ, శూలాలూ, ముసలాలూ- ఇంకా రకరకాల ఆయుధాలూ, అతనిపై విసిరారు. ఆవిధంగా తనను చుట్టుముట్టిన యౌవనాశ్వుని సైన్యాన్నిచూచి మేఘవర్ణుడు క్రోధంతో ఘూర్ణిల్లిపోయాడు. గుఱ్ఱాన్ని బుజంమీద ఉంచుకునే, ఆసైన్యంతో చిత్ర విచిత్రంగా యుద్ధంచేశాడు. ఒకపెద్దచెట్టును ఊడపెరికి దానితో ఆసైన్యాన్నియావత్తూ చెదరగొట్టాడు. గుఱ్ఱాన్ని భీమసేనుడిదగ్గరికి తెచ్చి, అక్కడొక చెట్టుకుకట్టివేశాడు. తాతకు దణ్ణంపెట్టి నిలుచున్నాడు. భీముడు మనుమణ్ణి కౌగలించుకున్నాడు- 'మహాద్భుతమైన కార్యంచేశావురా నాయనా.'- అంటూ మెచ్చుకుని దీవించాడు. అంతలో మళ్ళీవెనుకనుంచి యౌవనాశ్వుడి సైన్యాలువచ్చి మేఘవర్ణుణ్ణి చుట్టుముట్టాయి అదిచూచి మేఘవర్ణుడు ఉగ్రుడైమండిపడ్డాడు. రోషం పొంగులెత్తగా ఒకపెద్ద అరుపుఅరిచాడు. మహాసముద్రంలాఉన్న ఆసైన్యాలలో జొరబడి యుద్ధంచేయడం మొదలుపెట్టాడు. ఆప్రకారంగా మేఘవర్ణుడు మహాసముద్రంలోమందరగిరి గిరగిర తిరుగినట్లు తిరుగుతూ ఆమహాసైన్యంలో చాలాసేపు వీరవిహారం చేశాడు.

వృషకేతుడి యుద్ధం

ఆవిధంగా మేఘవర్ణుడు యుద్ధంచెయ్యడం చూచాడు వృషకేతుడు.—"అయ్యో! గుఱ్ఱాన్ని పట్టుకరావడంలోనే మేఘవర్ణుడు మిక్కిలి అలసిపోయాడు ఇంతమందితో ఇతనిప్పుడు యుద్ధంచేయలేడు. నేను వెళ్ళి ఈ రాజసైనికుల మదం అణచుతాను"- అనిచెప్పి మనస్సులో అనుకుని, ధనుస్సుపట్టుకున్నాడు. భీముడికి నమస్కరించి ఆయన అనుజ్ఞతీసుకుని, తాను బయలుదేరాడు. ఆవిధంగా వృషకేతుడు బయలుదేరివెళ్ళి మహాక్రోధంతో కళ్ళనుండి నిప్పులు కురిపిస్తూ శత్రుసైన్యంలో చొరబడ్డాడు. వింటినారి మ్రోగించాడు. ఆధ్వనికి శత్రువుల గుండెలుఅవిశాయి. తరువాత వృషకేతుడు, మేఘవర్ణుణ్ణిచూచి- "అబ్బాయీ. నీవు చాలాసేపు సమరంచేసి అలసిపోయావు. ఇహ నీవు కాసేపు అవతలకూర్చోనాయనా. వీళ్ళ పని నేనుపడతాను-" అనిచెప్ప అతన్నియుద్ధ భూమినుంచితప్పించాడు. తానువీరవిక్రమంతో విజృంభించి శత్రుసైన్యాలపై శరవర్షం కురిపించసాగాడు. త్రిపురాసుర సంహారంచేస్తున్న త్రినేత్రుడిలాఉన్నాడు వృషకేతుడు. ఉరికి ఉరికి శత్రువులను తాకుతూ చీల్చిచెండాడసాగాడు. అతనిధాటికి సైన్యాలు నిలువలేక పోయాయి. గుఱ్ఱాలు కూలాయి. రథాలువిరిగాయి ఏనుగులు తెగిపడ్డాయి. ఎక్కడిసైనికులక్కడ కుప్పకూలిపోతున్నారు. కొందరు సైనికులు భయవిచలితులై పలాయనం చిత్తగించారు. కొందరు రణరంగం వదలిప్రాణాలు దక్కించుకున్నారు ఈవిధంగా సైన్యమంతా చీకాకుపడి పోవడంచూచి—గాయాలు తగిలి నెత్తురుముద్ద అయిన ఒకసైనికుడు ఎలాగో పరుగెత్తుకుంటూపోయి మహారాజయిన యౌవనాశ్వుడికి ఈవిషయం ఎరుకపరిచాడు. తనసైన్యం నాశనంకావడం గుఱ్ఱం ఎత్తుకుని పోవడం విని యౌవనాశ్వుడు ఎంతో ఆశ్చర్యపడ్డాడు ఆరాజుకు ఎక్కడలేని రోషం పుట్టుకొచ్చింది. భటుణ్ణిచూచి—"ఓరీ. ఏమిటి నీవు అనేది? మనసైన్యమంతా హతమైపోయిందా? మనగుఱ్ఱాన్ని పట్టుకుని పోయారా? ఎన్నడూ విననివార్త ఈనాడువింటున్నానే. ఏమిటీవైపరీత్యం? అసలావచ్చింది ఎవరు? శత్రువులు ఎంతమందిఉన్నారు? నాకువివరంగాచెప్పు?"— అనికోపంతోఅడిగాడు అందుకు భటుడు మహారాజుకు మ్రొక్కి, భయపడుతూ-"మహారాజా. ఏం చెప్పమంటారు? ఆవచ్చినవాళ్ళు ఎవరో ఎరుగం. ముగ్గురువచ్చారు. ఆముగ్గురిలో ఒకడు కుఱ్ఱవాడు. నల్లగా కాళరాత్రిలాఉన్నాడు. డేగలాగారివ్వునవచ్చి సైన్యంలో దూరాడు. మన గుఱ్ఱాన్ని ఎత్తుకుని ఆకాశానికి ఎగసి పోయాడు. మీరుపంపించిన నాలుగువేలమంది రథికులనూ ఆకాశంలోనే హతంచేశాడు. అతనలాయుద్ధం చేస్తుండగా మరొకతను పెద్ద తాటిచెట్టులాగా, భయంకరమైన ఇనపగుదియ ఒకటి బుజాన పెట్టుకుని త్రిప్పుతూ నిలబడి ఉన్నాడు. అతని దగ్గర ఇంకొక చక్కని రాకుమారుడు యుద్ధం చెయ్యడానికి ఉర్రట్లూగుతూ ఉన్నాడు ప్రభూ!" అని భటుడు విన్నవించుకోగా విని యౌవనాశ్వుడు ఎక్కడలేని ఆశ్చర్యంలో మునిగిపోయాడు.

యౌవనాశ్వుడితో వృషకేతుని యుద్ధం

"ఏమిటీచిత్రం? ముగ్గురు రావడమేమిటి? అందులో ఒకడు గుఱ్ఱాన్ని పట్టడమేమిటి? ఒకడు సైన్యాన్నంతా హతం చెయ్యడమేమిటి? ఒకడు వినోదం చూస్తూ ఊరుకుని ఉండడమేమిటి? చూడబోతే వీరు సామాన్య మానవులుగా తోచడంలేదు. ఆ త్రిమూర్తులే వచ్చారా ఏం అనిపిస్తున్నది. నేను అశ్వమేధయాగం చెయ్యాలని ఎంతోప్రయాసపడి గుఱ్ఱాన్ని తెచ్చుకున్నాను. ఇప్పుడది పోయింది. పోతేపోనీ, కానీ ఈముగ్గురితో యుద్ధం చెయ్యాలి ముల్లోకాలనూ మూడు కోట్ల దేవతలనూ మెప్పించాలి"— అని నిశ్చయించుకున్నవాడై యౌవనాశ్వుడు, లెక్కలేనంత సైన్యాన్ని చతురంగబల సమేతంగా

సమకూర్చుకుని, రణభేరి మ్రోగించి యుద్ధానికి బయలుదేరి వచ్చాడు. వచ్చి ప్రళయకాలంలోని కాలాగ్నిరుద్రుడులా, గదాదండం గిరగిర త్రిప్పుతూ నిలవబడియున్న భీమసేనుణ్ణి చూచాడు. అతని దివ్యతేజోవిశేషాలకు అద్భుతమందాడు. తరువాత విల్లుచేతబూని తన సైన్యాన్ని యావత్తూసంహరించి, మళ్ళీయుద్ధానికి సిద్ధంగా ఉన్న వృషకేతుణ్ణి చూచాడు. చూచితల ఊచాడు— "అరె ఇంతటి మహాసైన్యంతో నేనుయుద్ధానికి వచ్చినప్పటికీ ఏమాత్రంలెక్క చెయ్యకుండా చస్తాననేభయం కూడాలేకుండా మహాయోగిలా ఉన్నాడే ఈ పిల్లవాడు."— అనిసంతోషమూ, మరోప్రక్క రోషమూ పెనవేసుకునిరాగా వృషకేతునిపై పదమని తన సేనలను ఆజ్ఞాపించాడు, యౌవనాశ్వుడు. అదిచూచి భీమసేనుడు రోషకషాయితలోచనుడై గదాదండం ఎత్తి ఆసైన్యంపైకి పోబోయాడు అప్పుడు కర్ణపుత్రుడు వృషకేతుడు అడ్డువచ్చి—"తండ్రి. ముల్లోకాలు ఎత్తివచ్చినా జయించే మహాబలశాలివి నీవు. ఇలాంటినీకు ఈ అల్పసైన్యం ఒకలెక్కా? చిన్నాయనా. కుమారుణ్ణి నేనుండగా మీకెందుకీ శ్రమ? మీరలాచూస్తూ ఉండండి. బడబాగ్ని అడవినికాల్చినట్లు నేనుఈశత్రుసైన్యాన్ని క్షణం సేపట్లో భస్మీపటలంచేస్తాను. అదీకాక తనువు అనిత్యం. వయస్సు చంచలం బలం అస్థిరం. కాబట్టి ఇన్నీఉన్నప్పుడే నన్నుజగద్విఖ్యాతమైన కీర్తిని ఆర్జించనివ్వండి. పాశాలనే చేతులూ, శంఖాలనే కంఠమూ, చక్రాలనే స్తనాలూ, గజగమనాలనే గమనవిలాసమూ కల శత్రుసేన అనే ఈ సుందరాంగిని ముందేనేను వరించాను కాబట్టినన్ను ఈమెతో క్రీడించనివ్వండి. కీర్తి అనే సంతానాన్ని పొందనివ్వండి. నేను వరించినకారణాన ఈమె మీకు కోడలవుతున్నది. కాబట్టి మీరుచేరడానికి వరసకాదు. చూడండి చిన్నాయనా! మిమ్మల్నిచూచి మీకోడలయిన ఈ సేనావధూటి సిగ్గుతో, వంగిన పతాకాలతో ఎలాతలవాల్చుకున్నదో!" —అన్నాడు అదివిని భీమసేనుడు—"నాయనా! నీవుచెప్పింది బాగానే ఉంది ఈసేన నీకువశమయిందా సరే. అలా కాక నీకు మీరిపోయిందా—మామ, కోడల్ని శిక్షించడం న్యాయమే కాబట్టినేను దీన్నిశిక్షించి లొంగకొడతాను. కాని, అబ్బాయీ, ఒక్కమాట. నీవా రథంలేక నేలమీద నిలవబడి ఉన్నావు. వారేమో రథాలెక్కివచ్చారు. వారితో ఎలా యుద్ధం చేస్తావు. నిన్నుఒంటరిగా పంపడానికి మనస్సు ఒప్పకుండాఉంది నాయనా"— అన్నాడు అందుకువృషకేతుడు"—మీకటాక్షం అనేది నాకుతోడుగా ఉండగా భయమెందుకు చిన్నాయనా? భయపడవద్దు. నన్ను యుద్ధానికి పంపండి"—అనిచెప్పి, ధనుర్బాణాలుతీసుకుని భీముడికి ప్రదక్షిణ నమస్కారాలుచేసి, మహాఉత్సాహంతో పెండ్లికి తరలివెళ్ళేపెండ్లికుమారునిలాబయలుదేరిశత్రుసైన్యం మీదికి వెళ్ళాడు. ఆవిధంగావెళ్ళి వృషకేతుడు శత్రుసేనలపై శరపరంపరలు కురిపించాడు. బాణప్రయోగంలో అతనుచూపిననేర్పుఇంతా-అంతాకాదు. అతనుబాణం ఎప్పుడు తీస్తున్నదీ, ఎప్పుడువింట తొడుగుతున్నదీ, ఎప్పుడు శత్రువులపై విడుస్తున్నదీ—ఎవరికీ ఎరుకపడటం లేదు. క్రుద్ధుడై, రుద్రుడై, వీరవిక్రమంతో విజృంభించి, చిత్రవిచిత్రంగా యుద్ధంచేస్తూ పండ్లు రాలుస్తున్నట్లు శత్రుసేనలను పుడమిపై రాల్చి వేస్తున్నాడు వృషకేతుడు. ఆ వీరకుమారుడి యుద్ధనైపుణ్యంచూచి యౌవనాశ్వుడు, ఆశ్చర్యపోతూ పెద్దపెద్ద కోరలుగల మదపుటేనుగుపై ఎక్కివచ్చి అతన్ని సమీపించాడు. —"అబ్బాయీ! నీవుచూడబోతే ఆదివిష్ణువులా వెలిగిపోతున్నావు. ముందునీపేరూ—ఊరూ, కులం, గోత్రం - నాకుచెప్పు. నీవిక్కడికి ఎందుకు వచ్చావోకూడా నాకుచెప్పు. కులగోత్రాలు తెలియకుండా యుద్ధం చెయ్యకూడదు. కాబట్టి ముందునీచరిత్రచెప్పు"— అనిఅడిగాడు యౌవనాశ్వుడు. అప్పుడు వృషకేతుడు— "మావంశానికి మూలపురుషుడు కశ్యపమహాముని వేదమూర్తిఅయిన సూర్యభగవానుడు మాతాత. ముల్లోకఖ్యాతిగన్నమహాదాత, కర్ణుడుమాతండ్రి. నా పేరువృషకేతుడు.

మాపినతండ్రి ధర్మరాజులవారు అశ్వమేధ యాగం చేయదలచారు. గుఱ్ఱం మీవశంలో ఉన్నదనివిన్నారు. భీమసేనుణ్ణీ, నన్నూ, ఘటోత్కచుడి కుమారుడైన మేఘవర్ణుణ్ణీ పంపారు. మీగుఱ్ఱాన్ని దొంగిలించినవాడు మేఘవర్ణుడు. మీసైన్యాన్ని హతమార్చిన వాణ్ణి నేను. అక్కడ వేడుకచూస్తూ నిలుచున్నవీరుడు మాపినతండ్రి భీమసేనుడు. ఇదీమాచరిత్ర"— అనిబదులుచెప్పాడు. అదివిని యౌవనాశ్వుడు సంతోషించి— "రాకుమారా! నీవుచాలాసేపు యుద్ధంచేసి అలసిపోయావు. కాసేపు విశ్రాంతి తీసుకో అలసియున్నవానితో అరి చేయరాదు. అంతేకాదు. నీవుపాదచారివి. నేనాఏనుగుఎక్కి వచ్చాను. నీతోయుద్ధం చెయ్యడం న్యాయం కాదు నీకు దివ్యరథంఇస్తాను. ఆరథంఎక్కి నాతోయుద్ధానికిరా"— అనిపలికాడు. ఆమాట విని వృషకేతుడు చిరునవ్వునవ్వుతూ—"రాజా! అడిగింది లేదనకుండా ఇచ్చే ఆ దేవేంద్రుడిలాంటివాడువచ్చి అర్థించగా, తనసహజకవచకుండలాలు కోసిఇచ్చాడు కర్ణుడు. అటువంటి దానకర్ణుడికుమారుణ్ణి నేను. మీరు రథంఇస్తేనేను పుచ్చుకునేదా? ఎక్కడిమాటరాజా! ఇవ్వడమే కానితీసుకోడం మావంశంలోనేలేదు. నీమాటలు చూడబోతే నీవుసంధిచేసుకోడానికి వచ్చినట్లు కనుపిస్తున్నది కాని సమరంచెయ్యడానికి వచ్చినట్లులేదు" — అన్నాడు. అప్పుడురాజు— "రాకుమారా. నీవుబాలుడవు. మేమాఅస్త్రవిద్యలో ఆరితేరిన వాళ్ళం. కాబట్టిముందు నీ పరాక్రమంచూపు. తరువాత మేం యుద్ధం చేస్తాం"—అన్నాడు. అదివిని వృషకేతుడుమళ్ళీ నవ్వాడు "రాజా! ముందుగాగుఱ్ఱాన్ని పట్టింది మేం. అదివిని మహారోషంతో యుద్ధానికి వచ్చినవారుమీరు. కనుకముందు మీప్రతాపం చూపించాలి ముందునేనే నాపరాక్రమం చూపిస్తే ఇహ ఆతరువాత నాతోయుద్ధంచేసే వారెవరు? అంతేకాదు నీవుపెద్దపెట్టున గుఱ్ఱాలనూ, ఏనుగులనూ, సైనికులనూ కూర్చుకుని మహాపటాటోపంతో రణభేరులు మ్రోగిస్తూ వచ్చావు. నీవుముసలివాడవు, నేనాపడుచువాడను. నేనుఒక్కణ్ణి అరిఅనుకోకు ఆశ్రీకృష్ణ పరమాత్మకటాక్షమే నాకు అక్షయబలం ఇన్ని మాటలు దేనికిరాజా? ముందుగుఱ్ఱాన్నిపట్టింది మేము. నీసైన్యాన్ని సంహరించింది మేము. తొలిదెబ్బతీసింది మేము. కాబట్టిఇహ ఇప్పుడు మీప్రతాపం ఏమిటోచూపండి, చూస్తాం"—అని వీరత్వంతో పలికాడు.

ఆమాటలకు యౌవనాశ్వుడికి ఎక్కడలేని రోషం పుట్టుకొచ్చింది. వెంటనే ఏనుగుదిగి రథం ఎక్కాడు. వృషకేతుణ్ణిఎదుర్కొన్నాడు.

(సశేషం)

Edited, Printed & Published by Sri J. Radhakrishna Reddy, Vijayawada-2.
Printed at Nava Bharathi Press, Vijayawada-2.